ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
28-1-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 357 పేజీలు: 10+4 వెల: 6.50

99% భారత్ ఉత్పత్తులకు ఐరోపాలో టారిఫ్‌లు నిల్ 3
ఫుట్‌బాల్ మైదానంలో కాల్పులు, 11 మంది మృతి 5






మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ప్రధాని మోడీ

## ఇయు - భారత్ మధ్య
# స్వేచ్ఛా వాణిజ్యం

**ఇండియా వాణిజ్య చరిత్రలోనే అతిపెద్ద డీల్**

**180 బిలియన్ యూరోల స్థాయికి వాణిజ్యం**

**ఇయు దేశాల్లో 8 లక్షల భారతీయులు**

**మీడియాతో ప్రధాని మోడీ, ఇయు నేతలు**

**న్యూఢిల్లీ,జనవరి 27:** భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎఫ్‌టీఏ భారత వాణిజ్య చరిత్రలోనే అతి పెద్దదిగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొ న్నారు. ఇది కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాకుండా, ఇరుదేశాల సంక్షేమానికి బ్లూప్రింట్‌గా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో భారత వాణిజ్యంలో సరికొత్త శకం ప్రారంభమవుతుందని

>>2

రెండు దశాబ్దాల కృషికి చిహ్నం: ప్రధాని మోడీ 2

# మోగిన నగారా

## ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఫలితాలు

### 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు

**నేటి నుంచి నామినేషన్లు, 31న స్క్రూటినీ.. అమల్లోకి వచ్చిన 'కోడ్'**

**షెడ్యూలు ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని**



మంగళవారం హైదరాబాద్‌లో మునిసిపల్ ఎన్నికల షెడ్యూలు ప్రకటిస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి27:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగరా మోగింది. దీంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని మంగళవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు.మున్సిపల్ ఎన్నికలకు సంబంధిందచి ఫిబ్రవరి 11న పోలింగ్ జరగుతుందని, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. బుధవారం నుంచి ఈనెల 30 వరకు నామినేషన్ల స్వీకరించనున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయని వెల్లడించారు. 30వరకు నామినేషన్ల స్వీకరణ తర్వాత 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన,నామినేషన్ల ఉపసంహారణకు ఫిబ్రవరి 3 వరకు గడువు ఉంటుందని.ఫిబ్రవరి 11న పోలింగ్, రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహణ,ఫిబ్రవరి 13న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో 116 మున్సిపల్ స్థానాలు,7కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగనుండగా, రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 52.43 లక్షల మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఓటర్లలో 26.80 లక్షల మహిళా ఓటర్లు, 25.62 లక్షల పురుష ఓటర్లు, 640 ఇతరులు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలు 8,203 ఏర్పాటు కానుండగా, ఓట్ల లెక్కింపు కేంద్రాలు 136 ఉండనున్నాయి.కాగా, ఓట్ల పోలింగ్ కోసం బ్యాలెట్ బాక్సులు 16,301 సమకూర్చనున్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటికే దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. ఈ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52.43 లక్షల మంది ఓటర్లు ఉన్నారని వారంతా తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు,ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నికఉంటుందని రాణికుముదిని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనుండగా, 8,203 పోలింగ్ కేంద్రాలు, 136 లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎస్, డీజీపీ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా మున్సిపల్ ఎన్నికల్లో వివిధ వర్గాలకు రిజర్వేషన్ స్థానాలను పరిశీలిస్తే బీసీ జనరల్ 463, బీసీ మహిళలు 391, ఎస్సీ జనరల్ 254, ఎస్సీ మహిళలు 190, ఎస్టీ జనరల్ 147,ఎస్టీ మహిళలు 40, జనరల్ వార్డులు 647, జనరల్ మహిళలకు రిజర్వ్‌వార్డులు 864గా ఉన్నాయి.

>>2



అఖిలపక్షభేటీలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కిరణ్‌రిజిజు

# నేటి నుంచి పార్లమెంట్

**రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ఆరంభం**

**ఫిబ్రవరి 1న బడ్జెట్**

**న్యూఢిల్లీ, జనవరి 27:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత జరుగనుండగా, మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో విడత సమావేశాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. దీంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. మరుసటి

>>2

## ఫోన్ ట్యాపింగ్ వెనుక
# ఎవరున్నారు?

**మాజీ ఎంపి సంతోష్ రావును ఏడున్నర గంటలు ప్రశ్నించిన సిట్**

**ఎస్‌ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుకు రెండుసార్లు ఎక్స్‌టెన్షన్ ఎలా వచ్చిందని ప్రశ్న**



మంగళవారం హైదరాబాద్‌లో సిట్ ఎదుట హాజరయ్యేందుకు వెళ్తున్న సంతోష్‌రావు

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ మాజీ ఎంపి సంతోష్ రావును సిట్ అధికారులు మంగళవారం నాడు ఏడున్నర గంటల పాటు విచారించారు. ఇదే కేసులో గత వారం నాడు పార్టీ అగ్రనేతలు హరీష్ రావు, కెటిఆర్‌లను సిట్ అధికారులు సుధీర్ఘంగా విచారించడం తెలిసిందే. వీరిద్దరి విచారణ తరువాత మరికొందరు బిఆర్‌ఎస్ ప్రముఖులను సిట్ విచారించనుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో సంతోష్ రావుకు సోమవారం నాడు నోటీసులు జారీ చేయగా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆయన సిట్ ఎసిపి ఎదుట విచారణకు హాజరయ్యారు. సంతోష్ రావు విచారణలో ఎస్‌ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుకు అప్పట్లో పదవీ విరమణ తరువాత రెండుసార్లు ఎక్స్‌టెన్షన్ లభించడంలో ఎవరి పాత్ర వుందనే అంశంతో పాటు కెసిఆర్‌తో ఆయనకున్న సాన్నిహిత్యంపైనా ప్రశ్నించినట్లు తెలిసింది. అ ప్పట్లో జరిగిన వేలాది ఫోన్ల ట్యాపింగ్ వెనున వున్న వారు ఎవరు...? అనే దానిపైనా సంతోష్ రావును ప్రశ్నించినట్లు తెలిసింది. కాగా సంతోష్ రావును విచారించిన తరువాత వెలుగు చూసిన సమాచారం ఆధారంగా ఇదే కేసులో ఒకటి రెండు రోజుల్లో మరికొందరు బిఆర్‌ఎస్ ముఖ్య నేతలకు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది. బిఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ వేగం పుంజుకుంది. 2024 మార్చిలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ పై మొ దట పంజాగుట్టలో కేసు నమోదు కాగా దీనిపై విచారణకు ఎసిపి స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయగా దాదాపు రెండేళ్లు ఈ సిట్ వి చారణ సాగించింది. రెండు నెలల క్రితం దీనిపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నేతృత్వంలో మరో

>>2

## బొగ్గు కుంభకోణంపై
# సిబిఐ దర్యాప్తు జరపాలి

**సిఎం అంటే కోల్ మాఫియాకి నాయకుడు అని భావించే పరిస్థితి**

**సోలార్ పవర్ టెండర్లలో ఒక్క మెగావాట్‌కు రూ.7కోట్లు ఎందుకు?**

**ఆధారాలతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫిర్యాదు చేసిన కెటిఆర్**



మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తున్న బిఆర్‌ఎస్ నాయకులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి27:** సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మంగళవారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి సింగరేణిలో బొగ్గు గనుల కేటాయింపులో కుంభకోణం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని, ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని అన్నారు. కుంభకోణాన్ని బహిర్గతం చేశాక అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని

>>2

మేడారం జాతరలో స్పెషలిస్టు డాక్టర్లతో వైద్యసేవలు: మంత్రి దామోదర 6



హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందర రామన్. చిత్రంలో తదితర మహిళా నేతలు

## గాలీ, నీరు కూడా
# ప్రైవేటు పరమేనా?

**మహిళలపై దాడులకు తెగబడుతున్న ఆరెస్సెస్, బిజెపి**

**తెలంగాణలో అభయహస్తం కొనసాగించాలి**

**ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందర రామన్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 27:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి, ఆర్‌ఎస్‌ఎస్ మహిళలపై దాడులకు తెగబడుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ఉపాధ్యక్షురాలు సుధ సుందర రామన్ విమర్శించారు. మనిషి జీవించేందుకు తప్పనిసరి అయిన గాలి, నీటిని సైతం ప్రైవేటుపరం చేస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాల దిశగా ముందుకెళ్లనున్నట్టు ఆమె చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఐద్వా 14వ జాతీయ మహాసభల మూడవ రోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐద్వా

>>2

## వనదేవతలకు
# వందనం..

## ఆదివాసీ కుంభమేళా నేడే ఆరంభం



**సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక**

**రేపు గద్దెపై కొలువు దీరనున్న సమ్మక్క**

**మహాజాతరకు మేడారంలో భారీ ఏర్పాట్లు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి27:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర ప్రారంభానికి సర్వం సిద్ధంగా ఉంది. ఆదివాసీ కుంభమేళాగా పిలుచుకునే మేడారం మహా జాతర బుధవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. బుధవారం సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల రాకతో మహాజాతర మొదలు కానుంది. ఆ తర్వాతి రోజు సమ్మక్క తల్లి గద్దెపై కొలువు దీరనుంది. దీంతో వన దేవతలతో నిండుజాతర ఆవిష్కృతం కానుంది. మహా జాతరకు నెల రోజుల ముందు నుంచే భక్తుల రద్దీ మొదలైంది. పల్లె, పట్నం తేడా లేకుండా వాహనాలు మేడారానికి వరుస కడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, ఛత్తీసగఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున వన దేవతల చెంతకు చేరుతున్నారు. వారాంతాల్లో 8 నుంచి 10 లక్షల మంది భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలాచరించి నిలువెత్తు బంగారాన్ని సమర్పిస్తున్నారు.ఇక గద్దెలపైకి తల్లులు వచ్చేనాటికి ఊళ్లకు ఊళ్లే మేడారానికి తరలి వెళ్లనున్నాయి. మేడారం మహా జాతరను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం, భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఆలయ అభివృద్ధి, జాతర ఏర్పాట్ల కోసం రూ.251 కోట్లు వ్యయం చేసింది. మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది, మేడారం జాతర విధులు నిర్వహించనున్నారు. మరో 2 వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా సేవలందించనున్నారు. జాతర వేళ భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్‌కు జిల్లా స్థాయి అధికారి ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్‌కు మండల స్థాయి అధికారి

>>2




హైదరాబాద్‌లో ఆందోళన చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

# స్తంభించిన బ్యాంక్‌లు

**తెలంగాణ, ఎపిలో సమ్మెలో పాల్గొన్న లక్షమంది ఉద్యోగులు**

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాత వార్త:** వరుస సెలవులు, ఆపై ఒక్క రోజు సమ్మె జరుగడంతో దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు స్థంభించిపోయాయి. ఈ సమ్మెతో రూ.30 వేల కోట్ల విలువైన లావాదేవీలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రభావం సమ్మెతో ఏటీఎంలలో నగదు కొరత ఏర్పడి సుమారు 3,447 కోట్ల విలువైన లావాదేవీలకు అవాంతం ఏర్పడింది. అయితే ప్రైవేట్ బ్యాంకులు యథావిధిగా

>>2



మంగళవారం బేగంపేట్ ఎయిర్ షోలో వైమానిక విన్యాసాలు

## ఫోన్ ట్యాపింగ్ వెనుక ఎవరున్నారు?

>> సిట్‌ను ఏర్పాటు చేశారు. మొదటి సిట్ హయాంలో నలుగురు పోలీసు అధికారులు అరెస్టంగా మీడియా అధినేత శ్రవణ్ రావు ముందస్తు బెయిల్ పొంది విచారణకు హాజరుకాగా ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు అమెరికా నుంచే ముందస్తు బెయిల్ పొంది మొదటి సిట్ సమయంలో లేఖలు పంపి విచారణ ముగించగా రెండవ సిట్ ఏర్పాటయ్యాక విచారణకు హాజరయ్యారు. ఈ క్రమంలోనే ప్రభాకర్ రావును పోలీసులు కోర్టు అనుమతితో రెండు వారాల పాటు పోలీసు కస్టడీలో వుంచి ప్రశ్నించారు. ప్రభాకర్ రావు విచారణలో ఎలాంటి వివరాలు వెల్లడికాలేదని సిట్ అధికారులు సుప్రీం కోర్టుకు తెలిపారు. ప్రభాకర్ రావు విచారణ తరువాత బిఆర్ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావును, హరీష్ రావును ఈ నెల 20వ తేదీన తొలిసారిగా విచారించారు. హరీష్ రావును ఏడు గంటల పాటు విచారించిన సిట్ అధికారులు ఆయన నుంచి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక సమాచారం రాబట్టారని తెలిసింది. హరీష్ రావు విచారణ తరువాత బిఆర్ఎస్ అగ్రనేత కెటిఆర్‌ను సుదీర్ఘంగా విచారించారు. హరీష్ రావు, కెటిఆర్‌ల విచారణ తరువాత సిట్ బాస్‌గా వున్న సజ్జన్నార్ మీడియాకు వివరాలు అందించారు. వీరిద్దరి విచారణ తరువాత సంతోష్ రావు వంతు వచ్చింది. ఆయనను మధ్యాహ్నం వేళ విచారణకు పిలిచారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఆయనను విచారించారు. సిట్ నుంచి ఇద్దరు అధికారులు, వారి బృందం విచారణలో పాల్గొన్నారు. కాగా సంతోష్ రావు విచారణలో అప్పట్లో ఎస్ఐబి బాస్‌గా ప్రభాకర్ రావుకు రెండుసార్లు ఎక్స్‌టెన్షన్ ఎవరి వల్ల లభించిందని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రభాకర్ రావుతో మీకు ఎంతకాలం నుంచి పరిచయం వుంది...? మీరు ఎంపిగా ఎన్నికైన తరువాత పరిచయం వుందా...? అంతకు ముందే పరిచయం వుందా...? మీ ప్రోద్బలం వల్లే ప్రభాకర్ రావుకు పదవీ విరమణ తరువాత కూడా ఎక్స్‌టెన్షన్ లభించిందనేది నిజమా,..? అని సిట్ అధికారులు సంతోష్ రావును ప్రశ్నించినట్లు తెలిసింది. నిఘా విభాగంలో ఎంతో కీలకంగా వుండే ఎస్ఐబికి బాస్‌గా పదవీ విరమణ చేసిన అధికారిని కొనసాగించడం నిబంధనలకు విరుద్ధమని మీకు తెలుసా...? ఒకవేళ తెలిస్తే...? ఇలా ఎందుకు చేయాల్సి వచ్చింది...? అని సంతోష్ రావును సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అప్పట్లో జరిగిన వేలాది ఫోన్‌ల ట్యాపింగ్ వెనుక ఎవరెవరి హస్తం వుంది...? ప్రభాకర్ రావుకు సహకరించిన రాజకీయ నేతలు, మీడియా అధినేతలు, పోలీసు అధికారులు ఎవరు...? అని సంతోష్ రావును సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. మీడియా అధినేత శ్రవణ్ రావుతో మీకు వున్న సంబంధాలు ఏమిటీ...? ఫోన్ ట్యాపింగ్‌లో ఆయన పాత్ర గురించి మీ వద్ద ఎలాంటి సమాచారం వుంది...? ఎవరి ఫోన్లు ట్యాపింగ్ చేయాలనే దానిపై జాబితాను రోజువారిగా శ్రవణ్ రావు ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్ రావుకు అందించడం వెనుక మీ ప్రమేయం వుందా...? ఈ విషయమై వచ్చిన వార్తల్లో నిజం ఎంత...? అసలు ఫోన్ ట్యాపింగ్ అక్రమమని మీకు తెలుసా,..? ఈ నేరం రుజువైతే కఠిన శిక్ష పడుతుందనే విషయం మీకు తెలుసా,..? అని సంతోష్ రావును అడిగినట్లు సమాచారం. దీంతో పాటు ఎస్ఐబి బాస్ తరువాత ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యు) ఓఎస్‌డిగా ప్రభాకర్ రావు నియామకం వెనుక ఎవరి హస్తం వుంది...? నాటి సిఎం కెసిఆర్‌ను ఈ విషయంలో మీరే ఒప్పించారా...? అని ఆయనను ప్రశ్నించినట్లు తెలిసింది. నిఘా విభాగం బాస్‌గా నవీన్ చంద్ పదవీ విరమణ తరువాత ఆయన స్థానంలో పూర్తిస్థాయిలో ప్రభాకర్ రావును అధిపతిగా నియమించడం వెనుక ఎవరి హస్తం వుంది...? ఇలా చేయడం సరైందని కాదని మీకు తెలుసా...? అని సంతోష్ రావును సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. సిట్ ప్రశ్నలకు చాలా వాటికి సంతోష్ రావు సరైన సమాధానాలు చెప్పలేదని సమాచారం. కొన్నింటికి పొడిపొడిగా ముక్తసరిగా సమాధానాలు చెప్పారని తెలిసింది. మరికొన్నింటికి మౌనం వహించినట్లు తెలిసింది. విచారణ తరువాత సంతోష్ రావు మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

## వనదేవతలకు వందనం..

>> బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్‌టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. మొబైల్ నెట్‌వర్క్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా 27 శాశ్వత టవర్లతో పాటు 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మతులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం మంచినీటి సరఫరా జరిగేలా మిషన్ భగీరథతో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగునీటి నల్లాలు ఏర్పాటు చేశారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలాచరించే భక్తుల కోసం 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు. జాతరలో ప్రధానమైన పారిశుద్ధ్య నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను ప్రభుత్వం చేసింది. 285 బ్లాకుల్లో 5,700 టాయిలెట్లను సిద్ధం చేసింది. వీటికి అదనంగా మొబైల్ టాయిలెట్స్‌ను అందుబాటులోకి తేనున్నారు. 5 వేల మంది సిబ్బందిని, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషన్లు, 12 జేసీబీ, 40 స్వచ్ఛ ఆటోలు, 16 డోజర్లను రంగంలోకి దింపారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా టీజీఎన్ పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా 350 మంది సిబ్బందిని నియమించారు. మహా జాతర నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ 4 వేల బస్సులను నడుపుతోంది. ఆరోగ్య సేవల కోసం 5 వేల మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. మేడారం వెళ్లే భక్తులంతా ముందుగా ములుగు జిల్లాలోని గట్టమ్మకు మొక్కులు చెల్లించుకోవడం దశాబ్దాల ఆనవాయితీ.

## మోగిన నగారా

>> మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు ఎస్ఈసీ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎస్ రామకృష్ణారావు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి, డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీ మహేశ్ భగవత్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎస్ఈసీ ఎన్నికల కోడ్ అమలు, తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్టేట్ ఎలక్షన్ కమిషన్ చైర్మన్ రాణికుముదిని హెచ్చరించారు.

**రాజకీయ పార్టీల వ్యూహాలు :**
మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతూనే ఉన్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలు హోరాహోరీగా తలపడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో పెద్ద మొత్తంలో సీట్లు గెలుచుకున్న బీఆర్ఎస్ ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే స్థాయిలో గెలుపు కోసం రకరకాల వ్యూహాలను రచిస్తోంది. ఈ బాధ్యతను ముఖ్యంగా కేటీఆర్ తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ముఖ్యమంత్రి కొన్ని జిల్లాల్లో ఏకంగా బహిరంగ సభలే నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే వేగంగా అభివృద్ధి జరుగుతుందని ప్రజలను కోరారు. ఇప్పటికే ఆయా ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులను, కీలక నేతలను ఇన్‌చార్జీలుగా నియమించారు. సిఎం రేవంత్‌రెడ్డి దావోస్, అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత మున్సిపల్ ఎన్నికల ప్రచారం కోసం ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఇక బీజేపీ కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలతో ప్రచారం చేయాలని చూస్తోంది. ఇప్పటికే పదాదికారుల సమావేశం నిర్వహించింది. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వెల్లడైన నేపథ్యంలో అన్ని పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపిక కసరత్తులో పడ్డాయి. పార్టీ ఫిరాయింపు కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు తాము బిఆర్ఎస్ పార్టీని వీడలేదని చెబుతున్నా వారి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు బిఫామ్ ఇవ్వ వచ్చా లేదా అనే తర్జనభర్జనలో పడ్డారు.

## వారం - వర్జ్యం

28-01-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
దశమి సా.4.34, కృత్తిక ఉ.9.26
వర్జ్యం : రా.12.09-1.38
దు.ఉ.11.58-12.43
శుభసమయం : ఉ.9.00-9.45
సా.5.30-6.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. మానసిక ప్రశాంతత పొందుతారు. రాజకీయరంగాల వారికి విదేశీ పర్యటనలు.

**మిథునం:** చేపట్టిన పనులలో అనేకమైన వాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు. ధనలాభం పొందుతారు.

**కర్కాటకం :** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదే పై చేయిగా నిలుస్తుంది.

**సింహం:** సన్నిహితుల నుండి అతి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. ఒత్తిడుల నుండి బయటపడతారు.

**కన్య :** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి. ఆరోగ్య సమస్యలు కొంత వరకు మెరుగుపడుతాయి.

**తుల :** భూ వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**వృశ్చికం:** రాజకీయ, కళారంగాల వారికి యోగదాయకం. తద్వారా లాభపడడతారు. బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు.

**ధనుస్సు:** కొన్ని వాయిదా పద్ధతులలో వస్తువులను కొనుగోలు చేస్తారు. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం తగదు.

**మకరం:** శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తి చేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**కుంభం:** భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది. ప్రయాణాలు.

**మీనం :** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బొగ్గు కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు జరపాలి

>> అన్నారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సిఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సింగరేణి టెండర్లలో పారదర్శకత లేదని అన్నారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి సృజన్ రెడ్డి ముఖ్యమంత్రికి బావమరిదేనా, కాదా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరులకు ఇదివరకే దోచుకున్నది సరిపోక, హిల్ట్ పాలసీ పేరుతో హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాడల్లోని రూ.5 లక్షల కోట్ల విలువైన 9,200 ఎకరాల భూములను కొల్లగొట్టే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కుంభకోణం, హిల్ట్ పాలసీ వంటి ప్రజాధానాన్ని కొల్లగొట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరామని అన్నారు. సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైందని.. తాము సోలార్ పవర్ స్కాం గురించి కూడా బయటపెట్టామని కేటీఆర్ అన్నారు. భారతదేశంలో ఎక్కడైనా మెగావాట్‌కు రెండున్నర నుంచి మూడు కోట్లలో నేడు సోలార్‌లో నిర్మాణం జరుగుతుంది. కానీ తెలంగాణలో సింగరేణి పిలిచిన సోలార్ టెండర్లలో మాత్రం రూ.7 కోట్లట.. దేశం మొత్తంలో 2,3 కోట్లలో అయ్యేది ఒక్క తెలంగాణలోనే రూ.7 కోట్లు ఎందుకు అవుతుంది.. ఇది సోలార్ పవర్‌లో స్కాం కాదా అని మేం నిలదీస్తే ఇంతవరకు సమాధానం లేదని ప్రశ్నించారు. అలాగే గనుల్లో వాడే పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్ 30 శాతం అదనంగా రేటు పెంచారు. ఎందుకు పెంచారని అడిగితే సమాధానం లేదన్నారు. సింగరేణిలో ఒక డైరెక్టర్ జీవీ రెడ్డి, డైరెక్టర్ వీకే శ్రీనివాస్.. ఈ ఇద్దరూ కూడా ఈ 30 శాతం అదనంగా ఎందుకు పెడుతున్నారు, ఖర్చు ఇంత పెట్టాల్సిన అవసరం లేదు. జిలెటిన్ స్టిక్స్, పేలుడు పదార్థాల మీద 30 శాతం ఎందుకు పెంచారని డైరెక్టర్లు బోర్డులో నిలదీస్తే వాళ్ల మీద చర్యలు తీసుకున్నారు తప్ప కాంట్రాక్టర్లను లాభం చేసే పనిలో మాత్రం కాంగ్రెస్ పార్టీ వెనకకు తగ్గలేదు.. ఇది వాస్తవమా..? అని మేం నిలదీస్తే సమాధానం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అన్ని విషయాలు గవర్నర్ దృష్టికి సవివరంగా తెచ్చాం. బెదిరించి కాంట్రాక్టర్లను ఒక రింగు చేసి ప్రజాధనాన్ని.. ప్రజాధనం ఎందుకంటే సింగరేణి కాలరీస్ అనే సంస్థలో 51 శాతం ఓనర్‌షిప్ తెలంగాణ ప్రభుత్వానిది..49 శాతం ఓనర్‌షిప్ కేంద్రప్రభుత్వానిది. మరి ప్రభుత్వాలది అన్నప్పుడు ఈ సొమ్ము మొత్తం ప్రజలదే.. సింగరేణి కార్మికులదేనన్నారు. వేల కోట్ల రూపాయలు ఏ రకంగా ఈ ప్రభుత్వం కొల్లగొడుతున్నదో.. దీనిపై మేం ఎన్నిసార్లు అడిగినా సమాధానం రావడం లేదన్నారు. వాస్తవేమేంటంటే అన్నదమ్ముళ్లు దోచుకున్నది రేవంత్‌రెడ్డికి సరిపోవడం లేదట. హిల్ట్ కుంభకోణం పేరు మీదు హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాడల్లో భూములను కొల్లగొట్టడానికి రూ.5 లక్షల కోట్ల విలువ చేసే 9200 ఎకరాల భూమిని కొల్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తే మా పార్టీ బయటకు తీసుకొచ్చింది. అన్నదమ్ముళ్ల దోపిడీని అడ్డుకున్నది. కానీ రేవంత్ రెడ్డికి అన్నదమ్ముళ్ల దోపిడి సరిపోవడం లేదట. ఇప్పుడు బావమరిది కండ్లలో ఆనందం కోసం సింగరేణిని ఆయనకు గుత్తకు రాసిచ్చిండని కేటీఆర్ ఆరోపించారు.

## గాలీ, నీరు కూడా ప్రైవేటు పరమేనా?

>> జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి, జాతీయ సహాయ కార్యదర్శి అర్చనా ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. 1981లో ఆవిర్భవించిన ఐద్వా దేశవ్యాప్తంగా 1.06 కోట్ల సభ్యత్వంతో దేశంలోని 26 రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాన్ని చేస్తున్నదని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళలపై దాడులను తీవ్రతరం చేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని నిరూపించుకోలేని విధంగా డాక్యుమెంట్లను సమర్పించాలని కోరుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్ పేరుతో బీహార్‌లో ఎన్నికలకు ముందు 65 లక్షల మంది ఓటర్లను తొలగిస్తే అందులో 45 లక్షల మందికి పైగా మహిళలున్నారని ఆమె తెలిపారు. ఇందులోనూ బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వారిని లక్ష్యంగా చేసుకుని బీజేపీ వారి ఓటు హక్కును తొలగించిందని మండిపడ్డారు. చనిపోయిన తమ తండ్రుల బర్త్ సర్టిఫికెట్లు సమర్పించాలని కొర్రీలు పెడుతూ మహిళలను వేధిస్తున్నారని చెప్పారు. వాతావరణ మార్పుల ప్రభావం మహిళలను మరింత ఒత్తిడికి గురి చేస్తున్నదని సుధా సుందర రామన్ తెలిపారు. అనేకసార్లు ప్రకృతి విపత్తుల కారణంగా మహిళలకు నివసించేందుకు చోటు కూడా లభించని పరిస్థితి నెలకొందన్నారు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల కోసం అనేక రాష్ట్రాల్లో అడవులను నరికేస్తుంటే వాతావరణంలో అనూహ్యమైన మార్పులు సంభవించి వరదలు ప్రకృతి విపత్తులు వస్తున్నాయన్నారు. ఇప్పటికే ఢిల్లీలో స్వచ్ఛమైన గాలి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారని గుర్తుచేశారు. సహజ వనరులను ప్రైవేటీకరిస్తూ, విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేస్తున్న సర్కారు పాఠశాలల విలీనం, మూసివేతలతో బాలికలను చదువులకు దూరం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ మహిళల బతుకులపై బీజేపీ దాడి చేస్తోందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవించడానికి ఆ వర్గాలు చేస్తున్న పోరాటాలకు ఐద్వా అండగా ఉంటుందని ఆమె తెలిపారు. కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఐద్వా పాల్గొంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఆర్బీఐ మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు పావలా వడ్డీకి రుణాలిస్తే వారు రూ.2 నుంచి రూ.10 వడ్డీకి మహిళకిచ్చి పీడిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేధింపులకు వ్యతిరేకంగా ఐద్వా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. డ్రగ్స్, మద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలకు పరోక్షంగా మహిళలు బలౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్పటికీ కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయని పుణ్యవతి ఆందోళన వ్యక్తం చేశారు. అభయహస్తం పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళలు పొదుపు చేసిన రూ.600 కోట్లను తిరిగి వారికివ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. 85 శాతం మంది మహిళలకు ఉపాధినిస్తున్న నరేగా పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక రాష్ట్రాల నిధులు కేంద్రానికి వెళుతున్న నేపథ్యంలో రాష్ట్రాల వాటాతో ముడిపెడుతూ తెచ్చిన వీబీజీరామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలో 250 ఇండ్ల పట్టాలను ఐద్వా పోరాడి సాధించిందని తెలిపారు. ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి స్ఫూర్తితో భవిష్యత్తులో పోరాటాలు చేస్తామన్నారు. మహాసభల సందర్భంగా ఐద్వా నాయకులు ఏడు ప్రచురణలను విడుదల చేశారు.



మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో మీడియాతో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ప్రధాని మోడీ

## ఇయు - భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

>> ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి ప్రధాని మోడీ మాట్లాడారు. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు తొలిసారి ఈయూ నేతలు ముఖ్య అతిథులుగా హాజరైన మరుసటి రోజే కీలక ఒప్పందం కుదరడం చరిత్రాత్మక ఘట్టమని ఆయన అన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్ ఈయూ సంబంధాలు వేగంగా బలోపేతమయ్యాయని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక అనుబంధం, ప్రజల మధ్య బంధాలే దీనికి పునాదిగా నిలిచాయని తెలిపారు. ప్రస్తుతం భారత్ ఈయూ మధ్య వాణిజ్యం 180 బిలియన్ యూరోల స్థాయికి చేరిందని వెల్లడించారు. ఎనిమిది లక్షల మందికి పైగా భారతీయులు ఈయూ దేశాల్లో నివసిస్తూ అక్కడి సమాజాలకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ పాలన, అభివృద్ధి భాగస్వామ్యం వంటి రంగాల్లో విస్తృత సహకారం కొనసాగుతోందని మోదీ తెలిపారు. ఈ ఒప్పందంతో రైతులు, చిన్న వ్యాపారులు, సేవల రంగానికి చెందినవారికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. యూరోపియన్ మార్కెట్లకు భారత ఉత్పత్తులకు మరింత విలువ లభిస్తుందని, పెట్టుబడులు పెరుగుతాయని, సరఫరా వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు. 16వ భారత్ - ఈయూ సదస్సు సందర్భంగా ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం కీలక ఒప్పందం ఖరారైంది. ఇదే సమయంలో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందం కూడా కుదిరింది. జపాన్, దక్షిణ కొరియా తర్వాత ఆతరహా ఒప్పందం చేసుకున్న మూడో ఆసియా దేశంగా భారత్ నిలిచింది. ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమంలో మోడీ, భారత్ ఈయూ ఒప్పందాన్ని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా అభివర్ణించారు. ప్రపంచ జీడీపీలో నాలుగో వంతు వాటా కలిగిన రెండు ప్రధాన ఆర్థిక శక్తులను కలుపుతున్న కీలక ఒప్పందమిదని అన్నారు. భారత్ ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి 2007లోనే చర్చలు మొదలయ్యాయి. ఆటోమొబైల్స్, వైన్‌పై దిగుమతి సుంకాలు, ఫార్మాస్యూటికల్స్ వంటి అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మధ్యలో నిలిచిపోయిన చర్చలు 2022లో తిరిగి ప్రారంభమయ్యాయి. గతేడాది ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ ఎఫ్‌టీఏ కోసం వేగంగా అడుగులు పడ్డాయి. 2025లో యూరోపియన్ కమిషనర్ల బృందం భారత్‌కు వచ్చి భద్రతా చర్చలు జరిపింది. అదే ఏడాది సెప్టెంబర్‌లో యూరోపియన్ రాజకీయ - భద్రతా కమిటీ తొలిసారి ఆసియాకు వచ్చి భారత్‌లో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించింది. డిసెంబర్ 2025లో భారత రక్షణ తయారీదారుల బృందం బ్రస్సెల్స్‌లో యూరోపియన్ అధికారులతో సమావేశమైంది. ఇప్పుడు 2026 భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు తొలిసారి ఈయూ నేతలు ముఖ్య అతిథులుగా హాజరైన మరుసటి రోజే కీలక ఒప్పందం కుదిరింది.

## నేటి నుంచి పార్లమెంట్

>> రోజు రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టి చర్చించనున్నారు. ఆ తర్వాత ఎకనామిక్ సర్వేను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఫిబ్రవరి 1న ఆదివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే పూర్తయినట్లు విత్త మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు అవకాశమివ్వాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. అలాగే దేశంలో పెరిగిపోయిన నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు, ఇతర ప్రజా సమస్యలపై చర్చకు అవకాశమివ్వాలని ప్రతిపక్షాలు కోరాయి. అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఐదుగురు డిఎస్పీల బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి27:** రాష్ట్ర పోలీస్ శాఖలో ఐదుగురు డిఎస్పిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డిజిపి బి.శివధర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పోలీస్ అకాడమీ స్టాండ్స్ డిఎస్పి, ఇల్లందు ఎస్‌డిపిఓగా విధులు నిర్వహిస్తోన్న ఎస్.సారంగపాణి వైరా ఏసిపిగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం జిహెచ్ఎంసిలో డిఎస్పిగా ఉన్న పద్మనాభుల శ్రీనివాస్ జిహెచ్ఎంసి అదనపు ఎస్పిగా, ఇంటెలిజెన్స్ డిఎస్పిగా విధులు నిర్వహిస్తున్న యు. వెంకన్నబాబు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఎస్‌డిపిఓగా, సైబరాబాద్ ఎస్‌బి ఏసిపిగా ఉన్న బి. ప్రకాష్ నిజామాబాద్ ఏసిపిగా బదిలీ చేశారు. నిజామబాద్ ఏసిపిగా ఉన్న ప్రకాష్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

## స్తంభించిన బ్యాంక్‌లు

>> పనిచేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగం, సహకార, గ్రామీణ బ్యాంకులలో 100 శాతం ఉద్యోగులు సమ్మెకు దిగారు. 9 యూనియన్లకు చెందిన మొత్తం లక్ష మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు రెండు రాష్ట్రాల్లో జరిగిన సమ్మెలో పాల్గొన్నారు. దీంతో రెండు రాష్ట్రాల్లో దాదాపు 30 వేల కోట్ల రూపాయల లావాదేవీలు నిలిచిపోయాయి. కాగా వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. దీంతో నగదు, క్లియరింగ్, బదిలీ లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోయాయి. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు జరిగిన ఈ సమ్మెతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగింది. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్సులు వంటి రోజువారీ లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిజిటల్ సేవలైన ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, మరియు మొబైల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండటంతో ఖాతాదారులకు ఒకింత ఊరట కలిగించింది. అయితే ఈ నెల 24 రెండో శనివారం, 25 ఆదివారం, 26 రిపబ్లిక్ డేతో వరుస సెలవులకు తోడు, మంగళవారం సమ్మెతో బ్యాంకులు వరుసగా మూసి ఉండటం వల్ల బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగడంతో పాటు, ముఖ్యంగా ఏటీఎంలలో సైతం నగదుకు తీవ్ర కొరత ఏర్పడింది. ఇక అన్ని బ్యాంకులలో సమ్మె సంపూర్ణంగా జరిగిందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు వెల్లడించారు.

## రెండు దశాబ్దాల కృషికి చిహ్నం: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జనవరి 27:** రెండుదశాబ్దాలుగా విస్తృతస్థాయిలో ఇరువైపులా కృషి, కసరత్తులుచేసిన భారత్ ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎట్టకేలకు ఖరారయింది. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ఐరోపా కూటమి నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశం అనంతరం రెండు దేశాలమధ్య ఒప్పందంపై సంతకాలుచేసారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాందర్‌లేయన్, యూరోపియన్ మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాలు,ప్రధాని మోడీల సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత వాణిజ్య చరిత్రలోనే ఇది అత్యంత భారీ డీల్ అని ప్రధానిమోడీ పేర్కొనగా భారత్, ఐరోపా మండలిమధ్య వాణిజ్యసంబంధాలను మరింతగా బలోపేతం చేస్తుందని ఐరోపా ప్రతినిధులు హర్షం ప్రకటించారు. ఇది కేవలం వాణిజ్య ఒప్పందంగానే భావించలేమని పరస్పర అభ్యున్నతికి ఒక బ్లూప్రింట్ వంటిదని అన్నారు. ఈ ఒప్పందం అంతర్జాతీయ సమాజానికి స్పష్టమైన సందేశం ఇచ్చిందని భారత్, యూరోపియన్ యూనియన్‌లమధ్య పరస్పర మైత్రీ బంధం మరింత పటిష్టం అయిందన్నారు. హైదరాబాద్‌హౌస్‌లోనే 16వ ఈయూ భారత్ సదస్సు వివరాలను కోస్టా వెల్లడించారు. భౌగోళిక స్థిరత్వానికి రెండుదేశాలకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అత్యంత కీలకమని ఇరువురునేతలు వెల్లడించారు. కొత్తగా భద్రత, రక్షణరంగ భాగస్వామ్యంవల్ల భవిష్యత్తు భద్రతా ముప్పును ముందుగానే సంరక్షించుకోగలమని చెప్పారు. ఇండోపసిఫిక్, ప్రపంచ వ్యాప్తంగాను, ఐరోపా కూటమి దేశాల్లోను మరింత స్థిరత్వాన్ని తెచ్చిపెడుతుందని చెప్పారు. 2030 వైపు ఉన్న వ్యూహాత్మక సమగ్ర అజెండా ఇరువైపులా ఉన్న ప్రాధాన్యతను స్పష్టంచేస్తుందన్నారు. ఇంధనం, కనెక్టివిటీ, మొబిలిటీని మరింత పటిష్టంచేస్తుందని కోస్టా అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ ఒప్పందం కీలకం అవుతుందని వుర్సులా వాందర్‌లేయన్ అన్నారు. అన్ని డీల్స్‌కు తల్లిలాంటి ఎఫ్‌ఎటి ఖరారయిందని కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్ అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం 93శాతం భారత ఎగుమతులు 27 యూరోప్ దేశాల్లో ఎలాంటి సుంకాలు ఉండవు. అలాగే లగ్జరీ కార్లు, వైన్ భారత్‌కు దిగుమతులపై కూడా తక్కువ సుంకాలు ఉంటాయి. కొన్నింటిపై అసలు సుంకాలనే తొలగిస్తారు. ఇరువైపులా 200 కోట్లమందికి ఈ వాణిజ్య ఒప్పందం వల్ల ఎంతో మేలుజరుగుతుందని అంచనా. ప్రపంచ జిడిపిలో భారత్; ఐరోపా రెండూ కలిపితే 25శాతం వాటాతో ఉన్నాయి. ప్రంచ వాణిజ్యంలోమూడో వంతు ఉంటుంది. మొత్తం 33 లక్షలకోట్లడాలర్ల ప్రపంచ వాణిజ్యంలో భారత్ ఐరోపా వాణిజ్యం 11 లక్షలకోట్ల డాలర్లమేర ఉంటుందని అంచనా. 20 ఏళ్లనాడే బీజం పడిన ఈ ఒప్పందం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్‌కు విశిష్ట అతిథులుగా వచ్చిన మరుసటిరోజే ఖరారు కావడం విశేషం. ఈయూభారత్ డీల్‌తో వస్త్ర పరిశ్రమ ఎగుమతులు 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరతాయని అంచనావేస్తున్నారు.

# నా మూలాలు గోవాలోనే!

### తన ఒసిఐ కార్డు చూపించిన ఇయు కౌన్సిల్ చీఫ్ ఆంటోనియో కోస్టా



న్యూఢిల్లీ, జనవరి 27: ఇండో యూరోప్ వాణిజ్య ఒప్పందం కార్యక్రమంలో యూరోపియన్ మండలి ఛైర్మన్ ఆంటోనియో కోస్టా తన భారతీయ మూలాలను చూపించి అందరినీ ఆశ్చర్య పరిచారు. తనమూలాలు భారత్‌లోనే ఉన్నాయని, తన తల్లితండ్రులు గోవానుంచేయూరోప్ దేశాలకు వచ్చారని ఆయన వివరించారు. అంతటితో ఆగకుండా ఆయన మాట్లాడుతూ తన కోటులో ఉంచుకున్న ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా బుక్‌ను చూపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. దీన్నిబట్టే తనకు భారత్‌తోప్రత్యేక అనుబంధం ఉందని అర్థం కావాలని, మంగళవారం జరిగిన భారత్ యూరోపియన్ యూనియన్ స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం తనకు మరింతప్రత్యేకం అని చెప్పారు. తన కుటుంబ మూలాలు గోవాలోనే ఉన్నాయని ఆయనమరోసారి స్పష్టంచేసారు. తనకు భారత్ మూలాలున్నాయనిచెప్పడానికి ఎంతో గర్వంగా ఫీలవుతున్నట్లు ఆయన అన్నారు. భారత్ తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమని కూడా వివరించారు. ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి స్పష్టమైన సందేశం వెళ్లిందని, భారత్ యూరోపియన్ యూనియన్ రెండూ కూడా వ్యూహాత్మక విశ్వసనీయ భాగస్వాములన్న సందేశం విశ్వవ్యాప్తం అయిందని అన్నారు. ప్రపంచంలోనే రెండు అత్యున్నత ప్రజాస్వామ్య వ్యవస్థలున్న దేశాలుగా ఈ రెండింటికీ ఈ ఒప్పందం ఇపుడు ఎంతో కీలకమవుతుందన్నారు. కోస్టా కుటుంబానికి గోవా మూలాలున్నాయి. పోర్చుగీసు కాలనీలో కోస్టా తాతా జన్మించారు. జీవితంలో ఎక్కువ కాలం గోవాలోనే నివసించారు. మాజీ పోర్చుగీసు ప్రధానికి కొంకణి నిక్‌నేమ్ బాబుష్ అనే పదం కూడా ఉంది. తన తండ్రి సాహితీ కృషి ఒర్లాండో డా కోస్టా ఒకప్రముఖ రచయిత అని చెప్పారు. కోస్టాకు 2017లో ప్రధాని నరేంద్రమోడీ ఒసిఐ కార్డును అందచేసారు. ఆసమయంలోనే ప్రపంచంలోనే భారతీయ సంతతి ముఖుల్లో కోస్టా అత్యంత ప్రముఖులని కొనియాడారు. అలాగే కోస్టా 2017లో భారత్‌కు వచ్చినసమయంలో ప్రవాసి భారతీయ సమ్మాన్ అవార్డును కూడా పొందారు.

# ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శిగా పికె శ్రీమతి!

### నేడు ఐద్వా జాతీయ నూతన కమిటీ ఎన్నిక

### నేటితో ముగియనున్న 14వ జాతీయ మహాసభలు

### తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఏడుగురికి అవకాశం

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పికె శ్రీమతి ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జాతీయ అధ్యక్షురాలుగా కొనసాగుతున్న పికె శ్రీమతి నేడు(బుధవారం) జరగనున్న జాతీయ కమిటీ ఎన్నికలో నూతన జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న మరియం ధావలే ఇప్పటికే మూడు టర్మ్‌లు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సంఘం నిబంధనల మేరకు జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యే వారు మూడు టర్మ్‌లు మాత్రమే కొనసాగుతారు. ఈ నేపథ్యంలో మరియం ధావలే ఇప్పటికే మూడు టర్మ్‌లు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో నేడు జరిగే నూతన కమిటీ ఎన్నికలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొత్తవారిని ఎన్నుకునే అవకాశం ఉంది. గత రెండు టర్మ్‌లుగా జాతీయ అధ్యక్షురాలుగా పనిచేస్తున్న కేరళకు చెందిన పికె శ్రీమతిని జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో జాతీయ అధ్యక్షురాలుగా మరొకరు ఎన్నికయ్యే అవకాశం ఉంటుంది. ఐద్వా జాతీయ కమిటీ ప్రస్తుతం 100 మందితో కొనసాగుతోంది. అయితే జాతీయ కమిటీలో సభ్యుల సంఖ్య వారి సభ్యత్వం ఆధారంగా కమిటీ సభ్యులను ఎంపిక చేస్తారు. దేశంలో ప్రస్తుతం ఐద్వా సభ్యత్వం సుమారు 1.10 కోట్లు ఉన్నట్టు నాయకులు చెబుతున్నారు. ఈ సభ్యత్వం గత మహాసభల కంటే పెరిగింది. ఈ నేపథ్యంలో గత మహాసభలో ఎన్నుకున్న సభ్యుల కంటే ఈ మహాసభలో సభ్యుల సంఖ్య 100 కంటే పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 14వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో జరుగుతున్నాయి. ప్రస్తుతం ఐద్వా సెంట్రల్ కమిటీలో తెలంగాణ నుంచి 5 మందికి స్థానం ఉంది. అందులో ఒకరు జాతీయ కార్యదర్శివర్గ సభ్యులుగా మరో నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మీ జాతీయ సహాయ కార్యదర్శి(జాయింట్ సెక్రటరీ)గా కొనసాగుతున్నారు. సెంట్రల్ కమిటీ సభ్యులుగా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ఆశాలత, పాలడుగు ప్రభావతి, భారతి కొనసాగుతున్నారు. అయితే నేడు జరిగే నూతన సెంట్రల్ కమిటీలో తెలంగాణ నుంచి ఏడుగురికి అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది.

# 31న రవీంద్రభారతిలో గద్దర్ జయంతి సభ

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: 31న రవీంద్ర భారతిలో గద్దర్ జయంతి సభను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ తదితరలతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా గద్దర్ ఆశయ అభిమానులు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈసారి జయంతి సభను ప్రజాస్వామ్యం- సమానత్వ విలువలు థీమ్‌తో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, హైదరాబాద్ ఎంపీఅసదుద్దీన్ ఒవైసీ, మాజీ పోలీస్ ఉన్నతాధికారి సి. ఆంజనేయరెడ్డి, ప్రొ. హరగోపాల్, ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్, ప్రొ. కాశీం పాల్గొంటారన్నారు.

# ఆదిలాబాద్‌లో ఎసిబికి చిక్కిన హౌసింగ్ ఎఇ

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇంటికి సంబంధించి ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధుల మంజూరు విషయంలో ఇంటి ఫోటోలను అప్‌లోడ్ చేసేందుకు లంచం తీసుకుంటూ హౌసింగ్ ఎఈ ఒకతను ఎసిబికి దొరికిపోయాడు. మంగళవారం ఉదయం జ రిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సొంతంగా ఇంటిని నిర్మించుకునే వారికి సర్కారు కొంతమేర నిధులు అం దిస్తుండడం తెలిసిందే. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో అమలవుతున్న ఈ తరహా పథకం కోసం ఒక బాధితురాలి నుంచి హౌసింగ్ శాఖలో అవుట్ సోర్సింగ్ ఎఈగా వున్న దుర్గం శ్రీకాంత్ పది వేల రూపాయలు లంచం డిమాండ్ చేశాడు. బాధితురాలి ఇంటి నిర్మాణం తాలూకు ఫోటోలను సర్కారీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఇతను లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆమె ఎసిబికి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు రంగంలో దిగి న ఎసిబి అధికారులు మంగళవారం ఉదయం నార్నూరులో బా ధితురాలి ఇంటి వద్ద పది వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాం డెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి లంచం సొమ్మును జప్తు చేశారు. నిందితుడిని రిమాండుకు తరలిం చారు. సర్కారీ విభాగాల్లో అవినీతి గురించి టోల్ ఫ్రీ 1064కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి చారు సిన్హా మీడియాకు తెలిపారు.



ఆదిలాబాద్‌లో ఎసిబికి పట్టుబడిన హౌసింగ్ ఎఇ దుర్గం శ్రీకాంత్

# 99% భారత్ ఉత్పత్తులకు ఐరోపా ఖండంలో టారిఫ్‌లు నిల్

## అక్కడి ఉత్పత్తులకు సైతం భారత్‌లో సుంకాలు భారీగా తగ్గింపు

## ఉభయదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు చేస్తున్న ఎఫ్టీయే!



న్యూఢిల్లీ, జనవరి 27: భారత్-యూరోపియన్ దేశాల మధ్య మంగళవారం జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పారిశ్రామిక, వాణిజ్యరంగాలకు ఇతోధికంగా ఎంతో మేలు చేసేదిగా ఉంది. తన విచ్చలవిడి సుంకాలతో అమెరికా దూకుడు ప్రదర్శిస్తున్నవేళ భారత్-యూరోప్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఈ సుంకాల భారం గణనీయంగా తగ్గుతుందని కూడా రెండు దేశాల ప్రతినిధులు భావిస్తున్నారు. విస్తృత చర్చల అనంతరం ఖరారయిన ఈ ఒప్పందం మేరకు ఆటోమొబైల్ దిగుమతులకు ఎంతో ప్రయోజనకరం అవుతుందని అంచనా. మెర్సిడిస్, బిఎండబ్ల్యు, స్కోడా వంటి లగ్జరీ కార్ల కంపెనీల దిగుమతులు మరింతగా పెరుగుతాయి. ప్రస్తుతం భారత్‌లో 40 నుంచి 110 శాతం వరకూ విధిస్తున్న దిగుమతి సుంకాలు ఈ ఒప్పందం ప్రకారం ఐదేళ్లపాటు పూర్తిగా మినహాయింపు ఉంటుంది. అలాగే భారత్ నుంచి యూరోపియన్ దేశాలకు వెళ్లే ఎగుమతుల్లో 96 శాతం ఎగుమతులకు సుంకాలు ఉండవు. 26 దేశాల్లో ఎక్కడయినా భారత్ తన మార్కెట్‌ను సృష్టించుకునే వ్యవస్థ ఉంటుంది. ఇంధన రంగంలోనే 500 బిలియన్ డాలర్ల వరకూ వాణిజ్యం ఉంటుందని భారత్ భావిస్తోంది. అదేవిధంగా జ్యుయెలరీ, ఇతర విలువైన ఆభరణాలు ఎగుమతులు కూడా వచ్చే మూడేళ్లలో 10 బిలియన్ డాలర్ల వరకూ పెరుగుతుందన్న అంచనాలున్నాయి. ఇక ప్రత్యేకించి యూరోపియన్ దేశాల్లో బ్రాండెడ్ దుస్తులు, రెడీమేడ్ దుస్తులకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం ఖరారయిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఎ)తో 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల మేర వస్త్ర ఎగుమతులు ఉంటాయన్న అంచనాలు వ్యక్తం అవుతున్నాయి.

అదేవిధంగా సముద్రజల సంబంధిత ఉత్పత్తులకు కూడా మంచి బూస్ట్ ఇస్తున్నదని మెరైన్ ఉత్పత్తుల ఎగుమతిదారులు చెపుతున్నారు. 26 శాతం మేర సుంకాలు తగ్గిస్తుండటంతో ఎగుమతులు మరింతగా పెరుగుతాయని అంచనాలున్నాయి. అన్నింటి కంటే ఈ ఒప్పందం ఖరారయిన రోజుననే ఆదాని సంస్థ బ్రెజిల్‌కు సంబంధించిన ఎంబ్రాయిర్ సంస్థతో విమానాల తయారీకి ఒప్పందం చేసుకోవడం విశేషం. అంతరిక్ష రంగంతోపాటు డిజిటల్ విభాగంలో కూడా ఎఫ్టీయె ప్రయోజనకారి అవుతుందని అంచనా ఉంది. ఇరు దేశాల మధ్య వాణిజ్య టర్నోవర్ 2,091.6 లక్షల కోట్లుగా ఉంది. 99 శాతం భారత ఎగుమతులకు సుంకాలు రద్దవుతాయని కీలక రంగాలకు మరింత మేలు జరుగుతుందని పారిశ్రామిక నిపుణులు చెపుతున్నారు. భారత్ ఐరోపా కూటమిల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 11.5 లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. సేవల రంగం కూడా అదనంగా రూ.7.2 లక్షల కోట్లు జిడిపికి అందుతోంది.

ఎఫ్టిఎ ఖరారు కావడంతో ద్వైపాక్షిక వాణిజ్యం 41 శాతం నుంచి 65 శాతానికి పెరుగుతుందని అంచనా. సుమారు 90 శాతం ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా రద్దు కానున్నందున ద్వైపాక్షిక వాణిజ్యం మరింత పెరుగుతుందని పారిశ్రామిక సంఘాలు హర్షం ప్రకటిస్తున్నాయి. ఐరోపా నుంచి భారత్‌కు దిగుమతులు కూడా రూ.5.1 లక్షల కోట్లుగా ఉన్నాయి. సేవల రంగపరంగా భారత్ దిగుమతులు రూ.7.2 లక్షల కోట్లు విలువతో ఉంటాయి. వాణిజ్య తేడా కారణంగా మిగులు రూ.15.17 బిలియన్ డాల్లుగా ఉందని అంచనా. యంత్రాలు, రసాయనాలు, టెక్స్‌టైల్స్, బేస్ మెటల్స్, ఖనిజ వనరులు, ఆటోమొబైల్ లగ్జరీ కార్లు ఎక్కువగా ఇరువైపులా వాణిజ్యం జరుగుతుంటాయని అంచనా. ఇరువైపులా 200 కోట్ల మందికి ప్రయోజనకారి అవుతుందని ప్రతినిధులు చెపుతున్నారు.

24 లక్షల కోట్ల డాలర్ల విలువైన వాణిజ్యం ఇరువైపులా జరుగుతున్నది. ఇప్పటి వరకూ వెళ్లని యూరోపియన్ మార్కెట్లకు భారత్ ఉత్పత్తులు చేరుకోగలుగుతాయి. 99 శాతం ఉత్పత్తులకు ఇక యూరోప్‌లో సుంకాలే ఉండవని తెలుస్తోంది.

# నో-డ్యూ సర్టిఫికేట్ ఉంటేనే ఎన్నికల్లో పోటీ చేయాలి

## మున్సిపల్ కార్యాలయాల చుట్టూ నేతల ప్రదక్షిణలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 27: మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ముందుగా తమపై ఉన్న ఆస్తి పన్ను, నల్లా బిల్లు తదితర బకాయిలను పూర్తిగా చెల్లిస్తేనే నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పిస్తారు. ఇప్పటివరకు సాధారణ ప్రజలకే పరిమితమైన పన్ను క్రమశిక్షణ ప్రస్తుతం రాజకీయ నాయకులకూ వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఆర్థిక సంవత్సరం మార్చి 31లోపు సామాన్య ప్రజలు తమ ఆస్తి పన్నులను గడువులోగా చెల్లించాల్సిందే. ఆలస్యం జరిగితే వడ్డీ, జరిమానాలు తప్పవు. అయితే అదే సమయంలో రాజకీయ నేతలు,బడా వ్యాపారులు మాత్రం ఆస్తి పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు తరచూ వినిపిస్తుంటాయి. బిల్ కలెక్టర్లు ఇంటింటికీ వెళ్లినా, 'తర్వాత చెల్లిస్తాం' అంటూ కాలయాపన చేయడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితి మారింది. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకోవడం తప్పనిసరి. సంబంధిత పురపాలక సంఘంలో తమపై ఉన్న ఆస్తి పన్ను, నల్లా బిల్లు బకాయిలు పూర్తిగా చెల్లించిన తర్వాతే ఈ సర్టిఫికెట్ జారీ అవుతుంది. దీంతో ఇప్పటివరకు పన్నులను ఎగనామం పెట్టిన రాజకీయ నేతలు ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రారంభించారు. ఎన్నికల నోటిఫికేషన్ అలా వెలువడిందో లేదో అప్పుడే మున్సిపల్ కార్యా లయాల్లో అసాధారణ రద్దీ నెలకొంది. గతంలో నెలల తరబడి బకాయిలు చెల్లించని వారు ఒక్కసారిగా మొత్తం చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. ఇది మున్సిపాలిటీలకు తాత్కాలికంగా అయినా ఆదాయాన్ని పెంచుతోంది. అధికారులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పెండింగ్ బకాయిల వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు భారీగా పోలీసు పహారా

### డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల నిర్వహణపై పోలీసు శాఖ దృష్టి సారించింది. దీనిపై డిజిపి శివధర్ రెడ్డి మంగళవారం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎ న్నికలకు నగరా మోగడంతో ఎన్నికల నియమావళి అమల్లో వచ్చిందని, అక్రమ నగదు, మద్యం సరఫరా, ఉచిత పంపిణీ వ్యవహారాలపై నిరంతరం నిఘా వుంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తామని, తనిఖీలు చేబడతామని ఆయన తెలిపారు. 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకువెళితే తగిన ఆధారాలు వుండాలని ఆయన తెలిపారు. లైసెన్స్ కలిగిన ఆయుధాలను వెం టనే వాటి యజమానులు సమీప పోలీసు స్టేషన్‌లలో జప్తు చేయాలని డిజిపి సూచించారు, అక్రమ ఆయుధాలను పట్టుకునేందుకు అన్నిచోట్ల సోదా లు చేబట్టాలని ఆయన ఆదేశించారు. పాత నేరగాళ్ల, రౌడీలపై నిఘా వుంచాలని, గత ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని బైండోవర్ చేయా లని డిజిపి ఆదే శించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ వుంటుందని ఆ యన తెలిపారు. వెయ్యికి పైగా వున్న సున్నిత, అతి సున్నిత ప్రాంతాలలో అద నపు బలగాలను మోహరిస్తామని ఆయన తెలిపారు. ఎన్నికల నిర వ్యహణకు సివిల్ పోలీసులతో పాటు స్పెష ల్ పోలీసులు, అబ్కారీ పోలీసులను కూడా రంగంలో దించుతామని డిజిపి వెల్లడించారు, సిసి కెమెరాల ద్వారా ఎన్నికలను నిరంతరం పర్యవేక్షిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ధైర్యంగా ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కొత్త సంవత్సర బడ్జెట్‌కు సర్వం సిద్ధం



## సంప్రద్రాయ హల్వా వేడుకతో బడ్జెట్ కసరత్తు ముగింపు

న్యూఢిల్లీ, జనవరి 27: కేంద్ర బడ్జెట్ 2026-27 ఆర్థికసంవత్సరానికి రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరిలు హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు లాక్‌ఇన్ పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్ ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే ఇండియా బడ్జెట్ డాట్ జీవోవిడాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పసుపు ఉడికించి ఎండబెట్టాకే అమ్మకానికి..

### రైతులకు మార్కెటింగ్ శాఖ సూచన

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: రాష్ట్రంలో పసుపును ఉడికించిన పిదప కనీసము 15 రోజులు ఎండబెట్టిన పిదపనే మార్కెట్ యార్డునకు అమ్మకము నిమిత్తము తీసుకరావాలని మార్కెటింగ్ శాఖ వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పసుపు మాయిశ్చర్ శాతము 12 శాతం ఉన్నట్లైతే మంచి ధర లభిస్తుందని, దాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించింది. ఇప్పటికే నిజామాబాద్ మార్కెట్ యార్డు నందు పచ్చి పసుపు అమ్మకము పూర్తిగా నిషేదించడమైనది పేర్కొంది. ఈ నేపథ్యంలో బాగా ఎండబెట్టిన పసుపును మాత్రమే మార్కెట్ యార్డునకు తీసుకొనిరావాలని విజ్ఞప్తి చేసింది.

# టిజిసిఎస్‌బికి చిక్కిన అంతర్రాష్ట్ర సైబర్ మ్యూల్ ఖాతాల నేరగాళ్లు

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: విదేశాలలో వుండే బడా సైబర్ నేరగాళ్లతో దోస్తీ చేసి భారత్‌లో అమాయకుల నుంచి కోట్ల రూపాయలు దోచుకునేందుకు మ్యూల్ ఖాతాలు అందిస్తున్న ఆరుగురు అంత రాష్ట్ర నేరస్తులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అరెస్టు చేసింది. ఈ ఆరుగురు నేరగా ళ్లు 16 కోట్ల రూపాయలను కాజేసిన మూడు కేసుల్లో నిందితులు కావడం గమనార్హం. వీరివద్ద ఐదు సెల్ ఫోన్లు మినహా నయా పైసా కూడా లేకపోవడం మరో విశేషం. పట్టుబడ్డ వారిలో ముగ్గురు కేరళకు చెందిన వారు కాగా మిగతా ముగ్గురు బెంగళూరు వాసులు. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. 2024 డిసెంబర్ తొమ్మిదవ తేదీన హైదరాబాద్‌కు చెందిన ఓ సీనియర్ సిటిజెన్‌ను సైబర్ నేరగాళ్లు ట్రాయ్, సిబిఐ, ఆర్‌బిఐ అధికారులమంటూ బెదిరించి, మీ పైన క్రిమినల్ కేసులున్నాయని హడలెత్తించి కొన్ని గంటల వ్యవధిలో ఐదు కోట్ల 66 లక్షల 51 వేల 100 రూపాయలను పలు ఖాతాలకు బదలాయించుకున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు టిజిసిఎస్‌బి కేసు నమోదు చేసి విచారణ చేయగా ఈ గోల్‌మాల్ కేరళలోని కుడమురిట్టికి చెందిన రెంజు పత్తక్కు రేజి (30) గా తేలింది. ఆర్థిక నష్టాల వల్ల స్నేహితుడి సలహా మేరకు విదేశాల్లో వున్న బడా సైబర్ నేరగాళ్ల కోసం మ్యూల్ ఖాతాను ఇతను అందించాడు. ఈ కేసులో నిందితుడు అరెస్టవగా అతని వద్ద సెల్‌ఫోన్ లభ్యమయ్యింది. బాధితుడి నుంచి కాజేసిన నగదులో నిందితుడు అందుకున్న పది శాతం కమీషన్ డబ్బులను ఖర్చు పెట్టేశాడు. మరో ఘటనలో హైదరాబాద్‌కు చెందిన మరో సీనియర్ సిటిజెన్‌ను ముంబాయి పోలీసుల పేరిట డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ నేరగాళ్లు బెదిరించి ఏకంగా ఏడు కోట్ల 12 లక్షల 80 వేల రూపాయలను కాజేశారు. దీనిపై ఈ ఏడాది మొదటి వారంలో ఫిర్యాదు అందింది, ఈ ఫిర్యాదు మేరకు విచారణ చేయగా కేరళలోని కొట్టాయం జిల్లాకు చెందిన అరుణ్ శ్రీనివాస్ (41), సనల్ వి మెనన్ (48) నిందితులుగా తేలింది. వీరిద్దరు జైపూర్‌కు చెందిన ఓ బడా సైబర్ నేరగాడితో దోస్తీ చేసి అతడి సూచనల మేరకు మ్యూల్ ఖాతాలు ఇచ్చారు. ఈ ఖాతాల ద్వారా బాధితుడి నుంచి కాజేసిన నగదు బదలాయింపు జరిగింది. ఈ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టవగా వారి వద్ద రెండు సెల్‌ఫోన్లు పట్టుబడ్డాయి. బాధితుడి నుంచి కాజేసిన నగదును విదేశీ నేరగాళ్లు కాజేశారు. మరో ఘటన ఈ నెల మూడవ తేదీన వెలుగు చూసిం ది. బేగంపేట్‌కు చెందిన వ్యాపారిని ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ నేరగాళ్లు మూడు కోట్ల 40 లక్షల 96 వేల 958 రూపాయలను కాజేశారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో 22 రోజుల వ్యవధిలో ఈ డబ్బులను దుండగులు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టిజిసిఎస్‌బి అధికారు లు విచారణ చేబట్టగా ఈ గోల్‌మాల్‌కు విదేశీ నేరగాళ్లు బాధ్యులుగా గుర్తించారు. అయితే వీరికి బెంగళూరు కు చెందిన జయప్రకాష్ (43), బాలరాజు (51), హరీష్ (55) అనే ముగ్గురు మ్యూల్ ఖాతాలు ఇచ్చినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసి విచారించగా బడా నేరగాళ్లకు తాము సహకరించామని అంగీకరించారు. వీరి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు.

# ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం.. ఇద్దరిపై వేటు

బెజ్జూర్, జనవరి 27,ప్రభాతవార్త: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో నిరక్ష్యం చోటు చేసుకున్నట్లు డిఆర్డీఒ దత్తారావు మంగళవారం తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం 2024-25 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై 14వ విడత సామాజికతానికి ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 828 పనులకు ఏడు కోట్ల 25 లక్షల పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించినట్లు తెలిపారు. కుష్ణపల్లి టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్ మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం, పనులు చేయకుండానే కూలీలకు డబ్బులు పేమెంట్ చేయడంతో అతని నుండి మూడు లక్షల రూపాయలు రికవరీ చేసి అతన్ని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. బారెగూడ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ 13 మంది కూలీలకు పనులు చేయకుండానే కూలీ డబ్బులు చెల్లించారని,గ్రామస్తులు అతన్ని తొలగించాలని డిమాండ్ చేయడంతో అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.మండలంలో చేపట్టిన ప్రజా వేదికలో మొత్తం రూ.6,45,211/ రికవరీ చేసి రూ.62 వేలు పెనాల్టీ విధించినట్లు తెలిపారు.ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలను సహించేది లేదని ప్రతి ఒక్కరూ నిజాయితీతో తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆబోడ్స్ మెన్ పర్సన్ పివిఎన్ సాయి శ్రీ,ప్రాజెక్టు ఆఫీసర్ ప్రెసిడెంట్ కే,ఆంజనేయులు,ఎంపీడీఓ బిఎస్ ప్రవీణ్ కుమార్,ఏపీఓ రాజన్న,ఎస్ఆర్పి రవి,అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఆర్డీఒ దత్తారావు


సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ టి.జి. లిమిటెడ్
ఆపరేషన్ : సైబర్ సిటీ సర్కిల్
టెండర్ ప్రకటన నం : 10/25-26 & మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ నం. 04/25-26
TGSPDCL [illegible] 1) ... 11KV లైన్ ... 2) ... PTR ... 3) ... DTRలు 100KVA ... 4) ... 5) ... 33Kv లైన్ ... 6) ... www.tgsouthernpower.org & www.eauction.telangana.gov.in మరియు www.eprocurement.telangana.gov.in దయచేసి వీక్షించండి.
సం/-. SE/OP/సైబర్ సిటీ, రేతిబౌలి, నానల్ నగర్ x రోడ్, హైదరాబాద్-28.
DIPR.NO. 14533-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 27.01.2026

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad.**
**CASE NO. O.A No. 926 OF 2025**

PUNJAB NATIONAL BANK.
Verses
MR. MUDDHANGI HANUMANTHU AND ANOTHER
SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To.
1. **Mr. Muddhangi Hanumanthu, S/o. Muddhangi Thimmaiah,** Age: 39 years, Occ: Business, R/o. H.No. 348/1, Vadera Basthi, Jagathgiri Gutta, Balanagar, Balanagar Township KV, Ranga Reddy District-500037.
2. **Mrs. Mudhangi Renuka, W/o. Mudhangi Hanumanthu,** age: 32 years R/o.Plot No. 18, Suraram Colony, Near Marati Basti, Quthubullapur, IDA Jeedimetla, Ranga Reddy District-500055 ....Defendant/s

Please take the summons in the above **O.A. No. 926/2025** filed by the applicant for recovery of money of **Rs.20,82,025/- (Rupees Twenty Lakhs Eighty Two Thousand and Twenty Five only)** against you. **The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in" daily newspaper and posted the matter to.**

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under,
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **23.02.2026 at 10.30 a.m.** at **Debts Recovery Tribunal - II, 1ST Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001,** in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
**Given under my hand and seal of this Tribunal on this day 9 th of January, 2026.**
**(By order of the Court)**
**Sd/- (REGISTRAR)**
**Debts Recovery Tribunal-II, Hyderabad**

వార్త


నిన్ను నువ్వు ప్రేమించుకోవడం నేర్చుకుంటే ఇతరుల్ని ద్వేషించడం మానివేస్తావు.

-రోజర్

# ఉపేక్షిస్తే ఉపద్రవమే!

మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారి తీస్తుందని, దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా ప్రపంచ వ్యాప్తంగా దేశాధినేతలు పదేపదే చెప్తూనే ఉన్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదియేడాదికి విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఈ వ్యసనం పదిహేను, పదహారేళ్ల పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని, నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది.మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకునేందుకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. తాజాగా మొన్న నిజామాబాద్ జిల్లాలో ఒక కారులో గంజాయి తరలిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యపై కిరాతకులు కారుతోనే దాడికి ప్రయత్నించారు. దాడిలో ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రాథమిక చికిత్స అందించి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కిడ్నీలు దెబ్బతినడంతో ఒక కిడ్నీని పూర్తిగాతొలగించారు. మరొక కిడ్నీకి డయాలసిస్ చేస్తున్నారు. ఆమె ప్రాణాలు కాపాడేందుకు వైద్యబృందం శతవిధాలా ప్రయత్నం చేస్తున్నది. ఎక్సైజ్, ఆరోగ్యశాఖ మంత్రులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. గంజాయి అక్రమ రవాణా అడ్డుకునే క్రమంలోనే సౌమ్యపై దాడి జరగడం దురదృష్టకరమన్నారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేదిలేదని స్పష్టం చేశారు. పోలీసులు ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇదే కాదు ఇటీవల కాలంలో మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ఎందరో అధికారులపై దాడులు జరుగుతున్నాయి. మొన్న ఆ మధ్య నెల్లూరు జిల్లాలో మత్తుమందుల వ్యాపారమే కాక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును రట్టు చేయడమేకాక అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే నెపంతో సామాజిక కార్యకర్తను హత్య చేయించినట్లు ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రధానంగా గంజాయితోపాటు మత్తుమందులు పట్టుబడుతూనే ఉన్నాయి. గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిందని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ, విశాఖ ఏజెన్సీ లోనూ ఇటు తెలంగాణ, ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఇటీవల కాలంలో బాగా విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. గతంలో ఆంధ్ర, ఒడిశా, సరిహద్దుల్లో తెలంగాణ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో ఆవిషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అక్రమ వ్యాపారులను ప్రోత్సహిస్తున్నది మీరంటే మీరని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఇదేకాదు విదేశాల నుండి భారీఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో ఇరవైఒక్కవేల కోట్లరూపాయల విలువైన మూడు వేల కిలోల హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింక్‌లు వెలుగులోకి వచ్చాయి. మత్తుమందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాదులకే చేరుతున్నదని దర్యాప్తుసంస్థలు చెబుతున్నాయి.పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తోపాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి.కశ్మీర్ ఉగ్రవాదులకు, పంజాబ్‌లోని మత్తుమందు సరఫరాదారులకు గట్టి సంబంధమే ఉన్నట్లు బయటపడింది. మత్తుముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకున్నాయి. మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకుంటున్నారు. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మత్తు మందులు నలుమూలాల విస్తరించడంతోపాటు రసాయనికాలు తయారు చేసే యాంఫిటామైన్ టైప్‌స్టిమ్‌లెన్స్ ఎక్కడికక్కడ తయారవుతున్నాయి. భారతదేశంలో ఈ తరహా మత్తుమందులు పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతున్నాయి. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఈమత్తుమందువ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీచేయించే 'క్రిప్టోకరెన్సీ' వాడకం సైతం పెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండాపోతున్నది. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసినా నమ్మకం ఉన్న వ్యాపారినే సంప్రదించేవారు. మత్తు మందులు తీసుకొని డబ్బులుచేతిలో పెట్టేవారు.ఆవ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తు మందు తెప్పించి అప్పగించేవాడు. ఇది అత్యంత పకడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్ను వేయడంతో ఎక్కడో ఒక దగ్గర దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్నమత్తుమందు వ్యాపారికి ఆర్డర్ ఇవ్వొచ్చు.రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ మహమ్మారి ప్రపంచమంతా విస్తరించిపోయింది. మాదక ద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకూడదు. అటుకేంద్రం, ఇటు రాష్ట్రప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణ రూపొందించి అమలు చేయగలిగితే కొంతవరకైనా నియంత్రించవచ్చు.

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

తోటివారికి మీ వల్ల హెచ్చు ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్టు చూసుకోవడమే సరైన ప్రవర్తన.



హెచ్.లాంగ్‌ఫెలో

## ప్రజావాక్కు



### ప్రతిభకు తూకం

రెండువేల ఇరవైఆరు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులను పలువురు ప్రముఖులకు ప్రదానం చేయబడింది. గతంలో సినీ ప్రపంచంలో అందనంత ఎత్తుకుఎదిగిన మహానటులైన ఎన్.టి.రామారావు, ఎస్.వి. రంగారావులకు కేవలం పద్మశ్రీ అవార్డులతో సరిపెట్టేసారు. మహానటి సావిత్రి, సినీ సీత అంజలీదేవిలను ఏప్రభుత్వ అవార్డులు వరించలేదు.కాని వారి నటనానైపుణ్యం తెలుగు సినీపరిశ్రమలో నిఘంటువులా నిలచిపోగలదనేది అక్షర సత్యం. ప్రతిభను ఏ కొలమానంతో తూకం వేస్తున్నారో అవార్డుల కమిటీ వారికే తెలియాలి..

- ఎన్.రామలక్ష్మి,సికింద్రాబాద్

### గవర్నర్లు ఆలోచించాలి

మళ్ళీఒకసారి తమిళనాడుఉదంతంతో గవర్నర్‌ల పాత్రపై మరొకసారి గందరగోళం నెలకొంది. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం, రాష్ట్రాలలో ఉన్నప్పుడు ఎటువంటి గందర గోళం లేదు. ఎప్పుడయితే ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయో అప్పటి నుండి ఈ గందరగోళం నెలకొంది. ఇకపోతే ఈదశాబ్దకాలంలో కేరళలో, ఢిల్లీలో, తమిళనాడు, పశ్చిమబెంగాల్,రాష్ట్రాలలో నెలకొన్న పరిస్థితులు ఏమి రుజువుచేస్తున్నాయి. ప్రతిపక్షం అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాలక పక్షం తమ అభిష్టాలు నెరవేర్చే సాధనంగా గవర్నర్‌ల పాత్ర ఉండడం విచారం. అలాఅని అందరూ అలా ప్రవర్తించడంలేదు. కేరళలాంటి రాష్ట్రాలు గవర్నర్‌గురించి సుప్రీంకోర్టుకువెళ్లడంకూడా చూస్తున్నాం. బీజేపీలాంటి పార్టీలు మార్గదర్శక మండలిపేరుతో సలహా సంఘాన్ని ఫామ్ చేసి అందులోని వాళ్లకు గవర్నర్‌గిరి ఇస్తున్నారు. ఇది సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధం.

- భారత అవినాష్, జనగామ

### ఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో భూముల విలువ ధరలు పెరగడంతో ఎస్సీ,ఎస్టీల ఇండ్ల స్థలాలు అగ్రవర్ణాలు ఆక్రమించుకోవడం అక్రమ నిర్మాణాలు చేయడం జరిగింది. ఇట్టి విషయమై భూమిని కోల్పోయిన వారు భూ కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి 3 సంవత్సరాలు దాటుతున్నా కూడా న్యాయం జరగడం లేదు. అక్రమ నిర్మాణాలు తొలగించడం లేదు.

- రాపాక రవీందర్, జనగాం

### ఫీజులను పెంచడం సమర్థనీయంకాదు

దేశంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లల ట్యూషన్‌ఫీజులు, ఇతరఖర్చులు నిరంతరం పెరుగుతుండటం మధ్యతరగతి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ బడ్జెట్‌ను నిర్వహించడం కష్టతరమైనప్పటికీ, తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఈ కష్టాలను భరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల ట్యూషన్ ఫీజులపెంపుపై రెండేళ్లకుఒకసారి గరిష్టంగా ఎనిమిది శాతం పరిమితిని విధించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తుంది. అయితే ప్రభుత్వపాఠశాలల మాదిరిగా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏటా ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు ఉండవు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రైతులకు పరిహారం చెల్లించాలి

రాయలసీమ పెన్నా ఎత్తిపోతల పథకం పనులకు దశాబ్దాల నుండి కృష్ణ జలాలు అందే సమయం ఇప్పుడువచ్చింది. నీటి నిల్వల సామర్థ్యం లేక ఆగిపోయింది. అప్పటి మంత్రి వర్ధంతి రోజున ఇప్పుడు ప్రారంభమై పేదల ఆకలి తీర్చే అవకాశం యాధృచ్ఛికంగా జరిగింది.అదే మనిషిక్రప్రధానం. దాని ప్రాధాన్యత గుర్తించి కృషి చేయడం ప్రభుత్వ ఘనతే. భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపు హామీతో వారికి సమస్యలేదు. మనకు సుఖాలు, ఆనందం వచ్చే వాటి కన్నా ఇది ముందు అత్యవసరమని మనం కూడా తెలుసుకోవడం విజ్ఞత. వాటి కోసం ప్రభుత్వనేతల చొరవ, అధికారుల జాప్యంలేని పనితీరు ప్రజలు మరువలేరు. ఆ రీతిలోనే కుటుంబానికి కూడు పెట్టే అంశాలు ముందు ప్రాధాన్యత గొప్పవి కూడా.

- బొల్లోజు మేఘనాదం విశాఖపట్నం

### శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

భారత్ క్రికెట్‌జట్టు మ్యాచ్ గెలిచినా, పెళ్లివేడుకలు, ఇతర కార్యక్రమాలు ఏవైనా నిర్వహించినా ఆ హాపినెస్‌ని పరస్పరం అభినందనలు తెలుపుకోవటంతోను మిఠాయిలు పంచుకోవటంతోను ఆపేయాలి. లేదా చిచ్చుబుడ్లు, చక్రాలు,కాకరపువ్వొత్తులు, మతాబులతోను సరిపెట్టుకోవాలి. అంతేకానివృద్ధులు, రోగులు, మహిళలు, పసిపిల్లలు నిద్రించే సమయంలో పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు,సీమటపాకాయలు పేల్చటం సరికాదు. చాలా ఇప్పుడే అదే చేస్తూ ఇతరులను ఇబ్బందిపెడుతున్నారు.

-ఎమ్.శాస్త్రి, హైదరాబాద్

**మనవి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రహదారి విధానంలో మార్పులవసరం

**రహదారులు భూమట్టం నుండి 23 మీటర్ల ఎత్తులో నిర్మించడం వల్ల, దానికి కావాల్సిన మట్టిని గుట్టలు పుట్టలు తవ్వి వాడడం వల్ల, పరిసర గ్రామాల ప్రజలకు కనీసం ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిదొరకడం లేదు. ఈ రోడ్ల నిర్మాణంలో భారీ వాహనాలు నడవడం వల్ల ఆ చుట్టుపక్క ప్రాంత రోడ్లు గుంతలు పడడం, అవి వేసే దుమ్ము ధూళి వల్ల పంటలు దిగుబడి రాకుండా నష్టపోతున్నాయి. ఇలా చెప్పుకుంటే రైతుల వ్యధలు అన్నిఇన్ని కావు. భవిష్యత్ తరాలకు అద్భుత ఫలాలనిచ్చే రహదారులను నిర్మించడం అవసరమే. అందుకు రైతులు అందరు సహకరించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ నిర్మాణంలో రైతు కోల్పోతున్న ఉనికిని, నష్టానికి తగ్గట్టుగా పరిహారానికి ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. వ్యవసాయమే సుడిగుండం అయి రైతులను అతలాకుతలం చేస్తున్నవేళ ఇటువంటి అకాల పరిణామాల నుండి రైతులను రక్షించే బాధ్యత ప్రభుత్వాలదే.**

భైరబోయిన వెంకటేశ్వర్లు

దేశాల, రాష్ట్రాల అభివృద్ధి సూచికలు రహదారులు. రహదారులు ఎంత సౌకర్యవంతంగా ఉంటే అంత అభివృద్ధి చెందినట్లు లెక్క. జాతీయ స్థాయిలో రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారులు, రాష్ట్రస్థాయిలో జిల్లాలను అలాగే గ్రామస్థాయిలో పల్లెలను కలుపుతూ రహదారులు ఉంటాయి. వీటిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెరుగుతున్న వాహనాల రద్దీకి తగ్గట్టుగా రహదారులు విస్తరించడం అవసరం. అలానే సుదూరాలను దగ్గర చేయడానికి కొత్త రహదారులను నిర్మించడం అనివార్యం. ఒక దేశ అభివృద్ధిలో పెట్టుబడుల పరంగా పరిశ్రమలు రావాలంటే ఆ పరిశ్రమలకు తగిన భూమి ప్రభుత్వం చూపించాల్సి ఉంటుంది. ఒక నిర్దిష్ట పరిధిలో నిర్మించే పరిశ్రమలకు ప్రభుత్వ భూములు ఉంటే వాటినే కేటాయిస్తారు. లేదంటే పరిహారం ఇచ్చి రైతుల వద్ద నుండి సేకరిస్తారు. కానీ కొత్త రహదారులు నిర్మించే విషయంలో మాత్రం రహదారులకు కావలసిన భూమి అంతా రైతుల నుండి సేకరించాల్సిందే. దేశంలో అభివృద్ధి పథంలో నడవడానికి రోజురోజుకు కొత్త రహదారులు నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నాయి ప్రభుత్వాలు.ఉన్న మార్గాన్ని విస్తరిస్తే బ్రౌన్ ఫీల్డ్ అని కొత్త మార్గాలను గ్రీన్ ఫీల్డ్ హైవేలని అంటారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం అంతట సుమారు 600 కి.మి నిడివి గల గ్రీన్‌ఫీల్డ్ రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. కానీ రహదారుల నిర్మాణంలో కనబడే అభివృద్ధి వెనక ఎంతో మంది రైతుల వ్యధలు ఉన్నాయన్నది నిజం. భారీ భూస్వామ్యవ్యవస్థలు లేని మన దేశంలో భూమి అంతా చిన్నచిన్న కమతలుగా రైతుల చేతుల్లో ఉంది. రహదారుల కింద కోల్పోతున్న భూములలో తాతలు, తండ్రుల నుండి వారసత్వంగా వస్తున్న భూములు కొన్ని అయితే తిని తినక రూపాయి రూపాయి పోగుచేసుకొని కొన్న భూములు కొందరివి. రహదారుల క్రింద తమ అస్తిత్వం బ్రతుకుతెరువు అన్ని కోల్పోయి నగరాలకు వలస వెళ్లేవారు కొందరైతే ఒకటి రెండు ఎకరాలు ఉన్న చిన్న రైతులు ఉన్నది కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. రహదారుల అమరికలో భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వాలు నష్టపరిహారాన్ని చెల్లిస్తాయి. కానీ ఈ చెల్లించే నష్టపరిహారం రైతులకు ఏమాత్రం సరిపోదుఅన్నది నిజం. రైతులకు ప్రభుత్వాలు భూమి, ప్రభుత్వ విలువను బట్టి దానికి అధనంగా పరిహారం ఇస్తారు. కానీ వాస్తవానికి మార్కెట్లో అదిప్రభుత్వ విలువకన్నా చాలారెట్లు అధికంగా ఉంటుంది. సుమారు ఒక ఎకరం భూమి రోడ్డు పరిధిలో



వెళితే ఆ ఎకరానికి ఇచ్చిన నష్టపరిహారంతో ఆ ప్రాంతంలో కనీసం సగం భూమి కూడా రాని పరిస్థితి ఉంది. పల్లెల్లో బండ్ల బాట, తారు రోడ్ల ప్రక్కన ఉన్న భూముల విలువ లోపలి భూముల కన్నా ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రభుత్వ విలువ సమానంగా ఉన్నందున దీనికి లోపలి భూములకు ఒకే తరహా పరిహారం చెల్లించడంతో కొంత మంది రైతులకు నష్టం జరుగుతోంది. కొందరు రైతులు ప్రభుత్వంతో పోరాడలేక ఇచ్చే పరిహారానికి ఒప్పుకున్న మరికొందరు అధిక పరిహారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పరిహారం విషయం పక్కన పెడితే భూమిని నమ్ముకున్న రైతు తన వ్యవసాయ సాధన అనుకూలతను బట్టి తన భూమిని చతురస్రాకార, దీర్ఘచతురస్రాకార ఆకారాలలో చిన్న కమతలుగా నిర్మించి తమకనువుగా వ్యవసాయం చేసుకుంటారు.నూతన రహదారుల అమరికలో అప్పటివరకు ఏకరీతిగా ఉన్న భూమి ఆకారం లేకుండా అవుతుంది. అది కూడా వ్యవసాయం చేయడానికి అనువుగా ఉండడం లేదు. మరి గ్రీన్‌ఫీల్డ్ లాంటి వాహన నియంత్రణ రహదారి పొడుగునా ప్రహరీ గోడ నిర్మించే రహదారుల్లో ఈ ఆకారం లేని భూభాగం సగం రహదారులకు ఒకప్రక్కన ఉంటే మిగిలినది మరొక్క ప్రక్కన ఉంటుంది. ఇటు నుండి అటు దాటలేని రహదారుల ప్రక్కన రైతులకు వ్యవసాయం చేయడం దినదిన గండంగా మారనుంది. ఈ రహదారుల అమరికలో భూమితోపాటు జల వనరులు అయిన బావులు సైతం పూడ్చాల్సి వస్తుంది. ఒకవేళ రహదారుల అమరికలో విద్యుత్‌లో, హై టెన్షన్ లైన్లు, మిషన్ భగీరథ పైప్ లైన్లు, ఇరిగేషన్ కాలువలు లాంటివి నష్టపోతే మాత్రం వాటిని ఎంత ఖర్చైనా తిరిగి యధావిధిగా పునర్ నిర్మించే ప్రయత్నం చేస్తారు.కానీ రైతులను పునర్మించడం లేదన్నదినిజం. అలాగే ఈ రహదారుల నిర్మాణంలో నిర్మాణానికి కావలసిన కంకర కోసం ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రకృతి సంపదగా వస్తున్న కొండలను పిండి చేసి రోడ్ల నిర్మాణంలో వాడుతున్నారు. ఈ రహదారులు భూమట్టం నుండి 23 మీటర్ల ఎత్తులో నిర్మించడం వల్ల దానికి కావాల్సిన మట్టిని గుట్టలు పుట్టలు తవ్వి వాడడంవల్ల పరిసర గ్రామాల ప్రజలకు కనీసం ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిదొరకడం లేదు. ఈ రోడ్ల నిర్మాణంలో భారీ వాహనాలు నడవడం వల్ల ఆ చుట్టుపక్క ప్రాంత రోడ్లగుంతలు పడడం,అవి వేసే దుమ్ము ధూళి వల్ల పంటలు దిగుబడి రాకుండా నష్టపోతున్నాయి. ఇలా చెప్పుకుంటే రైతుల వ్యధలు అన్నిఇన్ని కావు.భవిష్యత్ తరాలకు అద్భుత ఫలాలనిచ్చే రహదారులను నిర్మించడం అవసరమే. అందుకు రైతులు అందరు సహకరించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ నిర్మాణంలో రైతు కోల్పోతున్న ఉనికిని, నష్టానికి తగ్గట్టుగా పరిహారానికి ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. వ్యవసాయమే సుడిగుండం అయి రైతులను అతలాకుతలం చేస్తున్నవేళ ఇటువంటి అకాల పరిణామాల నుండి రైతులను రక్షించే బాధ్యత ప్రభుత్వాలదే. ●

# ఆదివాసీల సొంతింటి కల నెరవేరేనా?

మల్లేశ్ పొంగి

దేశంలో అత్యంత వెనుకబడిన ఆదివాసీగిరిజన సమూహాలుగా గుర్తించబడిన పివిటిజి కమ్యూనిటీల జీవన పరిస్థితులు మెరుగుపడాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జంజాతి) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం 18 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఉన్న 75 పివిటిజి సమూహాలకు ఉద్దేశించబడింది. మూడు సంవత్సరాల కాలంలో పివిటిజి కుటుంబాలు,నివాస ప్రాంతాలకు సురక్షిత గృహాలు, శుభ్రమైన తాగునీరు, విద్య, ఆరోగ్యం, పోషణ సేవలకు చేరువ, రోడ్డు,టెలికాం కనెక్టివిటీ, విద్యుత్ సౌకర్యం లేనిగృహాలకు విద్యుదీకరణ, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు వంటి ప్రాథమిక సదుపాయాలు అందేలా చేయడమే దీనిలో ప్రధాన ఉద్దేశం. ఈ లక్ష్యాలను వివిధ శాఖల సమన్వయంతో అనేక కార్యాచరణల ద్వారా అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. లక్ష్యం గొప్పదే. కానీ ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన ఆదివాసి పివిటిజి నిరుపేద కుటుంబాలకు ఈ పథకం కింద గృహాలు వాస్తవంగా ఆశించినా దాని కంటే మేలు చేస్తాయా అంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే ఇప్పుడు నిర్మిస్తున్న పిఎం జంజాతి గృహాలు కొన్నిచోట్ల సగటు నిరుపేద కుటుంబాలకు శాపంగా మారుతున్నాయి. ఇల్లు కట్టుకోవడం ప్రతి నిరుపేద కుటుంబం కల. మరీ ముఖ్యంగా వెనకబడిన పివిజిటి కుటుంబాలు పూరి గుడిసెల్లో జీవిస్తూ కొండలు అడవుల్లో జీవనం కొనసాగిస్తుంటారు. వీరు బయట ప్రపంచానికి దూరంగా ఎన్నో కట్టుబాట్లతో జీవనం సాగిస్తుంటారు. ఇప్పటి పరిస్థితుల్లో ఇల్లు కట్టాలంటే ఇంటి సామాగ్రి సిమెంట్, ఇనుము, ఇసుక వంటి వాటిని మైదాన ప్రాంతం నుంచి కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకురావాల్సి ఉంటుంది. కానీ రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల ఆ సామాగ్రి చేర్చడంలోనే అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు సిమెంట్, ఇనుము కొనుగోలు ఖర్చుకంటే వాటినిగ్రామాలకు చేర్చడానికి అయ్యే రవాణా ఖర్చే ఎక్కువ అవుతుందని చెప్పవచ్చు. అల్లూరి జిల్లాలో రోడ్డు లేని పివిజిటి గ్రామాలు చాలానే ఉన్నాయి. రహదారి మార్గాలు లేకపోవడం వల్ల కొంత దూరం వరకు వాహనాల్లో తరలించి అక్కడ దించుకుని ఆ తర్వాత మనుషులు ఎత్తుకొని తీసుకెళ్లే పరిస్థితులు



కూడా అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే (పిఎం జంజాతి) గృహాలు పివిజిటి నిరుపేద కుటుంబాలకు ఒక రకంగా అగ్ని పరీక్షగా మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం (పిఎం జంజాతి) గృహాల నిర్మాణానికి రెండు లక్షలముప్పై తొమ్మిదివేల రూపాయలు మంజూరు చేసింది. అయినప్పటికీ ఇల్లు కట్టుకోవడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల అప్పు తీసుకునే పరిస్థితిగా మారుతోంది. మొత్తంగా ఒక ఇల్లు పూర్తి చేయడానికి ఎనిమిది నుంచిపది లక్షల వరకు ఖర్చయ్యే అంచనా ఉంది. ప్రభుత్వం ఇచ్చే 2,39,000 సహాయం ఉన్నా, మిగిలిన మొత్తం సగటు కుటుంబంపై భారీ ఆర్థిక భారం అవుతోంది. అంటే సుమారుగా ఏడులక్షల అరవై ఒక వేల రూపాయలు సగటు కుటుంబానికి భారం పడుతుందని చెప్పడానికి సందేహం లేదు. సగటు కుటుంబం ఇంత ధనాన్ని వెచ్చించగలదా అనే ప్రశ్న సహజంగా వస్తుంది. ఉదాహరణకు అల్లూరి జిల్లాలోని జిమాడుగుల మండలం గడుతూరు పంచాయతీ బొడ్డు మామిడి గ్రామం మండల కేంద్రం నుంచి సుమారుగా అరవై కిలోమీటర్లు దూరంలో ఉంది. ఈ గ్రామానికి వెళ్లడానికి ఎటువంటి రోడ్డు సౌకర్యంలేదు.ఈ ఒక్క గ్రామంలో యాభై కుటుంబాలు నివసిస్తున్నారు. ఈ గ్రామంలో కొంతమందికి ఇప్పటికీ రేషన్ కార్డులు లేవు, మరి కొంత మందికి ఆధార్ కార్డులు లేవు. మరికొన్ని కుటుంబాలకు (ఎన్‌ఆర్ఇజిఎ) జాబ్ కార్డులు కూడా లేవు. అందులో ఈ కేంద్ర ప్రభుత్వం (పిఎం జంజాతి)పథకం ద్వారా కొంతమందికి మాత్రమే గృహాలు మంజూరు చేయటం జరిగింది. ఎందుకంటే జాబ్‌కార్డు ఈ పథక గృహాలకు ముఖ్యమైనదిగా అధికారులు నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఇలాంటి గ్రామాలు ఇంకా మరెన్నో మనకు పాడేరు జిల్లాలో కనిపిస్తాయి. ఇంకా గతంలో అల్లూరిజిల్లాలో పెద్దసంఖ్యలో(ఎన్‌ఆర్ఇజిఎ) జాబ్ కార్డులు తొలగింపుకు గురైన సందర్భాలున్నాయి. ఈ విషయమై గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం కూడా ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పటికీ చాలా గ్రామాల్లో సమస్య అలాగే ఉంది.అందువల్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అల్లూరి జిల్లాలోని గ్రామాలను అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో సందర్శించి రోడ్లు,మంచినీరు,విద్యుత్,విద్య సదుపాయాలు కల్పించగలిగితేనే ఈపథకం నిజంగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా స్థానిక పాడేరు ఐటిడిఏ అధికారులు, జిల్లాకలెక్టర్ కార్యాలయం ఈవిషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.ముఖ్యంగా ఇల్లుకంటే ముందు దారిరావాలి. అప్పుడే ఆదివాసీల సొంత ఇంటి కల నిజంగా నెరవేరుతుంది. ●

# వృద్ధతల్లిదండ్రుల 'భద్రత'కు చట్టాల ఆసరా!

పద్మ పుత్ర మల్లికార్జున

తెలంగాణ రాష్ట్రంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ప్రకటించడం సమాజంలో ఒక ముఖ్యమైన చర్చకు నాంది పలికింది. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమేకాదు, మనసమాజం, కుటుంబ వ్యవస్థ, విలువలు ఎటు దారి తీస్తున్నాయనే ప్రశ్నను కూడా మన ముందుంచింది. తల్లిదండ్రులను చూసుకోవడం అనేది ఎప్పటి నుంచో మన సంస్కృతిలో సహజంగా వస్తున్న ధర్మం. కానీ నేటికాలంలో, ఆ ధర్మాన్ని గుర్తు చేయడానికి ప్రభుత్వం చట్టం చేయాల్సిన పరిస్థితి రావడం నిజంగా ఆలోచింపజేసే విషయం. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం, తెలంగాణలో పనిచేస్తున్న ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే, అతని లేదా ఆమె జీతం నుండి 10నుండి 15శాతం వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇది మాటల హెచ్చరిక కాదు, దీనిని చట్టబద్ధంగా అమలు చేయడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయబోతోంది.అంటే ఈ విషయం మీద ప్రభుత్వం ఎంత శ్రద్ధగా ఆలోచిస్తుందో దీని ద్వారా స్పష్టమవుతుంది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం ఒక వ్యక్తిగత సమస్యగా కాకుండా, ఒక సామాజిక సమస్యగా ప్రభుత్వం గుర్తిస్తోంది. మన దేశంలో ఇప్పటికే వృద్ధతల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్రప్రభుత్వం 2007లో 'మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ అండ్ అదర్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్' అనే చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం, తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు, పిల్లలు వారికి ఆర్థిక సహాయం చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అంతేకాకుండా, తల్లిదండ్రులు తమ పిల్లలు చూసుకుంటారనే నమ్మకంతో ఆస్తులను బదలాయించి, తర్వాత వారు నిర్లక్ష్యం చేస్తే, ఆ ఆస్తులను తిరిగి తమ పేరుపైకి తీసుకునే హక్కు కూడా ఈ చట్టం ఇస్తుంది. అయితే ఈ చట్టం అమలు కోసం వృద్ధులు కోర్టులు, ట్రిబ్యునల్స్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇది చాలా మందికి మానసికంగా, శారీరకంగా కష్టమైన ప్రక్రియ.తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానం ఈ సమస్యకు ఒక భిన్నమైన పరిష్కారాన్ని చూపుతోంది. కోర్టులు, కేసులు, అలస్యం లేకుండా, నేరుగా ఉద్యోగి జీతం నుంచే డబ్బును తల్లిదండ్రులకు అందించడం ద్వారా వృద్ధులకు తక్షణ భద్రత కల్పించాలన్నది దీని లక్ష్యం.ఇది తల్లిదండ్రుల హక్కులను మరింత బలంగా పరిరక్షించే చర్యగా చూడవచ్చు. కానీ అదే సమయంలో, ఇది వ్యక్తిగత జీవితాల్లో ప్రభుత్వ జోక్యాన్ని ఎంతవరకు అనుమతించాలి అన్న ప్రశ్నను కూడా లేవనెత్తుతుంది. ఒక కుటుంబంలో జరిగే వివాదాలను, సంబంధాలను నేరుగా ప్రభుత్వం నియంత్రించడం సరైందా అనే చర్చ తప్పనిసరిగా జరుగుతుంది. భారతదేశంలో వృద్ధుల సంక్షేమం విషయంలో కేరళరాష్ట్రం ఒకఅడుగు ముందుకు వేసింది. 'స్టేట్ ఎల్డరీ కమిషన్ యాక్ట్ 2025' ద్వారా కేరళలో ఒక ప్రత్యేకమైన చట్టబద్ధమైన కమిషన్ను



ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ వృద్ధుల హక్కులు, సంక్షేమం, సమస్యలపై ప్రత్యేకంగా పనిచేస్తుంది. భారతదేశంలో వృద్ధుల కోసం ఇలాంటి సంస్థను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ఇది వృద్ధుల సమస్యలను ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతతో చూస్తుందో చెప్పే ఉదాహరణ. అంతర్జాతీయంగా కూడా అనేక దేశాలు తల్లిదండ్రుల సంరక్షణపై చట్టాలు తీసుకొచ్చాయి. సింగపూర్లో 'మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ యాక్ట్' ఉంది. ఈ చట్టం ప్రకారం, 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉంటే, వారి పిల్లలు వారికి ఆర్థిక సహాయం చేయాల్సిందే. అదే విధంగా చైనాలో 'ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ అండ్ ఇంట్రెస్ట్ ఆఫ్ ఎల్డర్ పీపుల్' అనే చట్టం ఉంది. దీనిలో తల్లిదండ్రులకు ఆహారం, నివాసం, వైద్యం వంటి అవసరాలను పిల్లలు అందించాల్సిన బాధ్యతను స్పష్టంగా పేర్కొన్నారు. అంటే ఈ సమస్య భారతదేశానికే పరిమితం కాదు, ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల నిర్లక్ష్యం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. మన భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులను దైవంతో సమానంగా భావిస్తాం.'మాతృ దేవోభవ, పితృ దేవో భవ' అన్న మాటలు మన చిన్నప్పటి నుంచే మన చెవుల్లో నినదిస్తాయి. శ్రవణ కుమారుడి కథ మనకు తల్లిదండ్రుల పట్ల చూపాల్సిన భక్తి, సేవ ఎంత గొప్పదో గుర్తు చేస్తుంది. తన అంధులైన తల్లిదండ్రులను కావడిలో పెట్టుకుని తీర్థయాత్రకు తీసుకెళ్లిన శ్రవణ కుమారుడు, తన ప్రాణాలు పోయే క్షణంలో కూడా తల్లిదండ్రుల దాహం గురించి మాత్రమే ఆలోచించాడు. అలాంటి కథలు మన సంస్కృతిలో తల్లిదండ్రుల సేవ ఎంతపవిత్రమోచెబుతాయి. కానీ నేటి సమాజంలో పరిస్థితి చాలా మారిపోయింది. పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, ఆర్థిక ఒత్తిళ్లు ఇవన్నీ కలిసి కుటుంబసంబంధాలను బలహీనపరుస్తున్నాయి.చాలా మంది యువత తమ సొంత పిల్లల భవిష్యత్తు గురించి ఎంతగా ఆలోచిస్తారో, తమ తల్లిదండ్రుల వృద్ధాప్యంగురించి అంతగా అలోచించడం లేదు. కొందరు పిల్లలు తల్లిదండ్రులను తమ జీవితంలో ఒక భారంగా చూడడం బాధాకరం. ఆహారం, మందులు, వైద్యసేవలు వంటి కనీస అవసరాలు కూడా ఇవ్వడానికి ఇష్టపడని సందర్భాలు మన చుట్టూ కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోయే చట్టం ఒక హెచ్చరికలా కూడా పనిచేయవచ్చు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, కేవలం నైతికంగా తప్పు చేయడమే కాకుండా,ఆర్థికంగా కూడా దాని ఫలితాలుఉంటాయని ఇది చెప్పుతుంది.ఇది కొంతమందిలో అయినామార్పు తీసుకువచ్చే అవకాశం ఉంది.కనీసం తల్లిదండ్రులకు ఒక స్థిరమైన ఆదాయ మార్గంఏర్పడుతుంది. వారు తమ పిల్లల దయాదాక్షిణ్యాల మీద పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. అయితే ఈచట్టాన్ని అమలు చేసే సమయంలో చాలా జాగ్రత్త అవసరం. ప్రతి కుటుంబ సమస్య ఒకేలా ఉండదు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులే పిల్లలను వేధించే పరిస్థితులు కూడా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో పిల్లలు నిజంగా ఆర్థికంగా ఇబ్బందుల్లోఉండవచ్చు.కాబట్టి ఈ చట్టం గుడ్డిగా అమలవ్వకుండా, ప్రతి కేసును సున్నితంగా పరిశీలించే వ్యవస్థ అవసరం.అందుకే కమిటీ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమైన విషయం. సరైన మార్గదర్శకాలు, రక్షణలు లేకపోతే, ఈ చట్టం కొత్త అన్యాయాలకు కూడా దారి తీసే ప్రమాదంఉంది. తల్లిదండ్రులను చూసుకోవడం చట్టం వల్ల కాదు, మన మనసువల్ల జరగాలి. కానీ మన మనసు మారకపోతే, సమాజాన్ని కాపాడటానికి చట్టాలు రావాలి. ఒక మొక్కమనకు నీడను,పండ్లను ఇస్తుంది. కానీ ఆమొక్క వేర్లుఎండిపోతే, చెట్టుమొత్తం కూలిపోతుంది.అలాగే మనల్ని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులు మన జీవితానికి వేర్లులాంటి వారు.వారి ని నిర్లక్ష్యంచేస్తే, మన జీవితానికి కూడా పునాది ఉండదు. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోయే ఈ చట్టం మనందరికీ ఒక సం దేశంఇస్తోంది.తల్లిదండ్రులను చూసు కోవడం మనపై ఎవరో మోపిన బాధ్యతకాదు, అది మనఅస్తిత్వానికి మూలం. ఇప్పటికైనా మనం మన విలువలను గుర్తుచేసుకొని, తల్లిదండ్రు లను గౌరవించి, వారికి అవసరమైన భద్రతను అందించాలి. ●

# యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు జప్తు



## మరింత కఠిన చర్యలు తీసుకోవాలి

## సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

## రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశం

## విచారణ నాలుగు వారాలకు వాయిదా

**న్యూఢిల్లీ, జనవరి 27:** దేశవ్యాప్తంగా యాసిడ్ దాడి కేసులు పెండింగ్‌లో ఉండటంపై సుప్రీం కోర్టు మంగళవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బాధితులకు పరిహారం అందించడానికి దోషుల ఆస్తులను అటాచ్ చేయడంతో సహా మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, సుప్రీం కోర్టు గతంలో నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారిస్తూ, 15 హైకోర్టులు ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలను అందించాయని పేర్కొన్న విషయాన్ని గమనించింది. సుప్రీం కోర్టు ముందు ఉంచిన స్థితి నివేదిక ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లో మాత్రమే 198 పెండింగ్ కేసులు, గుజరాత్‌లో 114, పశ్చిమబెంగాల్‌లో 60, బీహార్‌లో 68, మహారాష్ట్రలో 58 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఉత్తర్వులో, మిగిలిన హైకోర్టుల నుండి నివేదికలు ఇంకా ఎదురుచూస్తున్నాయని పేర్కొంది. 'యాసిడ్ దాడులకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి నిర్ణయం తీసుకోవాలని తాము హైకోర్టులను అభ్యర్థిస్తున్నాము' అని సుప్రీంకోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా, సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం యాసిడ్ దాడుల నిరోధించడానికి కఠినమైన శిక్షా చర్యల ఆవశ్యకతపై కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిందితుల ఆస్తులను ఎందుకు అటాచ్ చేయకూడదు? ఒక వ్యక్తి యాసిడ్ దాడిలో దోషిగా తేలితే, అతని అన్ని స్థిరాస్తులను ఎందుకు సంపాదించి బాధితుడికి పరిహారం చెల్లించకూడదు? మీరు కొన్ని అసాధారణమైన శిక్షా చర్యలు తీసుకోవాలి. చర్య అంత బాధాకరమైనది కాకపోతే, ఇక్కడ నిరోధక సిద్ధాంతాన్ని అనుసరించాలి' అని సుప్రీంకోర్టు పేర్కొంది. యాసిడ్ దాడుల సంవత్సరాల వారీగా జరిగిన సంఘటనలు, ఛార్జిషీట్ల దాఖలు, నిర్ణయించిన కేసుల సంఖ్య, విచారణ దశలో పెండింగ్, ముగిసిన విచారణల నుండి ఉత్పన్నమయ్యే అప్పీళ్లతో సహా నాలుగు వారాల్లోపు సమగ్ర డేటాను తన ముందు ఉంచాలని కూడా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితుడి విద్యా అర్హతలు, ప్రస్తుత ఉద్యోగ స్థితి, వైవాహిక స్థితి, వైద్య చికిత్స వివరాలు, చికిత్స, పునరావాసం కోసం ప్రభుత్వం చేసిన లేదా ప్రతిపాదించిన ఖర్చులతో సహా ప్రతి యాసిడ్ దాడి బాధితుడి సంక్షిప్త వివరాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా అందించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. యాసిడ్ దాడి బాధితులకు పునరావాసం, పరిహారం, వైద్య సహాయం కోసం అమలు చేయబడిన పథకాల వివరాలను సమర్పించాలని అన్ని రాష్ట్ర న్యాయ సేవల అధికారులను ఆదేశించింది. యాసిడ్ దాడి కేసులను పరిష్కరించే చట్టపరమైన చట్రాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం శాసన జోక్యాన్ని పరిగణించాలని సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా సూచించింది.




# పాక్ నుంచి భారత్‌లోకి భారీగా నకిలీ కరెన్సీ

## ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై డీ కంపెనీ నజర్

**న్యూఢిల్లీ,జనవరి 27:** భారత్‌లో ఈ ఏడాది వరుసగా జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న దావూద్ ఇబ్రహీం సిండికేట్ భారీ కుట్రలు ప్రారంభించింది. కోట్లాదిరూపాయల విలువైన నకిలీ కరెన్సీని దేశంలోకి చొప్పించేందుకు సిద్ధమవుతోందని భారత నిఘా వర్గాలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్థాన్‌లో భారీ ఎత్తున నకిలీ భారత కరెన్సీ నోట్లను ముద్రించి, వాటిని బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి భారత్‌లోకి అక్రమంగా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా ప్రాంతం నకిలీ నోట్ల రవాణాకు ప్రధాన కేంద్రంగా మారినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు గుర్తించారు. బంగ్లాదేశ్ నుంచి పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ మాల్దాకు చేరనుందని, అందుకు స్థానిక నెట్‌వర్క్ సన్నాహాలు చేసుకుంటోందని సమాచారం అందింది. ఈ నకిలీ నోట్లను అత్యంత నాణ్యతతో, అత్యాధునిక యంత్రాలపై ముద్రిస్తున్నారని ఫోరెన్సిక్ నిపుణులు చెబుతున్నారు. అసలు నోట్లలో ఉండే వాటర్‌మార్క్‌ను సైతం పక్కాగా రూపొందిస్తుండటంతో, వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యమని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే కరెన్సీ ప్రింటింగ్ యంత్రాల ద్వారానే వీటిని ముద్రిస్తున్నట్లు ఏజెన్సీలు బలంగా అనుమానిస్తున్నాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇస్లామాబాద్ పట్ల ఇటీవల అనుసరిస్తున్న మెతక వైఖరితో, పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌కు సముద్ర మార్గం ద్వారా నకిలీ నోట్ల రవాణా సులువుగా మారింది. ఇదే మార్గంలో ఆయుధాలు కూడా చేరుతున్నాయని ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో మార్చి నుంచి మే మధ్య ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో భద్రతా సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటారు. ఇదే అదనుగా భావించి, నకిలీ నోట్లను సులభంగా చెలామణి చేయాలని డీ కంపెనీ ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో, ముఖ్యంగా మాల్దా పరిసరాల్లో నిఘాను తీవ్రతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కరెన్సీ ఒక్కసారి దేశంలోకి ప్రవేశిస్తే అడ్డుకోవడం కష్టమని, అందుకే సరిహద్దుల్లోనే దీన్ని నిరోధించడం కీలకమని వారు పేర్కొన్నారు.

# రైలు జాప్యానికి విద్యార్థినికి రూ.9 లక్షల పరిహారం

## కోర్టు ఖర్చులుగా రూ.12 వేలు చెల్లించాలని ఆదేశం




**బస్తీ(యుపి),జనవరి 27:** రైలు ఆలస్యంతో ఓ విద్యార్థి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిన కేసులో న్యాయస్థానం తాజాగా కీలక తీర్పు వెలువరించింది. ఆవిద్యార్థినికి రైల్వే శాఖ నుంచి రూ.9లక్షల పరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరమ్ భారతీయ రైల్వేను ఆదేశించింది. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాకు చెందిన సమృద్ధి అనే విద్యార్థిని 2018లో బీఎస్సీ బయోటెక్నాలజీ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంది. పరీక్షకు లక్నోలోని జై నారాయణ్ పీజీ కళాశాల సెంటర్ పడింది. దీంతో పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఆమె ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. కానీ, ఆ రైలు నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా చేరుకుంది. దీంతో సమృద్ధి టైమ్‌కి పరీక్షా కేంద్రానికి చేరుకోలేకపోయింది. ఫలితంగా ఆమె ఓ అకాడమిక్ ఇయర్‌ను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన విద్యార్థిని రైల్వే శాఖపై న్యాయపోరాటానికి దిగింది. జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. దాదాపు ఏడు సంవత్సరాలు జరిగిన న్యాయ పోరాటం తర్వాత కమిషన్ ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ లోపాలకు రైల్వే శాఖే బాధ్యత వహించాలని తీర్పు చెప్పింది. విద్యార్థిని కోల్పోయిన విద్యా సంవత్సరానికి గానూ పరిహారంగా రూ.9లక్షలు, కేసు ఖర్చుల నిమిత్తం రూ.12వేలు చెల్లించాలని రైల్వే శాఖను వినియోగదారుల కోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని 45 రోజుల్లో చెల్లించాలని స్పష్టం చేసింది.




## సిగరెట్ లైటర్ కోసం ఘర్షణ

# ఒకరు మృతి

**కోలార్, జనవరి 27:** సిగరెట్ లైటర్ కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. మరొకరి నాలుక తెగి, తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా కమ్మసంద్రలో ఈ దారుణ ఘటన జరిగింది. కర్ణాటకలోని కమ్మసంద్రలో క్రికెట్ పోటీలకు ఇద్దరు స్నేహితులు ప్రశాంత్ (35), రోషన్ హెగ్డే వెళ్లారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇద్దరు మద్యం సేవించారు. ఈ క్రమంలో స్నేహితులు ఇద్దరి మధ్య సిగరెట్ లైటర్ విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ ముదరడంతో బీర్ బాటిళ్లతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రోషన్ హెగ్డే నాలుకకు తీవ్రగాయమైంది. తీవ్ర గాయాలు కావడంతో భయపడిపోయిన రోషన్ తన కారులో అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. కానీ ప్రశాంత్ అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. కారు డోర్ పట్టుకుని అడ్డగించేందుకు చూశాడు. దీంతో ప్రశాంత్‌ను అలాగే కారుతో ఈడ్చుకెళ్లి వేగంగా చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రశాంత్ మృతికి కారణమైన రోషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోషన్ నాలుక తెగిపోవడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో అతనికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన దృశ్యాలు కారు డ్యాష్‌బోర్డు కెమెరాలో రికార్డయ్యాయి.

# కేంద్ర ప్రభుత్వరంగ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ.20 లక్షల పరిమితి




**న్యూఢిల్లీ, జనవరి 27:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, ఏకరూప మార్గదర్శకాలను జారీ చేసింది. గ్రాట్యుటీ అర్హత, చెల్లింపు కాలపరిమితులు, రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి ఎప్పటి నుంచి వర్తిస్తుందన్న గందరగోళంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డిపిఇ) ఒక ఆఫీస్ మెమోరాండం విడుదల చేసింది. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం 1972కు చేసిన సవరణల నేపథ్యంలో 2017, 2018లో జారీ చేసిన పలు సూచనలను, వివరణలను క్రోడీకరించి ఈ తాజా మార్గదర్శకాలను రూపొందించినట్లు డీపీఈ తెలిపింది. సీపీఎస్‌ఈలలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లు, నాన్‌ఎగ్జిక్యూటివ్‌లు సహా అందరు ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం1972కు 2018లో సవరణలు చేసి, గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచుతూ కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2018 మార్చి 29 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం 2018 మార్చి 29 లేదా ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన లేదా గ్రాట్యుటీకి అర్హులైన సీపీఎస్‌ఈ ఉద్యోగులందరికీ రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి వర్తిస్తుంది. ఇది చట్టబద్ధమైన నిబంధన కాబట్టి, సంస్థల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ఈ మొత్తాన్ని తప్పనిసరిగా చెల్లించాలని డీపీఈ తన మెమో రాండంలో స్పష్టం చేసింది. 2017 జనవరి 1 నుంచి 2018 మార్చి 28 మధ్య కాలానికి సంబంధించిన గ్రాట్యుటీ చెల్లింపులు ఆయా సంస్థల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ కాలంలో ఐడీఏ పే స్కేల్‌లో వేతన సవరణ పొందిన ఎగ్జిక్యూటివ్‌లు, నాన్‌యూనియనైజ్డ్ సూపర్‌వైజర్లకు వారి సంస్థ ఆర్థిక భారాన్ని మోయగలదా అనే అంశాన్ని బట్టి గ్రాట్యుటీ చెల్లింపులు జరపడానికి అనుమతించారు. సీపీఎస్‌ఈ ఉద్యోగులలో తరచూ తలెత్తే ఒక ముఖ్యమైన అనుమానాన్ని కూడా డీపీఈ నివృత్తి చేసింది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ పరిమితిని 2016 జనవరి 1 నుంచి రూ. 10 లక్షలనుంచి రూ.20లక్షలకు పెంచారు. అయితే, ఈ పెంపు సీపీఎస్‌ఈ ఉద్యోగులకు వర్తించదని కేంద్రం తేల్చిచెప్పింది.సీపీఎస్‌ఈ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని 2016జనవరి 1నుంచి క్లెయిమ్ చేసుకోవడానికి వీలులేదని స్పష్టం చేసింది. ఈ ఏకీకృత మార్గదర్శకాలను అన్ని సీపీఎస్‌ఈలు కచ్చితంగా పాటించేలా చూడాలని, వాటి పరిధిలోని సంస్థలకు ఈ సమాచారాన్ని చేరవేయాలని అన్ని పరిపాలనా మంత్రిత్వ శాఖలను, విభాగాలను డీపీఈ ఆదేశించింది.

## ఫుట్‌బాల్ మైదానంలో మాఫియా కాల్పులు..

# 11 మంది మృతి , 20 మందికిపైగా గాయాలు




**మెక్సికోసిటీ, జనవరి 27:** మెక్సికోలోని ఫుట్‌బాల్ మైదానంలో దుండగులు తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒక మహిళ, చిన్నారి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మెక్సికోలోని గ్వానాహువాటో రాష్ట్రం సలమంకా నగరంలో ముందురోజు రాత్రి ఈ ఘటన జరిగింది. సాకర్ మ్యాచ్ పూర్తయిన తర్వాత పలువురు అభిమానులు మైదానంలోనే ఉన్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన పలువురు దుండగులు కాల్పులకు దిగారు. దాదాపు 100 రౌండ్ల కాల్పులు జరిపినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన వెనుక గల కారణాలు మాత్రం తెలియరాలేదు. అయితే ఈ ఘటన వెనుక ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్యాంగ్ ఉందని సలమంకా మేయర్ సీజర్ ప్రిటో తెలిపారు. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు మెక్సికో ప్రభుత్వం సహకరించాలని కోరారు. అధికారులను లొంగదీసుకునేందుకు క్రైమ్ గ్యాంగ్‌లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్వానహువాటోలో చమురు దోపిడీ, డ్రగ్స్ ట్రాఫికింగ్‌కు సంబంధించిన గ్యాంగ్‌ల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ముఖ్యంగా జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్, శాంటారోసా డి లామా కార్టెల్ గ్యాంగ్‌ల మధ్య గొడవలు నడుస్తున్నాయి. తాజాగా సాకర్ గ్రౌండ్‌లో జరిగిన కాల్పులు కూడా ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య వార్‌గానే అనుమానిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందుమైనార్టీ హంతకుల రక్షణకోసం ప్రత్యేక ఆర్డినెన్స్



**ఢాకా, జనవరి 27:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనా రిటీలపై దాడులు పెరిగిపోతుంటే వాటిని అడ్డుకోవాల్సిన యూనస్ సర్కారు ప్రభుత్వం నిందితులకు అండగా నిలుస్తోంది. హంతకులు, ఆందోళనకారులకు రక్షణ కల్పించే చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా తర్వాత ముహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అక్కడ ఆందోళనలు ఎక్కువయ్యాయి. పోలీసులు, భద్రతా బలగాలతోపాటు హిందువులపై, రాజకీయ ప్రత్యర్థులపై ఆందోళనకారులు దాడులు, హత్యలు చేశారు. గత ఏడాది జులై ఆగష్టు సమయంలో ఈ దాడులు ఎక్కువగా జరిగాయి. ఈ ఘటనల్లో పోలీసులతోపాటు హిందువులు, ఇతర పౌరులు మరణించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు భారీగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన యూనస్ ప్రభుత్వం ఇప్పుడు వారికి అండగా నిలిచింది. వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రొటెక్షన్ అండ్ లయబిలిటీ డిటర్మినేషన్ ఆర్డినెన్స్ 2026ను ఆదివారం అర్ధరాత్రి జారీ చేసింది. ఈ ఘటనల్లో నిందితులకు రక్షణ లభిస్తుంది, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. నిందితులపై ఇప్పటివరకు నమోదైన సివిల్, క్రిమినల్ కేసుల్ని రద్దు చేస్తారు. కొత్త కేసులు నమోదు చేయడానికి వీల్లేదు. జూలై, ఆగష్టులో పోలీసులు, హిందువులు, మైనారిటీలు, అవామీ లీగ్ సభ్యుల్ని చంపిన వారిపై చర్యలుండవు. ఇస్లామిస్టులు, అతివాదులు అయిన హంతకులు ఇకపై స్వేచ్ఛగా తిరుగుతారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా అప్పట్లో ఆందోళనకారులు తీవ్ర హింసకు పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్లు కూడా తగలబెట్టేశారు. కొందరిని లక్ష్యంగా చేసుకుని హత్యలు చేశారు. అక్కడ ఏడాదిన్నర కాలంగా హసీనా పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. ఈ ఘటనల్లో గత అక్టోబర్ వరకు 44 మంది పోలీసులు మరణించినట్లు అక్కడి నివేదికలు తెలిపాయి. ఆగష్టు 5, 2024న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూలిపోయింది. తనకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా ఇండియాకు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు.



# ఇరాన్‌పై దాడికి అమెరికా యుద్ధనౌక సిద్ధం

**వాషింగ్టన్, జనవరి 27:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ తాజాగా పశ్చిమాసియాకు చేరుకుంది. దీంతో ఇరాన్‌పై యుఎస్ ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. అబ్రహం లింకన్‌తోపాటు యుఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యుఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యుఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇక్కడికి చేరుకున్నాయి. అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వం కోసం దీన్ని మోహరించినట్లు పేర్కొంది. ఈ బృందం ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో కాకుండా హిందూ మహాసముద్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ పరిణామాలతో ఈ ప్రాంతంలో అమెరికా సైనిక సిబ్బంది సంఖ్య మరింత పెరిగింది. ఇదిలా ఉండగా పెంటగాన్ పలు ఫైటర్ జెట్‌లు, మిలిటరీ కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తరలించనున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులకు మద్దతుగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారికి వ్యతిరేకంగా ఇరాన్ ప్రభుత్వం ఏదైనా చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో భారీగా తమ సైన్యాన్ని ఇరాన్ దిశగా పంపినట్లు ప్రకటించారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

**చర్చలకు అమెరికా సిద్ధం:** ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ చర్చించాలనుకుంటే అమెరికా అందుకు సిద్ధంగా ఉందన అగ్రరాజ్యానికి చెందిన అధికారి ఒకరు పేర్కొన్నారు. చర్చలు ముందుకు సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో టెహ్రాన్‌కు ఇప్పటికే తెలుసని అన్నారు.

# సంక్షిప్తంగా..

## ఫ్రాన్స్‌లో 15 యేళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం



**ప్యారిస్, జనవరి 27:** పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 యేళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా ఓ చట్టం తీసుకురానుంది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ప్రకటించారు. 15యేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా మాధ్యమా లను ఉపయోగించడాన్ని నిషేధించే బిల్లుకు ఫ్రాన్స్ దిగువ సభలోని శాసనసభ్యులు మద్దతిచ్చారన్నారు. సెనెట్‌లో దీనిపై చర్చలు జరిపి, బిల్లుపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.పిల్లలు గంటలకొద్దీ సమయాన్ని స్క్రీన్‌కు కేటాయించడం వల్ల వారిలో తలెత్తుతున్న ఆరోగ్య, మానసిక సమస్యలను నివారించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు మేక్రాన్ వెల్లడించారు. ఫిబ్రవరి చివరికి సెనెట్ ఈ బిల్లును ఆమోదించే అవకాశం ఉందని ఫ్రాన్స్ అధికారులు పేర్కొన్నారు. సోషల్ మీడియాపై నిబంధనలు సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

## ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికాలో అసంతృప్తి




**వాషింగ్టన్, జనవరి 27:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్-ఇప్సాస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది. వలసలపై ఆయన తీసుకుంటున్న కఠిన చర్యలు చాలా దూరం వెళ్లాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వలసదారుల్ని అడ్డుకోవడానికి అమెరికాలోని పలు ప్రాంతాల్లో ట్రంప్ యంత్రాంగం ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించింది. దీనికి నిరసనగా జరిగిన ఘర్షణల్లో ఆ ఏజెంట్ల చేతిలో శనివారం మినియాపొలిస్‌లో మరో అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు ముందు, తర్వాత అంటే శుక్రవారం నుంచి ఆదివారం మధ్య ఈ పోల్ చేపట్టగా ట్రంప్ నిర్ణయాలను ఆమోదించేవారి సంఖ్య తగ్గిపోయింది. తాజాగా 39 శాతం మంది ఆమోదించగా అంతకుముందు ఆ రేటు 41 శాతంగా ఉంది.

## ప్రపంచ ఇంధన మార్కెట్లలో టాప్ భారత్: కెనడా మంత్రి



**న్యూఢిల్లీ,జనవరి 27:** ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభి వృద్ధి చెందుతోందని కెనడా ఇంధన మంత్రి టిమ్ హడ్గ్‌సన్ వ్యాఖ్యానించారు. ఇంధన రంగంలో కెనడా సూపర్‌పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను, ఎనర్జీ ట్రేడ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడం కోసం ఒట్టావా నుంచి భారత్‌కు ముడి చమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సిద్ధంగా ఉందని టిమ్ హడ్గ్‌సన్ తెలి పారు. కెనడా మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ మంత్రి హార్దీప్‌సింగ్ పురి మీడియాతో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## ఎక్కడినుంచైనా..ఎప్పుడైనా ఆధార్ మొబైల్ అప్‌డేట్




**న్యూఢిల్లీ,జనవరి 27:** ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్డేట్‌కు సంబంధించి కేంద్ర విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) కీలక ప్రకటన చేసింది. ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అప్డేట్ చేసే ప్రక్రియను మరింత సులభతరం చేసింది. దీని ద్వారా ఇప్పుడు మొబైల్ నంబర్‌ను ఇప్పుడు ఎక్కడి నుంచైనా ఎప్పుడైనా అప్డేట్ చేసుకునే వీలు కల్పించనుంది. ఈ మేరకు ఆధార్ తన ట్విట్టర్‌లో దీని గురించి పోస్ట్ చేసింది. ఇక్కడ జనవరి 28 నుంచి ఈ సదుపాయం ఆధార్ కొత్త యాప్‌లో అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఇకపై ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్డేట్ కోసం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉం డదు. దీంతో ప్రజలపై భారం తగ్గుతుందని భావిస్తోంది.

# భద్రతామండలిలో మరోసారి బయటపడిన పాక్ వక్రబుద్ధి

## తిప్పికొట్టిన భారత్ శాశ్వతప్రతినిధి




**న్యూయార్కు,జనవరి 27:** ఐక్యరాజ్యసమితి లో పాకిస్థాన్ వైఖరిని భారత్ మరోసారి ఎండగట్టింది. ఆపరేషన్ సిందూర్ పై ఆ దేశ రాయబారి చేసిన తప్పుడు ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టింది. ఉగ్రవాదాన్ని చట్టబద్ధం చేసేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోందని మండిపడింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో పాక్ రాయబారి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్, జమ్ముకశ్మీర్, సింధూ జలాల ఒప్పందం గురించి ప్రస్తావించారు. ఉగ్రవాదాన్ని శిక్షిస్తూ సరికొత్త సాధారణ స్థితి నెలకొల్పినట్లు భారత్ చెబుతున్న పరిస్థితి ఏమీ కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తమ ప్రతిస్పందనతోనే తేలిపోయిందని వ్యాఖ్యానించారు. దీనిపై ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. అంతర్జాతీయ వేదికల్లో పాకిస్థాన్ ప్రతిసారీ భారత్‌కు, దేశ ప్రజలకు హాని కలిగించడమే అజెండాగా పెట్టుకుందని మండిపడ్డారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ గురించి వివరించారు. జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని హరీశ్ పునరుద్ఘాటించారు. భారత అంతర్గత అంశాలపై వ్యాఖ్యానించే హక్కు పాకిస్థాన్‌కు లేదన్నారు. 65 ఏళ్ల క్రితం విశ్వాసం, స్నేహం స్ఫూర్తితో భారత్ సింధూ జలాల ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. అందుకే భారత్ ఆ ఒప్పందాన్ని నిలిపివేసిందని తెలిపారు.

# అమెరికా మద్దతులేకుండా ఐరోపా స్వీయరక్షణ అసాధ్యం: మార్క్ రుట్టే



**బ్రస్సెల్స్,జనవరి 27:** అమెరికా సైనిక మద్దతు లేకుండా యూరప్ తనను తాను రక్షించుకోగలదని భావిస్తే, అది పగటి కలలు కనడమేనని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే సంచలన వ్యాఖ్యలు చేశారు. యూరప్ భద్రత విషయంలో వాస్తవికంగా ఉండాలని, అమెరికాపై ఆధారపడటం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ పార్లమెంట్‌లో భద్రత, విదేశీ వ్యవహారాల కమిటీల సభ్యులను ఉద్దేశించి మార్క్ రూటె ప్రసంగించారు. అమెరికా లేకుండా యూరప్ తనను తాను కాపాడుకోగలదని ఇక్కడ ఎవరైనా అనుకుంటే, వారు ఆ కలలు కంటూనే ఉండవచ్చు. కానీ అది సాధ్యం కాదని ఆయన తేల్చి చెప్పారు. ఇటీవలి కాలంలో గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా విధానం, కూటమి సభ్య దేశాల సహకారంపై నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రూటె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూరప్ భద్రత విషయంలో నాటో, యూరోపియన్ యూనియన్ (ఈయూ) పరస్పరం పోటీ పడకూడదని, ఒకరికొకరు సహకారంతో పనిచేయాలని ఆయన సూచించారు. యూరప్ తన రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడం చాలా కీలకమని అయితే అది నాటో ప్రయత్నాలకు ప్రత్యామ్నాయం కాకూడదని అన్నారు. యూరప్, కెనడా దేశాలు తమ భద్రతపై మరింత బాధ్యత తీసుకుంటున్నాయని, ఇది శుభపరిణామమని అన్నారు. ఉక్రెయిన్‌కు అందిస్తున్న సైనిక, మానవతా సహాయాన్ని ప్రస్తావిస్తూ, రష్యాదాడుల వల్ల ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని తెలిపారు. ప్రస్తుతం యూరప్ తన రక్షణ పరిశ్రమను నిర్మిస్తున్నప్పటికీ, ఉక్రెయిన్‌కు తక్షణ అవసరాలను తీర్చే స్థాయిలో అది లేదని అభిప్రాయపడ్డారు.

# మేడారంలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందించండి

### అధికారులను ఆదేశించిన వైద్య మంత్రి దామోదర రాజనర్సింహా

### 50 పడకల హాస్పిటల్, మెడికల్ క్యాంపుల్లో అందుతున్న సేవలపై ఆరా

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణలో అతిపెద్ద గిరిజన పండుగగా జరిగే మేడారం జాతర నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. నేటి నుంచి 31 వరకు జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతర గద్దెల వద్ద ఏర్పాటు చేసిన 50 పడకల హాస్పిటల్, మినీ హాస్పిటల్స్, ప్రధాన మెడికల్ క్యాంపుల్లో స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన 3 హాస్పిటళ్లు, 30 మెడికల్ క్యాంపులు, జాతరకు వెళ్లే ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన మరో 42 మెడికల్ క్యాంపుల్లో అందిస్తున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. 3 హాస్పిటళ్లు, 72 మెడికల్ క్యాంపుల్లో కలిపి 544 మంది డాక్టర్లు సహా మొత్తం 3199 మంది సిబ్బందిని డిప్యూట్ చేశామని అధికారులు మంత్రికి వివరించారు. అవసరమైన అన్ని రకాల మెడిసిన్స్, కన్జుమబుల్స్, ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంచుకున్నామని తెలిపారు. మేడారంలో గద్దెల వద్ద 50 పడకల హాస్పిటల్, జంపన్న వాగు వద్ద 6 బెడ్ల హాస్పిటల్, ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మరో మినీ హాస్పిటల్ ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ 11,625 మందికి వైద్య సేవలు అందించామని వెల్లడించారు. పేషెంట్లను తరలించడానికి 108 అంబులెన్స్‌లు 38, బైక్ అంబులెన్స్ 40 సిద్దంగా ఉంచామని అధికారులు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. జాతరలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌పై నిఘా పెట్టాలని, నాసిరకం ఆహార పదార్థాలను విక్రయించే షాపులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతరలో ఏర్పాటు చేసిన హాస్పిటల్స్, మెడికల్ క్యాంపుల లొకేషన్లు, ఇతర వివరాలు భక్తులకు తెలిసేలా, తక్షణమే అన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. తక్షణమే మేడారం వెళ్లి జాతర అయిపోయే వరకూ అక్కడే ఉండి పర్యవేక్షించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులతో పాటు, వివిధ జిల్లాల నుంచి మేడారం చేరుకునే 8 ప్రధాన రూట్లలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల్లోనూ డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా 4 వీలర్, 2 వీలర్ అంబులెన్స్‌లు 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో నిమిషాల వ్యవధిలోనే పేషెంట్లను షిఫ్ట్ చేసి, వారికి వైద్యం అందించాలన్నారు. ఒకవేళ పేషెంట్‌కు హాస్పిటల్ కేర్ అవసరం పడితే, ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. నేటి నుంచి ప్రారంభం కానున్న సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. జాతరకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకూ సొంతగానే ఫుడ్ ప్రిపేర్ చేసుకోవాలని మంత్రి సూచించారు.



## తెలంగాణలో పెట్టుబడులకు మంచి అవకాశాలు

### అసెంబ్లీని సందర్శించిన జర్మనీ-అయిచి ఎమ్మెల్యేల బృందం

### చర్చల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 27:** జపాన్ దేశంలోని అయిచి రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల బృందంతో కూడిన అయిచి ఎకనామిక్ డెవలప్మెంట్ ఫోరం మంగళవారం తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించింది. ఫోరం చైర్మన్ హిరిహితో కోండో, తొమ్మిది మంది అయిచి రాష్ట్ర ఎమ్మెల్యేల బృందానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, అధికారులు స్వాగతం పలికారు. స్పీకర్ ఛాంబర్‌లో తెలంగాణ అయిచి రాష్ట్ర సభ్యుల బృందం సమావేశమైంది.

వివిధ రంగాలలో సహకారంపై చర్చించారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రాంతం సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నతమైనవి. తెలంగాణ రాష్ట్రం 2014 లో నూతనంగా ఏర్పడింది. శాసనసభలో 119 మంది సభ్యులు, శాసనమండలి లో 40 మంది సభ్యులు ఉన్నారు. శాసనసభ సభ్యులను ఎన్నికల ద్వారా నేరుగా ప్రజలు ఎన్నుకుంటారు. శాసనసభలో చర్చలు అర్థవంతంగా జరుగుతు న్నాయి అని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడానికి కృషి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టు బడులకు మంచి అవకాశాలు ఉన్నాయి. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లా డుతూ. భారతదేశం జపాన్ దేశాల మధ్య మొదటినుంచి చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పడినప్పటికీ పెట్టుబడులకు అన్ని విధాలుగా మంచి వాతావరణం ఉన్నది. ఈసందర్భంగా జర్మనీ బృంద సభ్యులకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

## మేడారం జాతర సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 27:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా, మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలు సమ్మక్క సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ అన్నారు. కొంగు బంగారమై,కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు, కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర,కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతుందని తెలిపారు.

తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాజాల సబ్బండ కులాల సంస్కృతి సాంప్రదాయాలకు పదేండ్ల బిఆర్ఎస్ పాలన పెద్దపీట వేసిందని కేసీఆర్ పేర్కొన్నారు. గోదావరిలోయ పరీవాహక ప్రగతితో సమాంతరంగా సాగిన ఆధ్యాత్మిక అభివృద్ధిని, ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు.అన్ని రంగాల్లో ప్రగతి తిరిగి పుంజుకొని, తెలంగాణ ప్రజలు సుభిక్షంగా జీవించేలా దీవించాలని, సమ్మక్క సారలమ్మ దేవతలను కేసీఆర్ ప్రార్థించారు.

## సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

### సొంత ఇంటి కలను సాకారం చేస్తాం

### డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త :** సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. సింగరేణి కార్మికుల కోసం తాజాగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సింగరేణి ఉద్యోగుల మారు పేరుకు సంబంధించి త్వరితగతిన పరిష్కారం చేస్తామన్నారు. అలాగే మెడికల్ ఇన్వాల్యుయేషన్ సంబంధించి వాళ్లకున్న వ్యాధులకు సంబంధించి అన్ని విధాల పరిష్కారం చూపిస్తామని చెప్పారు. కోల్ ఇండియ నిబంధనల మేరకు సింగరేణి అధికారులకు కల్పిస్తున్న సౌకర్యాలను కార్మికులకు కూడా వర్తింప చేయడం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే సింగరేణి ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం ఐఫోర్ కమిటీ నిర్ణయించి, వారి కల సాకారం చేస్తామని పేర్కొన్నారు. కాగా ఇప్పటికే సింగరేణి ఉద్యోగులందరికీ దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఈ పథకం దేశవ్యాప్తంగా ఒక నమూనాగా గుర్తింపు పొందిందని తెలిపారు. అదేవిధంగా సంస్థలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కోసం రూ.40 లక్షల ఉచిత ప్రమాద బీమా పథకం అమలు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ట వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. తమ ప్రభుత్వం సింగరేణిలో 2,539 పోస్టులను భర్తీ చేయడం జరిగిందని చెప్పారు. వీటిలో 798 ఎక్స్ టర్నల్ పోస్టులు ఉండగా, 1,741 కారుణ్య నియామకాలు ఉన్నాయని వివరించారు. వీటితో పాటు, క్యాథ్ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా సింగరేణి ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇక 2024-25లో సింగరేణి చరిత్రలో అత్యధికంగా రూ.6,394 కోట్లు సాధించగా, అత్యధికంగా 34 శాతం లాభాల వాటా కింద రూ.802 కోట్లను కార్మికులకు చెల్లించామన్నారు. వీరితో పాటు, పొరుగు సేవల సిబ్బందికి కూడా రూ.5,500 చొప్పున లాభాల్లో వాటా చెల్లించినట్లు తెలిపారు.

## 9 నుంచి ఇ-సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

### 5న నోటిఫికేషన్ జారీ.. మే 15న పరీక్ష

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి బి.ఇ., బి.టెక్., బి.ఫార్మ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 9 నుంచి స్వీకరించనున్నారు. దీని నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 5న జారీ చేయనున్నట్లు ఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెట్-2026 కమిటీ మొదటి సమావేశం మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. కమీటీ సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఈ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 5న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 9 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఏప్రిల్ 18 వరకు దరఖాస్తులను స్వీకరించ నున్నారు. ఎస్సీ, ఎస్టీ, పిహెచ్ అభ్యర్థులకు రూ. 500 ఫీజు కాగా ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. మే 15న ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. ఈ సెట్‌లో లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా, బి.ఎస్సీ (గణితం) డిగ్రీ అభ్యర్థుల నుండి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

## కంటోన్మెంట్ గ్రేటర్‌లో విలీనం అయ్యేదాక పోరాడుతా : ఎమ్మెల్యే శ్రీగణేష్

### రిలే దీక్షను ముగించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జనవరి 27, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు సివిల్ ఏరియా ప్రాంతాలను



రిలే నిరాహారదీక్షను విరమింపజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పోరేషన్‌లో విలీనం కోసం పోరాడుతున్న తమ ఉద్యమం గ్రేటర్‌లో విలీనం అయ్యేంత వరకు దశాల వారిగా ప్రజా ఉద్యమం చేపడుతామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. కార్ఖానలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 8 రోజులుగా కొనసాగుతున్న నిరాహారదీక్షను ముగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌ను గ్రేటర్‌లో విలీనం చేయాలని చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఈ ఉద్యమం భవిష్యత్తులో మరింత రూపాంతరం చెంది వివిధ దశాల వారీగా వినూత్న రీతిలో పోరాడుతా మన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, తెలంగాణ ఏర్పాటు కోసం ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన పోరాటలు కూడా ఒక్క రోజులో సాధ్యం కాలేదన్నారు. ఎన్నో యేండ్ల పాటు సాగిన ప్రజల మద్ధతుతో అవి సాధ్యమైయ్యాయన్నారు. కంటో న్మెంట్ ప్రజల పోరాటంతో ఉద్యమి స్తామన్నారు. బోర్డు ఎన్నికలు లేకుండా నామినేటెడ్ వ్యవస్థతో ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్,బోయిన్‌పల్లి మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్, కాంగ్రెస్ సీనియర్ నేతలు బద్రి నాథ్ యాదవ్, చింతల వేణుగోపాల్ రెడ్డి, మురళీ ముదిరాజ్, రాజేశ్ యాదవ్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్‌యాదవ్‌లు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షను విరమింపజేశారు.

## మనోహర్‌పై తక్షణమే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

### లేదా ఒయును ముట్టడిస్తాం: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 27, ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటిలో ప్రొఫెసర్ బి.మనోహర్‌పై వేసిన సస్పెండ్‌ను తక్షణమే రద్దు చేసి, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సిఎఎస్) ఇంటర్వ్యూలలో అన్ని అర్హతలు కలిగి, యుజిసి నిబంధనలు ఉన్న 47 మంది అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర .కృష్ణయ్య వైస్-ఛాన్సలర్‌ను డిమాండ్ చేశారు. లేని పక్షంలో వేలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు, బిసిలతో కలిసి ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

ఓయూ టీచర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ మనోహర్‌పై సస్పెండ్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఓయూ కుమార్ సొంత ఆస్తి కాదని, నీరో చక్రవర్తి వలే ప్రవర్తిం చరాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఇందిరాశోభన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కుమార్ దొంగా-లంగా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కావ్యాకిషన్‌రెడ్డి తదితరులు

## వికసిత్ భారత్ లక్ష్యంగా ముందడుగు

### మహిళల ఆర్థిక స్వావలంబనతోనే ప్రగతి

### ఎబివి ఫౌండేషన్ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 27, ప్రభాతవార్త:** వికసిత్ భారత్ లక్ష్యంగా ముందడుగు వేయడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మేలో అటల్ బిహారి వాజపేయ్(ఏబీవీ) ఫౌండేషన్ ద్వారా నైపుణ్యజ్ఞాన శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన గవర్నర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు ఒకప్పుడు నామ మాత్రం గానే ఉండేవని, కొంతమేరకే పరిమితమయ్యేవని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో స్వయం సహాయక సంఘాలను క్రియాశీలకంగా మలిచారన్నారు. పిఎం ఆవాస్ యోజన ద్వారా దాదాపు 4 కోట్ల మంది పేద ప్రజలకు పక్కా ఇళ్లు కట్టించి ఇచ్చారన్నారు. మహిళలు ఆర్థికంగా బాగుంటే కుటుంబమంతా బాగుంటుందన్నారు. మహిళలు కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటే కుటుంబంతోపాటు దేశానికి కొత్త దశ, దిశను తీసుకురావచ్చని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ నేతృత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అంతరిక్ష రంగం నుంచి బస్తీల్లో పేద మహిళలకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఒకప్పుడు ధనవంతులకు మాత్రమే పరిమితమైన డిజటల్ లావాదేవీలు, ప్రతి ఒక్కరి ఇంటికి వచ్చిందన్నారు. బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లలోని స్కిల్ సెంటర్లలో ఎన్ని ఒత్తిడులు ఉన్నా కూడా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎబివి ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ కావ్యాకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో నైపుణ్య కేంద్రాలను ప్రారంభించామని, సికిందరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో 15 కేంద్రాలకుపైగా ఉన్నాయన్నారు. 25 వేలకుపైగా మహిళలు ఇక్కడ శిక్షణ పొంది, సొంత కాళ్లపై నిలదొక్కుకున్నారన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

### బకాయిలు తక్షణమే చెల్లించాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎన్.రామచందర్‌రావు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జనవరి 27, ప్రభాతవార్త:** పదవీవిరమణ పొందిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా రామచందర్‌రావుతో పాటు రాజ్యసభ సభ్యుడె డాక్టర్ కే.లక్ష్మణ్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటెపల్లి వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, ఎ.వి.ఎన్.రెడ్డి, అంజిరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం బీజేపీ చేపట్టిన ఉద్యమం కేవలం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే కాదని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నీళ్ల నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిన తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించటం లేదని, పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వటం లేదని ఆరోపిం చారు. 2000 కోట్లకు పైగా రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ పెండింగ్‌లో ఉన్నాయని, గత యేడాది డిప్యూటీ సిఎం ప్రతి నెలా 700 కోట్లు విడుదల చేస్తామని, యేడాదిలో అన్ని బిల్లులు క్లియర్ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, పెన్షనర్ల హక్కుల కోసం బీజేపీ ఉద్యమం కొనసాగిస్తున్నదని, అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడు తున్న బీజేపీకి ప్రజలంద రూ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, సర్వోత్తం రెడ్డి, చెన్నకేశవరెడ్డి, టిపిపియూఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి టి.పెంటయ్య, మాజీ అధ్యక్షులు హన్మంతరావు, బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి మరియు వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌కు సంతోష్ గూఢచారి

### జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 27, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపి సంతోష్‌రావు గూఢచారి అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కెసిఆర్ తినే ఇడ్లీలో ఎంత ఇడ్లీ తిన్నారనే సమా చారాన్ని గుంపు మేస్త్రి(సిఎం)కు చేరవేసే వ్యక్తి ఆయనేనన్నారు. నిమ్స్‌లో ఎక్స యిజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శిం చేందుకు వచ్చిన ఆమె పలు అంశాలపై మాట్లాడారు. ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసిందని సంతోష్ రావేనని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందో వేచి చూడాలన్నారు. మొదటి దెయ్యం సంతోష్‌రావేనని, అతనికి హరీశ్‌రావు, కెటిఆర్ ఎందుకు మద్దతు పలుకుతున్నారో అర్థంకావడం లేదని కవిత అన్నారు.

## ఎక్సైజ్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి

### కానిస్టేబుల్ సౌమ్యకు కవిత పరామర్శ



సౌమ్యను పరామర్శిస్తున్న కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 27, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న ఎక్సయిజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్యను తెలంగాణ జాగృతి అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవిత మంగళవారం పరామర్శించారు. నిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన ఆమె సౌమ్య ఆరోగ్యపరిస్థితిని అక్కడున్న వైద్యులను అడిగి తెలుసు కున్నారు. ఆమెకు మెరుగైన చికిత్సను అందించాలని సూచించారు. సౌమ్య కుటుంబ సభ్యులతోనూ మాట్లాడి వారిని ఓదార్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లా డుతూ.. ఎక్సయిజ్ కానిస్టేబుల్‌ను గంజాయి బ్యాచ్ చంపే ప్రయత్నం చేసిం దంటే ప్రభుత్వం అంటే వారికి భయంలేదని స్పష్టమవుతుందన్నారు. డ్రగ్స్, గంజాయిరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం హామినిచ్చిందని, కాని గ్రామాల్లోనూ గంజాయి, డ్రగ్స్ సులభంగా దొరికే పరిస్థితి వచ్చిందన్నారు. పాఠ శాలలు, కళాశాలల్లోకి గంజాయి తీసుకొచ్చి విద్యార్థుల జీవితాలను కొందరు నాశనం చేస్తున్నారన్నారు. వీటన్నింటిలో మహిళలే బాధితులుగా మారు తున్నారన్నారు. ఎక్సయిజ్, ఫారెస్ట్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలని, వాళ్లకు శిక్షణలో గన్ ఫైరింగ్ ఉంటుందని, కాని ఆయుధాలు ఇవ్వడం లేదన్నారు. ఎక్సయిజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్యపరిస్థితిపై నిమ్స్ వర్గాలు మంగళవారం హెల్త్ బులిటెన్‌ను విడుదల చేశాయి. ఆమె ఆరోగ్య పరిస్థితిలో స్వల్ప మెరు గుదల కనిపిస్తున్నప్పటికీ ఇంకా పరిస్థితి విషమంగానే ఉందన్నారు. వెంటిలేటర్ సాయంతో రికు(ఆర్ఐసీయూ) విభాగంలో చికిత్సనందిస్తున్నామన్నారు. కిడ్నీల పనితీరు దెబ్బతినడంతో సీఆర్ఆర్‌టీ ద్వారా డయాలసిస్ అందిస్తున్నామని, పొత్తికడుపులో రక్తస్రావం ఉన్నట్లు గుర్తించామన్నారు.

## ఫిబ్రవరి 10 నుంచి లాసెట్ దరఖాస్తుల స్వీకరణ

### 8న నోటిఫికేషన్ జారీ

### మే 18న పరీక్ష

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సుల్లో చేరడానికి నిర్వహించే లాసెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 10 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఎల్‌ఎల్‌ఎంలో చేరడానికి నిర్వహించే పీజీ లాసెట్-2026 దరఖాస్తులను కూడా ఫిబ్రవరి 10 నుంచే ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 8న జారీ చేయనున్నట్టు లాసెట్, పీజీ లాసెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్, పీజీ లాసెట్-2026 కమిటీ సమావేశం మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, లాసెట్, పీజీలాసెట్- 2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మీ పాల్గొన్నారు. సమావేశం అనంతరం లాసెట్, పీజీ లాసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 8న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 13 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు. మే 18న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, తిరిగి 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 3 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు 5 సంవత్సరాల లా కోర్సుతోపాటు, ఎల్‌ఎల్‌ఎంలో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు.

## గోపాల మిత్రుల వేతనాలు పెంచి రెగ్యులర్ చేయాలి




వేతనాలు పెంచాలని కోరుతూ చిన్నారెడ్డిని కలిసిన గోపాల మిత్రులు

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 27, ప్రభాతవార్త:** గోపాల మిత్రుల వేతనాలు రూ. 24 వేలకు పెంచి సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆ సంఘం ప్రతి నిధులు సిఎం ప్రజావాణిలో ప్రజావాణి ఇన్‌చార్జి డా. జి.చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. మండల పశువైద్య

### ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డికి విజ్ఞప్తి

అధికారి ఆధీనంలో విధు లు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, స్వయం ఉపాధి అనే పదాన్ని తొలగించాలని వారు కోరారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని వారికి చిన్నారెడ్డి హామీ ఇచ్చారు.

**ప్రజావాణికి అందిన దరఖాస్తులు 436**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళ వారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్ర మంలో మొత్తం 436 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి శాఖకు సంబంధించి 102 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 31 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 234 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 67 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్యప్రకాశ్, ఎసిపి ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## ఫ్రాన్స్‌లో తొలి హిందూ మందిర నిర్మాణం

### మహంత్‌స్వామి ఆశయాలకనుగుణంగా రూపకల్పన

### బిఏపిఎస్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం

**పారిస్, జనవరి 27:** ఫ్రాన్స్‌లో తొలి సంప్రదాయ హిందూ మందిర నిర్మాణానికి సంబంధించిన చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ హిందూ మందిరాల నిర్మాణంలో అనుభవం గల బోచాసన్‌వాసి అక్షర పురుషోత్తమ్ స్వామినారాయణ సంస్థ (బిఏపిఎస్), ఫ్రాన్స్‌లోని బస్సీ-సెయింట్-జార్జెస్‌లో తొలి సంప్రదాయ హిందూ మందిర నిర్మాణానికి చారిత్రక అడుగులు వేసింది. భారత్ నుంచి తీసుకువచ్చిన తొలి శిలలు ఈ మైలురాయి ఘట్టానికి సంకేతంగా నిలవడంతో, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో కీలక దశ ప్రారంభమైంది. భారతీయ సంప్రదాయ శిల్పకళ పద్ధతులు, తరతరాలుగా కొనసాగుతున్న నైపుణ్యంతో తయారైన ఈ శిలలను నిపుణులైన భారత శిల్పులు చేతితో సిద్ధం చేసి, తర్వాత ఫ్రాన్స్‌కు తరలించారు. ఫ్రాన్స్‌లో ఈ మందిర నిర్మాణంలో భారత శిల్పులు - ఫ్రెంచ్ స్టోన్ మేసన్లు కలిసి పనిచేయనున్నారు. వీరిలో నోట్రెడామ్ క్యాథెడ్రల్ పునరుద్ధరణ పనుల్లో పాల్గొన్న నిపుణులు కూడా ఉండటం విశేషం. భారతీయ సంప్రదాయ శిల్పకళ, ఫ్రాన్స్‌కు చెందిన ఆధునిక శిలా నైపుణ్యం కలయికగా ఈ మందిరం రూపుదిద్దుకోనుంది. ఈ కార్యక్రమం కేవలం శిలల రాకతోనే పరిమితం కాకుండా, రెండు దేశాల మధ్య సంస్కృతి, విలువలు, జ్ఞానం కలిసే వేదికగా నిలిచింది. ఈ మందిరాన్ని ప్రార్థన స్థలంగానే కాకుండా, సంస్కృతి, విద్య, సామాజిక కార్యకలాపాలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగుతోంది. ఈ ప్రతిష్టాత్మక మందిరాన్ని బోచాసన్‌వాసి అక్షర పురుషోత్తమ్ స్వామినారాయణ సంస్థ (బిఏపిఎస్) ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఓకె

### నిధుల విడుదలకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్

### సమీకరణ యత్నంలో ఆర్థిక శాఖ

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** ఎట్టకేలకు పాలమూరు-రంగారెడ్డి సాగు నీటి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ కూడా నిధులు సమకూర్చే పనిలో నిమగ్నమైంది. దశలవారీగా నిధులు విడుదల చేసి ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచే దిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా టన్నెల్ పనులు, విద్యుత్ సరఫరా, కాలువల విస్తరణ, భూసేకరణ వ్యయాల కారణంగా ఖర్చు పెరుగుతోంది. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా 12.3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం. ఇందుకు గాను ప్రధాన పనులను 21 ప్యాకేజీలుగా విభజించగా, ఇందులో లిఫ్టులు, రిజర్వాయర్లు, ప్రధాన కాలువ మార్గంలో వచ్చే సొరంగాలు ఉన్నాయి. మొత్తం పనులను 21 ప్యాకేజీలుగా విభజించినా, ఉద్ధండాపూర్ వరకు 18 ప్యాకేజీల పనులకు సాంకేతిక అనుమతి ఇచ్చి టెండర్లు ఖరారు చేసి పనులు చేపట్టారు. లిఫ్టుల్లో సగం వరకు మాత్రమే పంపులు, మోటార్లు అమర్చారు. మిగిలినవి ఇంకా అమర్చాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటివరకు రూ.32,067 కోట్లు ఖర్చు చేశారు.



## చివరి వరకూ పోరాడినా తప్పని ఓటమి

### మూడు పరుగుల తేడాతో గెలిచిన గుజరాత్ జెయింట్స్

**వదోదర, జనవరి 27:** మహిళల ప్రీమియర్‌లీగ్‌లో 17వ మ్యాచ్‌లో గుజరాత్‌జైంట్స్ మహిళా జట్టు ఢిల్లీకేపిటల్స్‌పైపోరులో చెలరేగి ఆడింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 174 పరుగులుచేసి ప్రత్యర్థి ఢిల్లీకేపిటల్స్‌కు 175 పరుగుల లక్ష్యం విధించింది. బెత్‌మూనీ 46 బంతుల్లో ఏడు ఫోర్లతో 58 పరుగులుచేసి అర్థ శతకంతో ఆకర్షించింది. అనుష్కశర్మ 39, తనుజ కన్వర్ 21, సోఫీ డివైన్ 13 పరుగులుచేసారు. ఢిల్లీ బౌలర్లలో శ్రీచరణి నాలుగు వికెట్లు, చినెల్లి హెన్రీ రెండు వికెట్లు, నందనిశర్మ మరిజేన్‌కాప్ మిన్నుమణి తలోవికెట్‌తీసారు. లక్ష్యఛేదనలో చివరికంటూ ఎడతెగని పోరు చేసిన ఢిల్లీకేపిటల్స్ కేవలం మూడు పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగాసాగిన ఈమ్యాచ్‌లో ఢిల్లీకేపిటల్స్ ఎనిమిది వికెట్ల నష్టానికి 171 పరుగులుచేసి కేవలం మూడే మూడు పరుగుల తేడాతో ఓటమి పాలయింది. మ్యాచ్‌లో నిక్కీ ప్రసాద్ 24 బంతుల్లో 47 పరుగులుచేసింది. తొమ్మిది ఫోర్లను కూడాసాధించి మ్యాచ్‌లో స్వతహాగా రాణించింది. మిన్నుమణి ఒకే ఒకనకపరుగుచేసి నిరాశపరిచింది.

## హైడ్రాను అభినందించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి27:** హైదరాబాద్ మహానగర ఆస్తులు,విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడటంలో హైడ్రా పోషిస్తున్న పాత్రపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా మంగళవారం అభినందనలు తెలిపారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు.. నగర సౌందర్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఆయువుపట్టు లైన చెరువుల రక్షణ, పునరుద్ధరణలో ప్రజా ప్రభుత్వం ఆలోచనలను హైడ్రా ఆచరణలో పెడుతోంది. ఆ క్రమంలో మీర్ ఆలం చెరువు పునరుద్ధరణ సందర్భంగా అక్కడ పని చేస్తున్న పలువురు ఇంజనీర్లు, కార్మికులు అనుకోని ఆపదలో చిక్కుకోగా.. రంగంలోకి దిగి, వారి ప్రాణాలను కాపాడిన హైడ్రా సిబ్బందికి నా ప్రత్యేక అభినందనలు అని పేర్కొన్నారు.

## సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ భార్యను మోసం చేసిన కేసులో నలుగురు నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** సిబిఐ మాజీ జెడి లక్ష్మీ నారాయణ భార్యను ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ పేరిట మోసం చేసి రూ.2.58 కోట్ల రూపాయలను కాజేసిన కేసులో నలుగురు సైబర్ నేరగాళ్లను సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ నలుగురు నేరగాళ్లు మ్యూల్ ఖాతా దారులుగా తేలింది. వీరు పశ్చిమ బిహార్, బెంగాల్‌కు చెందిన వారుగా తేలింది. మియన్మార్ కేంద్రంగా విదేశీ సైబర్ నేరగాళ్లు కొన సాగిస్తున్న బడా సైబర్ నేరాలకు వీరు సహకరిస్తున్నట్లు తేలింది. ఈ నలుగురిని ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తరలించి ఇక్కడ నాంపల్లి కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు. కాగా పట్టుబడ్డ నిందితుల బ్యాంకుల ఖాతాలలో వున్న 45 లక్షల రూపాయలను పోలీసులు జప్తు చేశారు. ఈ కేసులో మియన్మార్‌కు చెందిన అసలు నేరగాళ్ల కోసం ఆరా తీస్తున్నారు.

# భక్తులకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి

### మేడారం జాతర సందర్భంగా ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

### ఉన్నతాధికారులతో అమెరికా నుంచి ఫోన్‌లో మాట్లాడిన ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 27:** ఆత్మగౌరవానికి ప్రతీకలుగా కొలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభ మేళాగా పేరొందిన మేడారం మహా జాతరను వైభవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలతో నాలుగు రోజులపాటు జరిగే పండుగను వన దేవతల మహోత్సవంగా జరుపుకోవాలని అన్నారు. కోటిన్నరకుపైగా భక్తులు తరలివచ్చే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా ఘనంగా ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా మేడారం ఆలయాన్ని ప్రజా ప్రభుత్వం పునర్నిర్మించిందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. రూ.250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణతో పాటు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజు గద్దెలను విశాలంగా నిర్మించామన్నారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ఆధునీకరించి, ప్రాంగ ణానికి నలు దిశలా తోరణాలను నిర్మించినట్లు గుర్తు చేశారు. లక్షలాదిగా నిరంతరం మేడారం తరలివస్తున్న భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్లు, శాశ్వత మౌలిక వసతుల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రాధాన్య మిచ్చిందన్నారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షి ంచేందుకు, ఆదివాసీల ఆచారాలను పరిరక్షణను ప్రభుత్వం బాధ్యతగా స్వీకరించిందని అన్నారు. మేడారం తల్లుల స్ఫూర్తితో జరిపిన ప్రజాస్వామ్య పోరాటం ఫలితంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని వనదేవతల దీవెనలను గుర్తు చేసుకున్నారు.

రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి సారిగా తల్లుల చెంత ప్రజా ప్రభుత్వం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం నిర్వహించిందని అన్నారు. జనంకోసం ప్రాణాలైనా ఇవ్వాలనే సందేశం ఇచ్చిన మేడారం సమ్మక్క,సారలమ్మ తల్లుల స్ఫూర్తిగా రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుతామని అన్నారు. నాలుగు రోజుల పండుగను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కోటిన్నర మంది భక్తులు తరలివచ్చే అంచనాలు ఉండటంతో ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో పని చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అమెరికా నుంచి సీఎం ఫోన్ లో ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడారు. గిరిజనులు, ఆదివాసీలు, అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు అంతే భక్తి శ్రద్ధలతో వన దేవతలను దర్శనం చేసుకొని.. మొక్కులు చెల్లించుకోవాలని, జంపన్న వాగులో పుణ్య స్నానాలను ఆచరించాలని అన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుండా భక్తులు సహకరించాలని కోరారు.

## 3 దశల్లో వచ్చే యేడాది నుంచే ఇండో-ఇయు ఎఫ్టీయె అమలు

### లగ్జరీకార్లు, చాకొలేట్లు, విభిన్న రకాల ప్రీమియం మద్యం అన్నీ చౌకధరలకే

**న్యూఢిల్లీ, జనవరి 27:** భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య జరిగిన చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సుమారు 18 యేళ్ల సుదీర్ఘ చర్చల అనంతరం ఖరారయింది. ఈ ఒప్పందం వల్ల యూరప్ నుంచి దిగుమతి అయ్యే లగ్జరీ కార్లు, వైన్లు, పలు రకాల మద్యం, విభిన్న రకాల ఆహార పదార్థాలు, ఔషధాల ధరలు రాబోయే కొన్నేళ్లలో గణనీయంగా తగ్గనున్నాయి. భారీగా తగ్గనున్న లగ్జరీ కార్ల ధరలు ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లగ్జరీ కార్లపై దిగుమతి సుంకాల కోత. ప్రస్తుతం 110 శాతం వరకు ఉన్న దిగుమతి సుంకాన్ని ఏటా 2.5 లక్షల కార్ల కోటా పరిమితికి లోబడి, దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నారు. అయితే, ఈ ప్రయోజనం రిటైల్ ధర సుమారు రూ. 25 లక్షల కంటే ఎక్కువ ఉండే కార్లకు మాత్రమే వర్తిస్తుంది. దేశీయ ఆటోమొబైల్ తయారీదారులను రక్షించేందుకు, తక్కువ ధర కలిగిన కార్లను ఈ ఒప్పందం పరిధి నుంచి మినహాయించారు. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి, పోర్షే వంటి యూరప్ లగ్జరీ కార్ బ్రాండ్లకు ఈ ఒప్పందం ఎంతో ప్రయోజనకరం కానుంది. ఈ సుంకాల కోత సుమారు ఐదేళ్లలో దశలవారీగా అమలవు తుంది. కార్లతో పాటు మద్యం ప్రియులకు కూడా ఈ ఒప్పందం గుడ్‌న్యూస్ అందించింది. ప్రీమియం యూరోపియన్ వైన్లపై దిగుమతి సుంకాన్ని 150 శాతం నుంచి 20-30 శాతానికి తగ్గించనున్నారు. విస్కీ వంటి స్పిరిట్స్ పై సుంకాన్ని 40 శాతానికి, బీర్లపై సుంకాన్ని 50 శాతానికి పరిమితం చేయనున్నారు. వీటితో పాటు ఆలివ్ ఆయిల్, వంట నూనెలపై సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయనున్నారు. చాక్లెట్లు, బిస్కెట్లు, పాస్తా, బ్రెడ్ వంటి ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలపై ప్రస్తుతం ఉన్న 50-55 శాతం సుంకాన్ని పూర్తిగా తొలగించనున్నారు. దీంతో యూరప్ నుంచి వచ్చే అనేక ప్యాకేజ్డ్ ఫుడ్స్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి రానున్నాయి. ఆరోగ్య రంగంలోనూ ఈ ఒప్పందం సానుకూల ప్రభావం చూపనుంది. యూరప్ నుంచి దిగుమతి అయ్యే అనేక ఫార్మా ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న 11 సుంకాన్ని దాదాపుగా సున్నాకు తగ్గించనున్నారు. దీంతో పాటు, సుమారు 90 శాతం ఆప్టికల్, మెడికల్, సర్జికల్ పరికరాలపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయనున్నారు. ఇది దేశంలో వైద్య పరికరాల ధరలను తగ్గించి, ఆధునిక చికిత్సలను మరింత అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. ఇరు పక్షాల ఆమోద ప్రక్రియలు పూర్తయ్యాక 2027 నుంచి ఇది అమల్లోకి వస్తుందని భావిస్తున్నారు. అయితే, ఈ సుంకాల తగ్గింపు ఒక్కసారిగా కాకుండా 3, 5, 7 ఏళ్ల వ్యవధిలో దశలవారీగా జరుగుతుంది. అయితేదిగుమతి సుంకాలు తగ్గినా తుది రిటైల్ ధరలు జీఎస్టీ, రవాణా ఛార్జీలు, విదేశీ మారకపు రేట్లు, కంపెనీల ధరల నిర్ణయాలపై కూడా ఆధారపడి ఉంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.




## మళ్లీ మొదటికొచ్చిన 'జననాయగన్' వివాదం

**చెన్నై, జనవరి 27:** దళపతి విజయ్ హీరోగా నటించిన జన నాయగన్ సినిమాకు మద్రాస్ హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేయాలంటూ గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ ఇవాళ కొట్టివేసింది. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యం కావడం ఖాయంగా కనిపిస్తోంది. సెన్సార్ బోర్డు తన వాదనలు వినిపించడానికి (కౌంటర్ దాఖలు చేయడానికి) సింగిల్ జడ్జి తగిన సమయం ఇవ్వలేదని డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) నుంచి క్లియరెన్స్ వస్తేనే జన నాయగన్ థియేటర్లలో విడుదలకు వీలుంది. ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టులో ఈ కేసుపై తాజాగా విచారణ ప్రారంభం కానుంది. విజయ్ పూర్తిస్థాయి రాజకీయాల్లోకి రాకముందు నటించిన చివరి చిత్రంగా ప్రచారం జరుగుతున్న జన నాయగన్, సంక్రాంతి సందర్భంగా ఈ నెల 9న విడుదల కావాల్సి ఉంది. అయితే, ఓ ఫిర్యాదు ఆధారంగా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినట్లు సెన్సార్ బోర్డు నిర్మాతలకు తెలిపింది.

## ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి27:** తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువుశంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కనస్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత, మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్టు సంఘాలు**

రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమం, భద్రత, వృత్తి గౌరవాన్ని కాపాడేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల అక్రిడిటేషన్ అంశంపై అన్ని పాత్రికేయ సంఘాల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని గతంలో విడుదల చేసిన జీవోలో మార్పులు చేర్పులు చేసి కొత్త జీవోను జారీ చేశామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. మంగళవారం సచివాలయంలో పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## జూనియర్ డాక్టర్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

### ప్రభుత్వానికి జూ. డాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జూనియర్ డాక్టర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జుడా) డిమాండ్ చేసింది. ఈ మేరకు జుడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2025 జనవరి నుండి జూన్ వరకు జూనియర్ డాక్టర్లకు చెల్లించవలసిన బకాయిల విడుదలలో ఆలస్యం జరుగుతోందన్నారు.

బకాయిల విడుదలకు అవసరమైన అన్ని విధివిధానాలు పూర్తి చేసి, సంబంధిత బిల్లులు శాఖ స్థాయిలో ఆమోదం పొందినప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయని జుడాలు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో స్టైఫండ్లు, బకాయిల చెల్లింపులు నిలిచిపోయి, రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది. జూనియర్ డాక్టర్లు ప్రభుత్వ వైద్య సేవల వెన్నెముకవంటివారని, బోధనాస్పత్రుల్లో అత్యంత ఒత్తిడి, కఠిన పరిస్థితుల్లో నిరంతర వైద్య సేవలను అందిస్తున్నారని జుడాల నేతలు తెలిపారు. బకాయిల విడుదలలో దీర్ఘకాలిక ఆలస్యం కారణంగా ఆర్థిక స్థిరత్వం, మనోధైర్యం, సమగ్ర సంక్షేమంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. జూన్ నెల నుండి ఇప్పటికే అనేక సార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు ఫాలోఅప్‌లు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 బ్యాచ్‌కు చెందిన పీజీ డాక్టర్లు ఎండి పూర్తి చేసి ప్రస్తుతం సీనియర్ రెసిడెంట్లుగా పనిచేస్తున్న వారు, తమ చట్టబద్ధమైన పీజీ బకాయిలను కోల్పోయే ప్రమాదంలో ఉన్నారన్నారు.

2022 బ్యాచ్‌కు చెందిన పీజీ డాక్టర్లు, ఇటీవల ఎండి పూర్తి చేసి సీనియర్ రెసిడెన్సీలో చేరిన వారు కూడా, ఈ ఆలస్యం కొనసాగితే బకాయిల మూలంగా నష్టపోతారని తెలిపారు.

బకాయిలు చెల్లించకపోతే హౌస్ సర్జన్లు, సూపర్ స్పెషాలిటీ పీజీ డాక్టర్లు కూడా నష్టపోతారని తెలిపారు. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, పెండింగ్‌లో ఉన్న బిల్లులకు తక్షణ ఆమోదం తెలపాలని, జనవరి నుండి జూన్ 2025 వరకు ఉన్న అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జుడా కోరుతోంది.

సమయానికి బకాయిలు చెల్లింపులు జరగడం ద్వారా జూనియర్ డాక్టర్ల ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వారు ప్రజా వైద్య సంస్థల్లో అందిస్తున్న అంకితభావ సేవలకు సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. సమస్య త్వరగా పరిష్కారం కాకపోతే జూనియర్ డాక్టర్ల ప్రయోజనాల కోసం తగిన నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని జుడా నేతలు ప్రభుత్వానికి తెలిపారు.

## దొంగ పట్టాలు.. లక్షలు దోచుకున్నాడు

### రైతులను మోసగించిన కేసులో కంప్యూటర్ ఆపరేటర్ అరెస్ట్

### పెంచికల్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఘటన

**పెంచికల్ పేట్, జనవరి 27, ప్రభాతవార్త :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండల "తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి బాగోతం" అంటూ 2025 డిసెంబర్ 27 న ప్రచురితమైన వార్త కథనానికి నెల రోజులకి స్పందన లభించింది. పట్టా పాస్ పుస్తకాలు చేసి ఇస్తానంటూ రైతులను మోసం చేసిన కేసులో కార్యాలయంలో పని చేస్తు న్న కంప్యూటర్ ఆపరేటర్ పెద్దింటి రాకేష్ ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలిం చినట్లు పెంచికల్ పేట్ ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు మోసం జరిగిందంటూ గతంలో వెలువడిన కథనం సంచలనం సృష్టించగా, తాజాగా అదే అంశానికి బలమైన ఆధారాలతో కేసు వెలుగులోకి వచ్చింది. పెంచికల్ పేట్ తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న పెద్దింటి రాకేష్ పెంచికల్ పేట్ మండలానికి చెందిన సుమారు 38 మంది రైతుల నుంచి రూ 20 లక్షల వరకు వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఒక రైతు ఆన్లైన్ లో తన పట్టా వివరాలను పరిశీలించగా పత్రాలు నకిలీవని అనుమానం రావడంతో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. అక్కడ అసలు విషయం వెలుగులోకి రావడంతో తహసీల్దార్ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై అనిల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్-బిజెపి మధ్యే పోటీ

### ఢిల్లీలో ఎఐసిసి ముఖ్య నేతలను కలిసిన మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి27:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌బిజెపి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని, బిఆర్‌ఎస్ పని ఖతం అయ్యిందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాలపై ఏఐసిసి ముఖ్య నేతలతో చర్చించేందుకు సోమవారం ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం పార్టీ ముఖ్య నేతలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపి ఎన్ని పోరాటాలు చేసినా అధికారంలోకి రాలేదన్నారు. కర్నాటక, తెలంగాణలో బిజెపికి మనుగడ ఉండబోదని ఆయన తెలిపారు. బిఆర్‌ఎస్ పని కూడా అయిపోయిందని, రకరకాల కేసులతో ఆ పార్టీ నేతలు సతమతమవుతున్నారని అన్నారు. ప్రజలు ఆ పార్టీని ఆదరించే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోషల్ మీడియాను పట్టుకుని పాకులాడుతున్నారని ఆయన విమర్శించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను తమ పార్టీ సునాయసంగా కైవసం చేసుకుంటుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. బిసిలకు యాభైకి పైగా స్థానాల్లో టిక్కెట్లు ఇవ్వాలని వస్తున్న డిమాండ్ గురించి ప్రశ్నించగా, అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామని ఆయన తెలిపారు.

నైనీకోల్ కుంభకోణం గురించి ప్రశ్నించగా, ఇదంతా మీడియా సృష్టేనని ఆయన దాట వేశారు. తాను ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపినప్పుడు కూడా నైనీకోల్ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. నిజామాబాద్‌లో బిఆర్‌ఎస్ ఉనికి పూర్తిగా కోల్పోయిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో రెండు జిల్లాలు మినహా అన్ని జిల్లాలకు అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యిందని ఆయన చెప్పారు. అదేవిధంగా మహిళా అధ్యక్షురాలిని కూడా నియమించాల్సి ఉందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె. కవిత కొత్తగా పార్టీని స్థాపించి పోటీ చేసే ఆలోచనలో ఉందని అన్నారు. కాంగ్రెస్‌లో కవితను చేర్చుకుంటారా? అని విలేకరులు ప్రశ్నించగా, ఆ ఆలోచన తమకు లేదన్నారు. తనకు ఉన్న సమాచారం మేరకు కవిత పార్టీ స్థాపించబోతున్నారని అన్నారు.

## లాలాగూడ దోపిడీ కేసులో వీడిన మిస్టరీ..

### అంతర్రాష్ట్ర నేరగాళ్ల అరెస్టు, దోపిడీసొత్తు స్వాధీనం

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** లాలాగూడలోని అరిహంత్ సదన్ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 21న ఒంటరి మహిళపై గుర్తు తెలియ ని దుండగులు దాడిచేసి బంగారు నగలు దోచుకున్న ఘటనపై మిస్టరీ వీడింది, ఈ కేసులో ఇంతకు ముందు ఈ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేసిన వ్యక్తి సూత్రధారిగా తేలింది. ఎపిలోని పుట్టపర్తికి చెందిన ఇతను అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు సహచరులతో కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు తేలింది. ఈ కేసులో ముగ్గురు నేరగాళ్లను అరెస్టు చేయగా వారి వద్ద నుంచి దోపిడికి గురైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షితా మూర్తి మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన లాలాగూడ అరిహంత్ సదన్ 301 ప్లాట్‌లో ఒంటరి మహిళపై గుర్తు తెలియని దుండగులు దాడిచేసి నాలుగున్నర లక్షల రూపాయల బంగారు నగలను దోచుకోవడం తెలిసిందే. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేబట్టగా గతంలో ఈ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసి ఇక్కడి పరిస్థితులు మొత్తం తెలిసిన పుట్టపర్తికి చెందిన గుర్రప్పగారి మహేష్ (36)గా తేలింది. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన చిన్నకోట్ల ప్రవీణ్ కుమార్ (48), గేజు సురేంద్ర (37) సహకరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహేష్ 2021లో హైదరాబాద్‌కు వచ్చి ఈ అపార్ట్‌మె ంట్‌లో వాచ్‌మెన్‌గా చేరాడు. 2024 మే నెల వరకు అతను ఇక్కడ పనిచేశాడు. అయితే జల్సా గా తిరుగుతూ జులాయిగా వుండే మహేష్‌కు డబ్బు లు అవసరమవడంతో దొంగతనాలు, నేరాలు చేయసాగాడు. ఈ క్రమంలో కర్నాటకలో రెండు కిడ్నాప్‌లకు పాల్పడ్డాడు.

అక్కడి నుంచి హైదరాబాద్ కు మకాం మార్చి దోపిడీకి స్కెచ్ వేశాడు. ఇందులో భాగంగా మహేష్ ఈ నెల 21వ తేదీన ప్రవీణ్ కుమార్‌తో కలిసి ఒంటరి మహిళపై దాడిచేసి బంగారు నగలు దోచుకున్నాడు. ఈ సమయంలో సురేంద్ర సికింద్రాబాద్ స్టేషన్‌లో వున్నాడు. దోపిడి తరువాత మహేష్, ప్రవీణ్ కుమార్‌లు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ముగ్గురు కలిసి కర్నాటకు వెళ్లి చోరీ సొత్తును సమంగా పంచుకుని ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు. కాగా ఈ దోపిడీపై ఫిర్యాదు అందగానే రంగంలో దిగిన లాలాగూడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించి ఈ నేరానికి పాల్పడింది మహే ష్ అతని అనుచరులుగా తేల్చారు. అనంతరం వారిపై నిఘా వుంచగా మంగళవారం ఉదయం ముగ్గురు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఒకచోట వుండగా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి నాలుగున్నర లక్షల రూపాయల బంగారు నగలను జప్తు చేశారు. కాగా ఈ కేసులో నిందితుడుగా వున్న ప్రవీణ్ కు మార్‌పై కర్నాటకలో 2019లో ఓ హత్య కేసు వుంది. నిందితులను రిమాండుకు తరలించారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వార్‌రూమ్ ఛైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి

### పిసిసి ఓబిసి విభాగం ఛైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి27:** టిపిసిసి ఓబిసి విభాగం ఛైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విభాగానికి కన్వీనర్‌గా కీతూరి వెంకటేశ్, జూలూరు ధనలక్ష్మీలను నియమించారు. ఇదివరకే ఎస్సీ విభాగ ఛైర్మన్‌గా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఆదివాసీ విభాగ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లను ఎఐసిసి నియమించింది. తెలంగాణ కాంగ్రెస్ వార్ రూం ఛైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి నియమితులయ్యారు.

ఈ మేరకు మంగళవారం టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు ఇచ్చారు. గుత్తా అమిత్ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి రాజకీయ వ్యూహాలు, ఎప్పటికప్పుడు నేతలను సమన్వయ పరచడం. పార్టీకి సంబంధించిన విజయావకాశాలపై చర్చలు,నిర్ణయాలను తీసుకునేలా వ్యవహరిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. అమిత్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపిరేటీవ్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు కావడమ గమనార్హం.

## రేపు అమరావతి రైతులకు

# మలివిడత ప్లాట్ల కేటాయింపు

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఈ నెల 29న మలివిడత ప్లాట్ల కేటాయింపు జరుగనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఈలాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించనున్నారు. నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా ఈలాటరీ పద్ధతిలో ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే ముందుగా ఈ నెల 28న లాటరీ నిర్వహించాలని ప్రణాళిక ఉండగా దానిని సీఆర్డీఏ అధికారులు 29వ తేదీకి వాయిదా వేశారు.సీడ్ యాక్సెస్ రోడ్డు అమరావతి నగరానికి ముఖ్యమైన కనెక్టివిటీ ప్రాజెక్ట్. ఈ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇటీవల జనవరి 23న రైతులకు లాటరీ ద్వారా భూములు కేటాయించిన విషయం తెలిసిందే. గతంలో భూ సమీకరణ ఉన్న ప్రాంతాల్లో భూములు వచ్చిన రైతుల్లో కొందరు తమకు వేరే చోట భూములివ్వాలని కోరారు. దీంతో ఈలాటరీ ప్రక్రియను అనుసరించడంతో పలువురు రైతులు అభ్యంతరాలు తెలిపారు. అయితే వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్న సీఆర్డీఏ అధికారులు ఈనెల 29న మరోసారి పూర్తిస్థాయిలో ఈలాటరీ ద్వారా తుది విడతలో ప్లాట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

## పాదయాత్రకు మూడేళ్లు

# మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షల వెల్లువ

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:**యువగళం పాదయాత్ర ప్రారంభించి నేటికి మూడేళ్లు పూర్తైంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నేతలు. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయానికి చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్ర మూడేళ్ల సందర్భాన్ని గుర్తుచేస్తూ లోకేశ్‌తో కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. ఏపీ రాజకీయాల్లో యువగళం పాదయాత్ర గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆ పార్టీ నేతలు కొనియాడారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుల్లు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, సోమిరెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు, ఉగ్ర నరసింహారెడ్డి, గణబాబు, ఆదిరెడ్డి వాసు, ఎంఎస్ రాజు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, వేపాడ, గ్రీష్మ, కార్పొరేషన్ ఛైర్మన్లు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

**మహిళా మంత్రుల శుభాకాంక్షలు:** పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో లోకేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు మహిళా మంత్రులు అనిత, సవిత. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభం నాటి స్మృతులను నేతలు గుర్తుచేసుకున్నారు. నేడు ప్రజలు సంతోషంగా, ప్రశాంతంగా ఉండటానికి యువగళం పాదయాత్రది ప్రధాన పాత్ర అని మంత్రులు అన్నారు. ఎన్నో నిర్బంధాలు, ఆటంకాలను తట్టుకుంటూ, ప్రభుత్వ అవమానాలను భరిస్తూ.. ప్రజల కోసంనాడు లోకేశ్ పాదయాత్ర కొనసాగించారని తెలిపారు. నేడు తమకు పదవులు వచ్చాయంటే అందుకు కారణం కూడా యువగళం పాదయాత్రే అని మంత్రులు వెల్లడించారు.



## అనంతలో నేడు గణపతి సచ్చిదానంద స్వామీజీ పర్యటన

**అనంతపురం, జనవరి 27 ప్రభాతవార్త బ్యూరో:** మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారు. ఈనెల 28వ తేదీన బుధవారం ఉదయం అనంతపురం నగరంలోని దత్త మందిరంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించనున్నారని అనంతపురం దత్త మందిరం ట్రస్ట్ సభ్యులు నారాయణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30, 31 వ తారీకులలో బొమ్మపర్తి జయలక్ష్మిపురంలో దత్త క్రియా యోగా తరగతులను శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ నిర్వహిస్తారు. జిల్లాలోని దత్త భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అనంతపురం దత్త మందిరం ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ మెంబర్ నారాయణ శర్మ కోరారు.

# మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు

**విజయవాడ,జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ మాజీమంత్రి పేర్ని నానిపై కేసు నమోదైంది.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నానిపై 196(1), 353(2), 351(2), 352 తీవిలీ సెక్షన్ల కింద కేసు పెట్టారు. రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా చాట్రాయిలో జరిగిన వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పేర్ని నాని రెచ్చిపోయి మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై మండిపడిన టీడీపీ శ్రేణులు.. మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పీఎస్‌లో నానిపై ఫిర్యాదు చేయగా నానిపై కేసు నమోదు చేశారు.

## టిడిపి పార్లమెంట్ కమిటీల శిక్షణా తరగతులు

# సామాన్య కార్యకర్తలా ఎపి సిఎం చంద్రబాబు



మంగళవారం టీడీపీ పార్లమెంట్ కమిటీల శిక్షణా తరగతుల్లో కార్యకర్తల మధ్య సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** పదవి కన్నా పార్టీయే ముఖ్యమని తరచు సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానిస్తుంటారు.పార్టీ కార్యక్రమాల్లో అందరు సమానమని ఆయన పలు పర్యాయాలు స్పష్టీకరించారు. 4వ సారి ముఖ్యమంత్రి అయినా సామాన్య కార్యకర్తలానే సీఎం చంద్రబాబు పార్టీ శిక్షణ తరగతుల్లో పాల్గొని తన మాటలను కార్యచరణలో చూపారు.ఈ ఘటన సంచలనానికి,ఆదర్శనీయ విధానానికి దారి తీసింది. టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరుగుతున్న పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్ లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న గదుల్లోకి వెళ్లిన అధినేత చివరి సీట్లో కూర్చుని శిక్షణ తరగతులను అనుసరించారు. నూతనంగా ఎంపికైన పార్లమెంట్ అధ్యక్షులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నిర్వహించిన శిక్షణ తరగతికి చంద్రబాబు హాజరయ్యారు. నాయకులు చెప్పేది శ్రద్ధగా విని వర్క్‌షాప్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ రోజు ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న మంత్రి నారా లోకేశ్ ప్రతి గదిలోకి వెళ్లి వర్క్ షాప్‌లోని అన్ని బృందాల సభ్యులతో ముచ్చటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వర్క్ షాప్ లో సీఎంతో పాటు నారా లోకేశ్ పాల్గొన్నారు. నాలుగున్నర దశాబ్దాల పార్టీ ప్రయాణం, పార్టీ ఐడియాలజీ, క్యాడర్ మేనేజ్‌మెంట్, కార్యకర్తలకు ప్రాధాన్యం వంటి అంశాలపై వర్క్ షాప్ జరిగింది. కూటమి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్రణాళికలు, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి వంటి అంశాలపై జరిగిన వర్క్ షాప్ లో సీఎం పాల్గొన్నారు.ఒక్కో పార్లమెంట్ కమిటీలో 42 మంది సభ్యులు చొప్పున మొత్తం 25 పార్లమెంట్లకు కలిపి 1050 మంది వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. అయితే ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్న సీఎం పార్టీ విధానాలు, ఆలోచనలు, సిద్ధాంతాలపై నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ ఆలోచనలు వివరించారు. కార్యకర్తే అధినేత అనే పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి అంతా పని చేయాలని నాయకులకు సూచించారు. సామాన్య కార్యకర్తగా చంద్రబాబు ఒదిగిపోయిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని కార్యకర్తలు, నాయకులు అభిప్రాయపడ్డారు. ఇంకా ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు హాజరయ్యారు.

## మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి

# కూరలో విషం కలిపి ప్రాణాలు పోగొట్టుకున్నాడు

## అదే కూర తిని మృత్యువుతో పోరాడుతున్న ఐదుగురు చిన్నారులు

## చింతూరు మన్యంలో హృదయవిదారక ఘటన



పోసయ్య ఇల్లు, భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు.

**చింతూరు , జనవరి 27 ప్రభాతవార్త :**చింతూరు మన్యంలో జరిగిన ఒక హృదయ విదారక ఘటన చూపరులను సైతం కన్నీళ్ళు పెట్టించేలా ఉంది.చింతూరు మండలం ఇర్కంపేట(వలస ఆదివాసి గ్రామం) గ్రామానికి చెందిన మడకం పోసయ్య(45) అనే గిరిజనుడు మద్యం మత్తులో మతి స్థిమితం కోల్పోయి ఇంట్లో భార్య వండిన ఆనపకాయ కూరలో పిట్టల మందు కలిపి తాను తిని అస్వస్థతకు గురై ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు.మతి స్థిమితం లేని వ్యక్తి మద్యం మత్తులో చేసిన పొరపాటుతో ఆ కుటుంబం మొత్తం ఆసుపత్రిపాలు అయ్యింది. మడకం పోసయ్య చింతూరు మండలం ఇర్కంపేట గ్రామములో నివసిస్తున్నాడు.అతనికి ఆరుగురు సంతానం.అందులో ఐదుగురు ఆడపిల్లలే. సోమవారం ఉదయం పోసయ్య భార్య హడమమ్మ,పెద్ద కూతురు లక్ష్మి కూలీ పనులకు వెళ్తూ ఇంటి వద్ద ఆనపకాయ కూర,అన్నం వండి ఇంట్లో ఉంచి వెళ్లారు. మధ్యాహ్నం మద్యం మత్తులో కూరలో పిట్టల మందు కలిపి తిన్న సోమయ్య ఇంట్లో ఓ మూలన పడుకున్నాడు.సాయంత్రం కూలీ పనుల నుంచి వచ్చిన భార్య,కూతురు పోసయ్య పరిస్థితి గమనించి ఏడుగు రాళ్ళపల్లి ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ పోసయ్య మృతిచెందాడు.పోసయ్యకు ఏమైందో తెలియని ఆ కుటుంబంలోని ఐదుగురు చిన్నారులను ఇంటి వద్ద ఒంటరిగా వదలేక, పోసయ్యకు అక్క అయిన ముచ్చిక ఐతమ్మ,ఆమె కూతురు లక్ష్మిని ఇంటి వద్ద వదిలేసి వెళ్ళారు.రాత్రి కావటంతో పిల్లలు ఆకలి అనటంతో ఐతమ్మ అన్నం వండి ఇంట్లో ఉన్న కూరను పిల్లలకు పెట్టింది.తాను కూడా తిన్నది.కాని కూరలో విషం కలిపినట్టు ఆమె గుర్తించలేదు.అయితే పోసయ్య కుమారుడు వయస్సు రెండుసంవత్సరాలు అన్నం తినటానికి నిరాకరించాడు.దాంతో ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.అయితే రాత్రి కావటంతో ఎక్కడి వాళ్ళు అక్కడ పడుకున్నారు.పిల్లలు,ఐతమ్మ అందరికి వాంతులు, విరేచనాలు కావటంతో ఏదో జరిగింది అని ఊహించిన ఐతమ్మ చింతపండు రసం తీసి అందరికి తాగించింది. రాత్రి 10గం॥ ప్రాంతంలో మృతదేహంతో ఇంటికి చేరిన హడమమ్మ, ఆమె కూతురు,బంధువులు ఇంట్లో ఉన్న అందరు చిన్నారులు,ఐతమ్మ పరిస్థితి చూసి తల్లడిల్లి పోయారు.ఒక వైపు శవం,మరో వైపు ఆరుగురి పరిస్థితి విషమం.కారుచీకటి,కమ్యూనికేషన్ లేని గ్రామం .అలాగే తెల్లవారే వరకు గడిపి మంగళవారం ఉదయం ఏడుగు రాళ్ళపల్లి ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఐదుగురు చిన్నారులు, మృతుడి అక్క పరిస్థితి నిలకడగా ఉంది.విషయం తెలుసుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకోని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రి వద్ద మృతుడి భార్య,కుమార్తెతో పాటు బంధువులు,గ్రామస్తులు ఆసుపత్రి ముందు కూర్చోని అమాయకంగా చూస్తున్న దృశ్యం చూరులను సైతం కంట తడిపెట్టించేలా ఉంది.

# ఏడుకొండలస్వామిని చూడాలంటే ఎన్ని క్యూలైన్లో!

## ఆలయంలోనికి సులభ క్యూలైన్లు ఏవీ?



శిలాతోరణం ప్రాంతంలో వెలుపల క్యూలైన్లు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం యాజమాన్యం సామాన్యభక్తులకు ఏడుకొండల వెంకన్న దర్శనం,వసతి సదుపాయాలకు సాంకేతిక పరంగా విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నా ఆ దేవుని దగ్గరకు చేరుకునేందుకు క్యూలైన్లు మాత్రం ఎంతెంతదూరం అనేది భక్తులు అంచనావేయలేక పోతున్నారు. తిరుమలకు చేరుకున్న భక్తులు వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండితే భక్తులకు సర్వదర్శన కష్టాలు తప్పవు. ఒక్కో కంపార్టుమెంట్‌లో 350నుండి 400మంది వరకు భక్తులు నిరీక్షిస్తారు. ఇలా 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది.ఇక 60వేలమంది భక్తులు దాటితే వెలుపల శిలాతోరణం వరకు, ఆక్టోపస్ భవనం, గోగర్భమ్‌డ్యామ్ వరకు కూడా కిలోమీటర్ల దూరం క్యూలైన్లు వ్యాపిస్తాయి. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతంరోజుల్లో ఏకంగా 24 గంటలు సమయం నిరీక్షించాల్సి వస్తోంది.

**క్యూలైన్లు కుదింపుపై అధ్యయనం అవసరం:** తిరుమలేశుని దర్శనం కోసం టిటిడి అధికారులు రోజువారీగా ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలు, కాలినడక భక్తులకు ,సామాన్యభక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాట్ దర్శనాలు, సాధారణ సర్వదర్శనం దర్శనాలు అమలవుతున్నాయి. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులు నేరుగా తిరుమలకు వస్తే గతంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ వద్ద క్యూలైన్లలో నుండి భక్తులు ఆలయంలోనికి చేరుకునే విధానం ఉండేది. ఇప్పుడు సామాన్యభక్తులు ఈ దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. తిరుమలలో సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌ను అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు ముందుచూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రెండు విధానాల్లో టిక్కెట్లు ఉన్న భక్తులు నేరుగా ఈ కాంప్లెక్స్‌ల వద్దకు చేరుకుని ఆలయంలోనికి వెళ్ళేవారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శన టిక్కెట్లు భక్తులను ఎస్ఎంసి వద్ద క్యూలైన్లనుండి ఆలయానికి దగ్గర దారిని అమలుచేశారు. అయితే ఇప్పుడు ఈ విధానం అమలుకాకపోగా కిలోమీటర్లు బారులుతీరిన క్యూలైన్లు సామాన్యభక్తుల ఓపికను పరీక్షించేలా టిటిడి అధికారుల వ్యవహారం తయారైంది. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్‌లేని భక్తులను రద్దీని బట్టి లేపాక్షి కూడలి నుండి గానీ, పాత అన్నదానం కాంప్లెక్స్ క్యూలైన్ల నుండి భక్తులను అనుమతించే వారు. తిరుమలకు వచ్చిన టిటిడి ఇఒలు, జెఇఒలు తమదైన రీతిలో విధానాల్లో మార్పులు తీసుకుంటూ సామాన్యభక్తులకు దర్శనంలో చుక్కలు చూపిస్తున్నారు. సహనాన్ని పరీక్షిస్తూ ఏకంగా 24 గంటలుపైగానే దర్శనం సమయం నిరీక్షణ తప్పడంలేదు.

# ఎపిఎస్ఆర్టీసీలో 3,673 డ్రైవర్లు, 1,813 కండక్టర్ పోస్టులు భర్తీకి ప్రతిపాదన

## ప్రభుత్వాన్ని కోరిన ఆర్టీసీ బోర్డుసమావేశం

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరత సహా బస్సుల కొరత సమస్యలను అధిగమించేందుకు ఆర్టీసి బోర్డు సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ ఛైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ మీడియాకు అందించిన సమాచారం మేరకు సంస్థలో ఖాళీగా ఉన్న రెగ్యులర్ డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఖాళీగా ఉన్నటువంటి 7,673 రెగ్యులర్ పోస్టుల నియామకానికి అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆర్టీసీ పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. ఇందులో 3,673 డ్రైవర్ల పోస్టులు, 1,813 కండక్టర్ పోస్టులు భర్తీకి అనుమతించాలని ప్రభుత్వాన్ని బోర్డు కోరింది. ఆన్ కాల్ డ్రైవర్ల రోజువారీ వేతనాన్ని రూ. 800 నుంచి రూ.1000 వరకు పెంచాలని నిర్ణయించారు. డబుల్ డ్యూటీ చేసే కండక్టర్లకు ఇచ్చే మొత్తాన్ని రూ. 900కి పెంచింది. పనిష్మెంట్ కేసులతో సంబంధం లేకున్నా ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. కొనకళ్ళ వివరించిన మేరకు కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పుడు రూపొందుతున్నాయి. వాటి నిర్మాణాలన్నీ పూర్తయిన తర్వాత వీలయినంత త్వరగా ఇక్కడకు వస్తాయి. త్వరలోనే ఏపీకి 1,050 బస్సులు అందుబాటులోకి వచ్చి సేవలందిస్తాయి. ప్రస్తుతానికి ఆర్టీసీ సిబ్బందికి ఎటువంటి కొరత లేదు. అయితే ఆన్ కాల్ డ్రైవర్లను నియమించుకుని వారికి తగిన తర్ఫీదును అందించి డ్రైవింగ్‌లో నైపుణ్యాన్ని సాధించిన తర్వాతే వారిని పూర్తి స్థాయి డ్రైవర్ ఉద్యోగులుగా నియమించుకుంటాం. అయితే ఈ రోజున తాత్కాలిక సిబ్బంది కావాలనే ఆలోచన సైతం ఉంది.

**జరుగుతోన్న సంప్రదింపులు:** అందుకు అనుగుణంగానే దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం సబ్సిడీని ఇస్తుంది. ఇంతకు ముందుగానే 1,050 బస్సులను ఆర్డర్ ఇవ్వడం జరి గింది. అవి ఇప్పుడు వచ్చినట్లయితే ప్రస్తుతం ఉన్న ఇబ్బంది నుంచి తాత్కాలికంగా బయటపడతాం. ప్రస్తుతం ఆ బస్సుల కోసమే ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఢిల్లీ వెళ్లి వచ్చారు. ప్రస్తుతానికి కొత్త బస్సుల కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇవన్నీ సకాలంలో పూర్తయితే బస్సులు కొరతనేది తీరిపోతుంది.

# బాలికపట్ల అసభ్యప్రవర్తన: ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష

## 10,000 జరిమానా విధించిన న్యాయస్థానం

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నం లోని పాత రామన్నపేటకు చెందిన బాలిక ను 2017 వ సంవత్సరంలో ప్రైవేటు స్కూలు స్కూల్ నందు 10 తరగతి చదువుతుండగా అదే స్కూల్ నందు ఫిజిక్స్ మాస్టర్‌గా పనిచేయుచున్న వీరంకి నాగరాజు అను అతను ఎక్కువ మార్కులు తెప్పిస్తానని ప్రైవేటు క్లాసులు చెప్తానని ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా ఆమె ఇచ్చిన రిపోర్టుపై అప్పటి SI, K.V.S.R.K. కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరము ముద్దాయిని అరెస్టు చేసి తదనంతరం ఛార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. స్పెషల్ పీపీ మాదివాడ నరసింహారావు సాక్షులను విచారించిన పిదప పోక్సో కోర్టు జడ్జి అయినా బి వెంకటేశ్వర్లు ముద్దాయిపై నేరం రుజువైనందున ముద్దాయికి నిర్దేశిత చట్ట ప్రకారం రూ..10,000 జరిమానా, పెనాల్టీ కట్టని యెడల ఒక నెల రోజులు సాధారణ జైలు శిక్ష, పోక్సోయాక్ట్ ప్రకారము ఆరు నెలలు జైలు శిక్ష మరియు వెయ్యి రూపాయలు జరిమానా, జరిమాన కట్టని ఎడల నెల రోజులు సాధారణ జైలు శిక్ష, U/s.506 IPC ప్రకారము 5000 రూపాయలు జరిమానా జరిమాన కట్టని యెడల ఒక నెల రోజులు సాధారణ జైలు శిక్ష విధించినట్లుగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేందుకు సహకరించిన పిఎ ఏపీఎకి, సిబ్బందికి జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ అభినందనలు తెలియజేశారు.

# తిరుమల సమాచారం



## తెప్పపై పార్థసారథిస్వామి కటాక్షం

**తిరుపతి,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో రెండవరోజు మంగళవారం సాయంత్రం రుక్మిణీ సత్యభామసమేత పార్థసారథిస్వామి భక్తులను కటాక్షించారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు ముగించుకున్న అనంతరం ఉత్సవమూర్తులు పార్థసారథిస్వామి, అమ్మవార్లను పుష్కరిణిలోని తెప్పపైకి వేంచేపు చేయించారు. అక్కడ దేవేరులతో కలసి స్వామి సాయంత్రం 6.30గంటలకు తెప్పపై ఐదుచుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. భక్తులు గోవిందనామస్మరణలతో పులకించారు. అనంతరం ఉత్సవమూర్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భజనల, హరికథ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ తెప్పోత్సవంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.



## శ్రీమధ్వ విజయం పారాయణం

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** మధ్వనవమిని పురస్కరించుకుని టిటిడిదాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం తిరుమల ఆస్థానమండపంలో 140మంది పండితులు శ్రీమధ్వవిజయం పారాయణం చేశారు.భువనగిరి శ్రీరాఘవేంద్రస్వామి మఠం మఠాధిపతి సువిద్యేంద్రతీర్థ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. శ్రీమద్వాచార్యులు బోధించిన ద్వైత సిద్ధాంతం ద్వారా భక్తేమోక్షానికి మార్గమని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో దాససాహిత్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు, పండితులు పాల్గొన్నారు.



## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉం డాలని స్వామివారిని వేడుకున్నట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. మం గళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో సినీసంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సినీ నటుడు రాజీవ్‌కనకాల కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరు కు న్నారు.ఉదయం విఐపిబ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయఅధికారులు దర్శనంచేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# సమష్టిగా రథోత్సవం విజయవంతం

## 3.45 లక్షల మంది భక్తులు వాహనసేవల వీక్షణం

## 9.42 మందికి అన్నప్రసాదం

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా ఏడుకొండల వేంకటేశ్వం స్వామికి నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల తొమ్మిదిరోజుల సందర్భం కంటే, ఒకరోజు బ్రహ్మోత్సవం(రథసప్తమి,జనవరి 25) రోజు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆదేశాలు, టిటిడి పాలకమండలి సహకారం...వెరసి అనుభవజ్ఞులైన టిటిడి ,జిల్లాఉన్నతాధికారుల నిర్విరామ కృషి, సమన్వయం విజయవంతమైందని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అర్ధబ్రహ్మోత్సవాన ఏడువాహనసేవలవీక్షణకు 3.45లక్షలమంది భక్తులు మాఢవీధుల్లో విచ్చేశారన్నారు. ఒక్కరోజే 9.42లక్షలమంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం జరిగిందన్నారు. 6.30క్షలమందికి పానీయాలు, 2.90లక్షలమందికి పాలు, 2.15లక్షలమందికి తాగునీటి సీసాలు అందించగలిగామన్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవి, పిఆర్ఒ నీలిమతో కలసి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ఐక్యంగా మీడియాప్రతినిధులతో సమావేశమయ్యారు. టిటిడి సదుపాయాలపై భక్తుల నుండి విశేషస్థాయిలో ప్రశంసలు రావడం ప్రత్యేకత. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ,భక్తుల నుండి సేకరించిన అభిప్రాయాలు ,సలహాలు సూచనలతో మరింత మెరుగైన సేవలందించగలిగామని ఇఒ తెలిపారు. మాఢవీధుల్లో 220మంది శ్రీవారిసేవకులను వినియోగించామన్నారు. 1,800మంది పోలీసులు, 1200మంది విజిలెన్స్‌సిబ్బంది, 150మంది ట్రాఫిక్ పోలీసులు మెరుగైన సేవలందించారన్నారు. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో కూడా లేని విధంగా లగేజీకేంద్రంలో 3.65లక్షల గ్యాడ్జెట్లు,బ్యాగులు డిపాజిట్ చేశారన్నారు. తిరుపతి నుండి తిరుమలకు 1,932ట్రిప్పులు ఆర్టీసిబస్సులు నడిపి 60,425మంది భక్తులను తరలించగా, తిరుమల నుండి తిరుపతికి 1,942ట్రిప్పుల ద్వారా 82,241మంది భక్తులను చేరవేశారన్నారు. రథసప్తమిరోజు 23వేలమంది భక్తులకు వైద్యసేవలందించారని, 94మందిని అంబులెన్స్‌లద్వారా తిరుపతిలోని ఆస్పత్రులకు తరలించామన్నారు. రథసప్తమి వేడుకలను విజయవంతం చేయడంలో మీడియాసిబ్బంది పాత్ర అమూల్యమన్నారు. ఉదయం ఐదుగంటల నుండి రాత్రి 9గంటలవరకు తాను(టిటిడి ఇఒ), టిటిడి అదనపు ఇఒ,తిరుపతి జిల్లా ఎస్పీ ,సివిఎస్ఒ అధికారులు కలసి గ్యాలరీలను పరిశీలించడం, గ్యాలరీల్లో భక్తులతో మాట్లాడటం జరిగిందన్నారు. టిటిడి కల్పించిన సౌకర్యాలు,ఏర్పాట్లపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బ్రహ్మోత్సవాల కంటే రథసప్తమిన భక్తులకు కల్పించిన సౌకర్యాలతో ,3.45లక్షలమంది భక్తులకు సకలం సంతోషంగా చేయించడం పట్ల సిఎం చంద్రబాబునాయుడు అభినందనలు తెలియజేయడం తమకు మరింత బాధ్యతను గుర్తుచేసిందని అధికారులు ముక్తకంఠంతో తెలిపారు.



# గణిత శాస్త్రవేత్తకి అత్యున్నత గౌరవం..

**క్వాంటమ్ కంప్యూటింగ్... భవిష్యత్ సాంకేతికత... దీనికి గణితమే కీలకం అంటారు నళినీ జోషి, అంతర్జాతీయ గణిత శాస్త్రవేత్తగా పేరొందిన ఈమె తాజాగా 'ఎన్ఎస్ఈబ్ల్యూ(న్యూ సౌత్ వేల్స్) సైంటిస్ట్ ఆఫ్ ద ఇయర్(2025)'గా ఎంపికయ్యారు. ఓ గణిత శాస్త్రవేత్తకి ఈ అత్యున్నత గౌరవం దక్కడం ఇదే తొలిసారి.**

నళినీ జోషి.. భారత సంతతికి చెందిన ఆస్ట్రేలియన్. ప్రఖ్యాత అనువర్తిత గణిత శాస్త్రజ్ఞురాలు. సిడ్నీలో జరిగిన ప్రీమియర్స్ ప్రైజెస్ ఫర్ సైన్స్ వేడుకలో జోషి 'సైన్స్ ఆఫ్ ద ఇయర్' అనే ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. వాతావరణం నుంచి సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్ల వరకూ అన్ని రంగాల్లో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లను ఎదుర్కోవ డానికి గణితం ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. సిడ్నీ యూనివర్సిటీలో గణితశాస్త్ర ప్రొఫెసర్‌గానూ అప్లైడ్ మ్యాథమెటిక్స్ ఛైర్‌గా పనిచేస్తున్నారు జోషి... ఈ పదవిని అందుకున్న తొలి మహిళ కూడా. ఫైబర్ ఆప్టిక్స్, నాన్ లీనియర్ ఫిజిక్స్‌లను నిర్వచించే గణిత నమూనాలమీద పరిశోధన చేశారీమె. ఇంటిగ్రేబుల్ సిస్టమ్స్ లోనూ విశేష కృషి చేశారు. 'ఇరవయ్యేళ్ల క్రితం స్మార్ట్‌ఫోన్ లేదు. ఇప్పుడు కాఫీ చెల్లింపు నుంచి బ్యాంక్ బ్యాలెన్స్ తనిఖీ లరకూ అన్నీ 'అందులోనే. మరో ఇరవై ఏళ్లలో క్వాంటమ్ దబ్బుతో నిండిన పరికరాలతో తిరుగుతాం. అప్పుడు మనల్ని మనం రక్షించుకోవడానికి ఇప్పుడు జ్ఞానం సరిపోదు. అందుకే క్వాంటమ్ క్రిప్టోగ్రఫీకి ఉపయోగపడే గణిత పరిశోధనలమీద దృష్టిపెట్టా. దీనిని సురక్షితంగా ఉంచే శాస్త్రం. క్వాంటమ్ కంప్యూటింగ్ మున్ముందు డ్రగ్ డిజైన్, మెటీరియల్ సైన్స్ ఇలా ఎన్నో రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకురానుంది. అదేసమయంలో దీనివల్ల సైజ భద్రతా వ్యవస్థలకీ ముప్పు రావొచ్చు. దీన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు, పరిశ్రమలు సిద్ధంగా లేవు. కాబట్టి గణితశాస్త్ర పరిశోధకుల సంఖ్య పెరగాలి. వైద్యం, ఇంజినీరింగ్, పర్యావరణం ఏ శాస్త్ర పురోగతికైనా గణితమే ఆధారం అంటారు జోషి, ఎందరో యువ పరిశోధకులకు మార్గదర్శిగానూ నిలిచారు. ప్రతిగా ఆస్ట్రేలియాలో యూరేకా ప్రైజ్నాఅందుకున్నారు. ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ యూని యన్‌కి తొలి ఆస్ట్రేలియన్ వైస్ ప్రెసిడెంట్. లండన్ మ్యాథమెటికల్ సొసైటీలో గౌరవ సభ్యురాలు కూడా.

ఆస్ట్రోనాట్ కావాలనుకున్నా! జోషి తండ్రి మయన్మార్ సైన్యంలో వైద్యుడుగా పనిచేశారు. 70లో అక్కడ జరిగిన సామాజిక తిరుగుబాటుతో ఈమె కుటుంబం ఆస్ట్రేలియాకి వలసవెళ్లింది. చిన్నప్పుడు వన్యప్రాణుల మధ్యే స్వేచ్ఛగా గడిపేదాన్ని, పన్నెండేళ్ల వయసులో మా కుటుంబం ఈ దేశానికి వలస వచ్చినప్పుడు నాన్న దగ్గరున్నది నాలుగు డాలర్లే. బర్మాలో ఆయన పేషెంట్‌కు చెందిన కుటుంబసభ్యులే వాళ్లింటికి తీసుకెళ్లి, నాన్నకి ఉద్యోగం వచ్చేవరకూ ఆదరించారు. చిన్నప్పటి నుంచి లెక్కలకు 'సమాధానం రాబట్టడం ఆనందాన్ని ఇచ్చేది. నాకిష్టమైతే చాలా వేగంగా చేసేదాన్ని. అయితే అప్పట్లో నాకు అంతరిక్షమంటేనే ఆసక్తి. ఆస్ట్రోనాట్ కావాలనుకున్నా. అందుకే ముందు డిగ్రీలో ఫిజిక్స్‌నే తీసుకున్నా, కానీ నావల్ల కాదనిపించింది. గణితానికి మారిపోయా అంటారీమె. సిడ్నీ యూనివర్సిటీలో డిగ్రీలో టాపర్‌గా నిలిచి, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో డాక్టరేట్ పూర్తిచేశారు. తిరిగొచ్చాక గణిత శాస్త్ర ప్రొఫెసర్‌గా చేరి ఎన్నో పదవుల్నీ మరెన్నో పురస్కారాల్నీ అందుకున్న నళిని. గణితంలోకి రావాలనుకునే ఎందరో అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. □

## బరువు తగ్గించే బ్రాకలీ



శీతకాలం వచ్చిందంటే చాలు వెచ్చదనం కోసం కాఫీ, టీలు ఎక్కువగా తాగుతాం. మరి బరువు సంగతేంటి? వేళాపాళా లేకుండా ఎప్పుడంటే అప్పుడు తాగితే ఆరోగ్యానికి చేటు తయారు చేస్తారు. అందుకే ఈ సీజన్‌లో ఎక్కువగా దొరికే బ్రాకలీ రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు బరువు తగ్గుతుంది.

✦ బ్రాకలీలో కెలోరీలు తక్కువగా, పీచుపదార్థం ఎక్కువగా ఉండి ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగి స్తుంది. దీనివల్ల అనవసరంగా తినే చిరుతిళ్లకు అడ్డుకట్ట వేస్తుంది.

✦.విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి.

✦.ఇందులో గ్లూకోసినోలెట్లు, ఫినోలిక్ యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలో కొవ్వు, లిపిడ్లు పేరుకోకుండా చేస్తాయి. నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. దాంతో ఆహారం తక్కువగా తీసుకుంటారు.

✦.విటమిన్ ఎ, సి, కెలతోపాటూ కాల్షియం, పొటాషియం, ఐరన్ మెండుగా ఉండి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇందులోని పోషకాలు పోకుండా ఆవిరిమీద ఉడికించి నిమ్మరసం, వెల్లుల్లితో కలిపి తీసుకుంటే నోటికి రుచిగానూ, ఆరోగ్యంగానూ ఉంటుంది. □

## మేకప్ వేసుకోవడం ఓ కళ



కొంతమంది మేకప్ వేసుకోవడాన్ని ఓ కళా నైపుణ్యంగా భావిస్తున్నారు. ఇందులోనే ట్రెండ్‌ను కొత్త మేకప్ లుక్స్ కోసం ప్రయత్నించు.. తమలోని ప్రత్యేకతను చాటుకోవాలని ఆరాటపడుతుంటారు. ఇలా మేకప్ను తమలోని సృజనాత్మకతను చాటుకొనే అంశంగా పరిగణిస్తారు. ఈ వీడియోనే సోషల్ మీడియాలో తరచూ ఫొటోలు, వీడియోలు, టిప్స్ పోస్ట్ చేస్తూ మేకప్పై మీకున్న ఇష్టాన్ని చాటుకుంటారు.

✦ ఒక్కొక్కరికీ ఒక్కోలా రడీ అవడమంటే ఇష్టముంటుంది. ఈ లుక్ సందర్భానుసారం కొంతమంది సింప్లిసిటీని ఇష్టపడితే మరికొందరు మేకప్‌లో మెరిసిపోవాలనుకుంటారు. తమ ఆత్మవిశ్వాసాన్ని చాటుకుంటారు. ✦. తమ మనసుకు నచ్చిన పనిలోనే సంతోషాన్ని వెతుక్కుంటారు కొందరు. అలా మేకప్తో సంతోషాన్ని, సంతృప్తిని పొందే వారు కొందరుంటారు. ఇది వారికి ఓ థెరపీలా పనిచేస్తుంది. మనసుకు ప్రశాంతతను అందిస్తుంది. అందుకే ఎంత ఉన్నా మేకప్‌కి తగిన సమయమిస్తూ స్వీయ ప్రేమను పెంచుకుంటారు. ✦ మొటిమలు, కళ్ల కింద నల్లటి వలయాలు, చర్మ ఛాయ.. ఇలాంటి సౌందర్య లోపాల్ని సరిచేయడానికి మేకప్ అవుతుంది. ఇలా తమలోని అభద్రతను దూరం చేసుకొని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అంశుగా మేకప్ని ఇష్టపడే వారు మరికొందరు. ✦. మేకప్ మన బాహ్య సౌందర్యాన్ని రెట్టింపు చేస్తుంది వయసును తగ్గించి చూపిస్తుంది. అందుకే నవయవ్వనంగా, అందంగా కనిపంచాలన్న ఆరాటం ఉన్న వారు మేకప్‌ని ఇష్టపడుఏతున్నల్లు నిపుణులు చెబుతున్నారు. □

## గురువు త్రిమూర్తి స్వరూపం



దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవా లంటారు పెద్దలు. ఇందులో రెండు అర్థాలున్నాయి. చీకటి అలుముకుంటే కనిపించదు కనుక వెలుగు ఉన్నప్పుడే సరిచూసుకోవా లన్నది బాహ్యార్థం. పరిమితమైన జీవితకాలంలో వృథాకాలక్షేపం చేయకుండా పరమార్థం సాధించాలన్నది అంతరార్థం. గురువు అంటే కాపాడేవాడని అర్థం. అజ్ఞానం అనే అంధకారంలో దీపంలా మార్గదర్శనం చేసే గురువును జ్ఞానభాస్కరుడు అంటారు. సూర్యుడికి నమస్కరించినట్లే గురువుకు వందనాలు సమర్పించటం తక్షణ కర్తవ్యం. తల్లిదండ్రులు జన్మకు కారకులైతే.. గురువు పునర్జన్మ ప్రసాదించే వాడు. అజ్ఞానం అనే అంధకారం నుంచి ప్రకాశం దిశగా పయనించటం పునర్జన్మతో సమానమే మరి. ఇంకా చెప్పాలంటే.. గురువు త్రిమూర్తి స్వరూపం. బ్రహ్మ జన్మకు కారణం. విష్ణువు జీవన ప్రదాత. శివుడు లయకారుడు. గురుబ్రహ్మ విద్య అనే శరీరాన్ని ప్రసాదిస్తాడు. నూతన జీవితాన్ని కొనసాగించమని విష్ణువుల దారి చూపిస్తాడు. పరమేశ్వరుడై అజ్ఞానాన్ని రూపుమాపుతాడు. గురువు ఒకే తల ఉన్న బ్రహ్మ. రెండే చేతులున్న విష్ణువు. మూడో కన్ను లేని పరమశివుడు. సకల సంపదల్లోకీ జ్ఞానధనం అమూల్యమైంది. ఒక దీపంతో ఎన్నో దీపాలను వెలిగించవచ్చు. అలాంటి జ్ఞానజ్యోతి గురువు. అవిద్య నుంచి సత్య జ్ఞానానికి, చీకటి నుంచి వెలుతురుకు, మృత్యువు నుంచి అమృతత్వానికి పయనించాలని బృహదారణ్యక ఉపనిషత్తు చెబుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనల్ని సన్మార్గంలో నడిపి, గమ్యానికి చేర్చగల దైవం గురువు. కనిపించని పరదేవతల కన్నా వరమిచ్చే ప్రత్యక్ష దైవం గురువు, ఆయనను సేవిస్తే పరమాత్మను పూజించినట్లే శివపూజ మరిచినా, గురుపూజ మరవకూడదు. □

## ఫ్రెండ్ మాట్లాడట్లేదా..



స్నేహబంధం శాశ్వతమైనది.. అయితే కొన్ని సందర్భాల్లో ప్రాణ స్నేహితుల మధ్య గొడవలు జరగచ్చు.. ఆపై అవతలి వారి ప్రవర్తన, ప్రాధాన్యాల్లోనూ మార్పులు రావచ్చు. ఇలాంటప్పుడు వారిపై మనకు కోపం రావడంతో వారిని దూరం పెట్టడం.. కానీ ఈ సమయంలోనే సంయమనంతో వ్యవహరిస్తే ఇద్దరి మధ్య పెరగకుండా జాగ్రత్తపడవచ్చని నిపుణులు అంటున్నారు. ప్రతి ఒక్కరిలోనూ మార్పు సహజం. అలాగే మన ప్రాణ స్నేహితుల ప్రవర్తనలోనూ అప్పుడప్పుడూ పలు మార్పులు కనిపిస్తుంటాయి. అయితే అవి ఎలాంటి మార్పులో ముందు గమనించాల్సి ఉంటుంది. అంటే ఎప్పటిలా మీతో మాట్లాడకపోవడం, కావాలని మిమ్మల్ని దూరం పెట్టడం, మీరు కాల్ చేసినా కట్ చేయడం. మెసేజ్ చేసిన రిప్లై లేకపోవడం మీ కోపతాపాల్ని పక్కన పెట్టి.. మీ పట్ల తను అలా ప్రవర్తించడానికి కారణమేంటో తెలుసుకునే ప్రయత్నం చేయండి. మీకు తెలియకుండా ఏదైనా పొరపాటు చేశారా? లేదంటే మీ స్నేహాన్ని జీర్ణించుకోలేని మూడో వ్యక్తి మీపై లేనిపోనివి కల్పించి చెప్పారా? అదీ కాదంటే తనే కావాలని అలా చేస్తోందా? అన్నీ వారితో కూర్చొని మాట్లాడితేనే ఓ కొలిక్కి వస్తాయి. ఇక అసలు కారణం తెలిశాక.. పొరపాటు ఎవరిదైతే వారు క్షమాపణ కోరితే సమస్య సద్దుమణుగుతుంది.. స్నేహబంధం తిరిగి పరిమళిస్తుంది. □

## చెరకు మురుకులు



**కావలసినవి :** చెరకు రసం – అర కప్పు బియ్య ప్పిండి కప్పు వెన్న రెండు టేబుల్స్పూన్లు (కరిగించుకోవాలి) .. నువ్వులు టీస్పూన్ ఉప్పు టీస్పూన్ డీప్ ఫ్రైకి నూనె సరిపడ. **తయారు చేసే విధానం:** ఒక గిన్నెలో బియ్యప్పిండి, వెన్న, నువ్వులు, ఉప్పు వేసి కలుపుకోవాలి. ఆపై ఇందులో చెరుకు రసాన్ని కొద్దికొద్దిగా పోసుకుంటూ, చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు స్టౌ పై బాండీ పెట్టి అందులో డీప్ ఫ్రైకి సరిపడా నూనె పోసి వేడి చేసుకోవాలి. ఇందాక తయారుచేసుకున్న పిండి మిశ్రమాన్ని మురుకుల ప్రెస్‌బర్స్‌లో చేసుకొని నూనెలో ఒత్తుకోవాలి. వీటిని డీప్ ఫ్రై చేసుకుంటే ఎంతో టేస్టీగా ఉండే చెరకు మురుకులు రడీ అయినట్లే . □

## పుస్తక పఠనమే బిబ్లియో థెరపీ



ఇటీవల యంగ్లోవ్స్ ఇండియా చేసిన అధ్యయనంలో... ఒత్తిడికి గురైన వారిలో మహిళలూ, అమ్మాయి ల సంఖ్య ఎక్కువగా వెల్లడైంది. ఈ సమస్యతో సతమతం అవుతూ నిద్ర పట్టని వారూ ఎక్కువేనట. దీన్నుంచి బయటపడాలని ప్రయాణాలు, తోటల పెంపకం, చిత్రలేఖనం... వంటి హాబీలను అలవరచుకుంటున్నారు కదా! వీటితోపాటూ 'బిబ్లియో థెరపీ'ని ప్రయత్నించ మంటున్నారు నిపుణులు. పుస్తక పఠనాన్నే బిబ్లియో థెరపీ అంటారు. అయితే మానసిక సమస్యలతో బాధపడుతున్న వాళ్లకి వాళ్లున్న దశ. సమస్యకు సంబంధించిన పుస్తకాన్ని, క్యారెక్టర్‌ని చదవాల్సిందిగా సిఫార్సు చేస్తారు. దీనివల్ల, ఒత్తిడి 68 శాతం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. బాగా ఒత్తిడిలో ఉన్నప్పుడు నడవడం, సంగీతం వినడం జరుగుతుంది కదా. వీటన్నింటి కన్నా ఇలాంటి ఓ పుస్తకం చదవడం మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందట. మనసుకు విశ్రాంతి లభించి, నిద్రకు సహకరిస్తుందనీ చెబుతున్న అధ్యయనాలు. □

# తెర

## 'దేవగుడి' ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది



'దేవగుడి" సినిమా నటుడిగా నాకు మంచి పేరు తీసుకొస్తుందని నమ్ముతున్నాను యాక్టర్, మ్యూజిక్ డైరెక్టర్ రఘు కుంచె..పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధారెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా దర్శకత్వంలో స్వీయ నిర్మాతగా aa ASsase Were lo aa fwd q రూపొందిన చిత్రం 'దేవగుడి'. ఈ సినిమాలో ఈ అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. 'దేవగుడి' సినిమా ఈ నెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణా రెడ్డి, నటుడు రఘు కుంచె.దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నేను ఉద్యోగం చేస్తున్న టైమ్ లో భగవద్గీత ఆధారంగా యధాతథం అనే కాన్సెప్ట్ ఓ మతగ్రంథం అనుకుంటారు గానీ అది సైంటిఫిక్ గా నిజమని ఐన్ స్టీన్, అబ్దుల్ కలాం గారు చెప్పారు. ఆ కాన్సెప్ట్ తో మూవీ నిర్మించాలని శ్రీకాంత్ గారిని హీరోగా పెట్టి ప్రొడ్యూస్ చేశాం. ఆ టైమ్‌లో శ్రీకాంత్ గారు సినిమాలో నా ఇన్వాల్వ్ మెంట్ చూసి మీలో దర్శకుడు కూడా ఉన్నారు. మీరే డెరెక్ట్ చేయొచ్చు కదా అని ఎంకరేజ్ చేశారు. ఆ మూవీ తర్వాత దృశ్యకావ్యం సినిమాను నా దర్శకత్వంలో తెరకెక్కించాను. ఇప్పుడు "దేవగుడి" సినిమా రూపొందించాను. ఇది దర్శకుడిగా నా రెండో మూవీసినిమా ఇండస్ట్రీలో కొత్త వాళ్లను ఎలా యూజ్ చేసుకుంటారో మీకు తెలుసు. గత చిత్రాల విషయంలో నాకు ఎదురైన అనుభవాల దృష్ట్యా ఈ సినిమాను జాగ్రత్తగా రూపొందించాను. నేను ఇంజినీర్ ను కాబట్టి పక్కా ప్లానింగ్ తో అనుకున్న టైమ్ లోనే షూటింగ్ కంప్లీట్ చేశాం. జస్ట్ ఓ 10 పర్సెంట్ బడ్జెట్ మేము అనుకున్న దానికంటే ఎక్కువైంది.ఉంది.

## శరవేగంగా 'ఉస్తాద్ భగత్ సింగ్'



శుభ ముహూర్తంలో డబ్బింగ్ పనులు ప్రారంభండబ్బింగ్ కార్యక్రమాలలో పాల్గొననున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం కీలకమైన పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. శుభ ముహూర్తంలో డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయి. తన శక్తివంతమైన రచన, మాస్ మెచ్చే సంభాషణలకు పేరుగాంచిన హరీష్ శంకర్ ను అభిమానులు ముద్దుగా 'కల్ట్ కెప్టెన్' అని పిలుస్తారు. ఆ పేరుకి తగ్గట్టుగానే 'ఉస్తాద్ భగత్ సింగ్'ను కల్ట్ చిత్రంగా మలచడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను దర్శకుడు హరీష్ శంకర్ వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు. సినిమా అనుభూతిని మరో స్థాయికి తీసుకెళ్లేలా.. ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించే, ప్రేక్షకుల చేత ఈలలు వేయించే సంభాషణలకు ఈ చిత్రం హామీ ఇస్తుంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ త్వరలో డబ్బింగ్ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఇది అభిమానులలో, సినీ ప్రేమికులలో మరింత ఉత్సాహాన్ని పెంచుతుంది. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్‌కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఎక్కడా రాజీ పడకుండా ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## 'రణబాలి' టైటిల్ గ్లింప్స్ రిలీజ్
## సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న క్రేజీ మూవీకి 'రణబాలి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ గ్లింప్స్ విడుదలతో పాటు సినిమా రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేశారు. ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.ఈ సినిమా గ్లింప్స్ లో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించిన తీరు ఆకట్టుకుంటోంది. తన మాతృభూమి కోసం ప్రాణాలు ఒడ్డి పోరాడే రణబాలి పాత్రలో విజయ్ ఒదిగిపోయారు. హీరోయిన్ రశ్మిక మందన్న జయమ్మగా కనిపించింది. ప్రతినాయకుడు సర్ థియోడోర్ హెక్టార్ పాత్రలో 'మమ్మీ' సినిమా ఫేమ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ నటించారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా "రణబాలి" సినిమా రూపొందుతోంది. 'డియర్ కామ్రేడ్, 'ఖుషి' వంటి సక్సెస్ ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ కలిసి చేస్తున్న మూడో చిత్రమిది.

## 'డేవిడ్ రెడ్డి' ఫస్ట్ లుక్ పోస్టర్స్ రిలీజ్



రాకింగ్ స్టార్ మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్ తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా "డేవిడ్ రెడ్డి" సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో మారియా ర్యబోషప్క హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ రోజు రిపబ్లిక్ డే సందర్భంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్ లాంఛ్ చేశారు.'డేవిడ్ రెడ్డి' ఫస్ట్ లుక్ పోస్టర్స్‌లో రూత్ లెస్, బ్రూటల్ అనే రెండు లుక్స్‌లో మంచు మనోజ్ ఇంటెన్స్‌గా కనిపించి 1897 నుంచి 1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలాన్ని నేపథ్యంగా తీసుకుని 'డేవిడ్ రెడ్డి' సినిమాను ప్రతిష్ఠాత్మకంగా మేకర్స్ రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో బ్రిటీష్ క్రూర పాలనకు ఎదురు నిలిచి పోరాడిన యోధుడి పాత్రలో మనోజ్ నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి త్వరలో మరిన్ని అప్డేట్స్ ఇవ్వబోతున్నారు.

## CAT ఫస్ట్ లుక్ లాంచ్ చేసిన బుచ్చిబాబు



CAT ఫస్ట్ లుక్ VRGR మూవీస్ బ్యానర్ పై Y. గంగాధర్ IPS సమర్పణ లో, రజని గొంగటి నిర్మాతగా నూతన దర్శకుడు బి.జు. నాయుడు దర్శకత్వం వహించిన చిత్రం CAT... ఫస్ట్ కాపీ రెడీ చేసుకుని త్వరలో రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ని ప్రముఖ దర్శకులు బుచ్చిబాబు సోమవారం హైదరాబాద్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు మాట్లాడుతూ.. ఇప్పుడే CATమూవీ పోస్టర్ లాంచ్ చేసాము, దర్శకుడు కమ్ యాక్టర్ జి.వీ నాయుడు నాకు ఎప్పటినుంచో తెలుసు, CAT స్టోరీ కూడా చెప్పారు. వినూత్నంగా చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఈ సినిమా పెద్దహిట్ అవ్వాలని అందరికి పేరు తీసుకురావాలని, త్వరలో విడుదలకు సిద్దమైన ఈ సినిమాని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను. దర్శక, నిర్మాతలకు, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు బెస్ట్ ఆఫ్ లక్ చెప్పి దితిగి చిత్ర విజయం పొందాలని బుచ్చి బాబు ఆకాంక్షించారు. డ్రామా, థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో జి.వి.నాయుడు , వి.జె.. బాలు, లావణ్య, కళ్యాణి రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి ఫోటోగ్రఫీ : పంకజ్ తొట్టాడ ఎడిటింగ్ : డి.వెంకటప్రభు మ్యూజిక్ : మారుతి రాజా కథ, స్క్రీన్ ప్లే, మాటలు : విసిహెచ్. శేఖర్ ముద్దు దర్శకత్వం : జివి.నాయుడు (గొంగటి వీరాంజనేయులు)

## 'సోల్ ట్రిప్' హోస్ట్‌గా విజయ్ దాట్ల



రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్ సమర్పణలో స్టార్ హీరోలతో ఓ ట్రావెల్ బేస్డ్ అడ్వెంచరస్ టాక్ షో ప్రారంభం కానుంది.. అదే 'సోల్ ట్రిప్' ఈ అడ్వెంచరస్ టాక్ షోలో మన టాలీవుడ్ స్టార్ హీరోస్‌తో ఈ టాక్ షో ప్రేక్షకులను అలరించ నుంది. ఇది వరకు పోస్టర్, అన్వేషి వంటి సినిమాలు చేసిన హీరో, నిర్మాత విజయ్ దాట్ల తన సొంత బ్యానర్ గండభేరుండ ఆర్ట్స్‌పై ఈ సెలబ్రిటీ టాక్‌షో సీజన్1ను ముగించుకుని, త్వరలోనే ప్రముఖ ఓటీటీ ఛానెల్‌లో రిలీజ్ చేయబోతున్నారు. గణతంత్య దినోత్సవం సందర్భంగా సోల్ ట్రిప్ టాక్ షో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మొదటి సీజన్‌లో హీరో జగపతి బాబు, శ్రీకాంత్, స్టార్ కమెడియన్ అలీ, హీరోయిన్స్ శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్, వర్ష బొల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌కు అల్కరాజ్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్-2026లో డి మినార్‌ను ఓడించి కార్లోస్ అల్కరాజ్ తొలిసారిగా విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు రాడ్ లావర్ అరీనాలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో స్పానిష్ ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు, తన హోమ్ హోప్ అలెక్స్ డి మినార్‌ను 7-5, 6-2, 6-1 తేడాతో ఓడించాడు. 22 ఏళ్ల టాప్ సీడ్ అల్కరాజ్ ఆస్ట్రేలియన్ ఆరో సీడ్ తో పోటీలో దూసుకుపోయాడు. అతను అన్ని గ్రాండ్ స్లామ్ లలో చివరి ఎనిమిది స్థానాలకు చేరుకున్నాడు. తొలి సెట్‌లో ఆరుసార్లు మేజర్ ఛాంపియన్ అయిన అల్కరాజ్ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ డి మినౌర్ వరుసగా మూడు ఆటలను 3-3తో ముగించాడు. అయితే వ్యూహాత్మకంగా ఆడిన అల్కరాజ్ 5-3 ఆధిక్యాన్ని సాధించినా, ఆ తర్వాత సెట్‌ను ముగించే అవకాశాన్ని వృధా చేసుకుని విఫలమయ్యాడు. తరువాతి రెండు గేమ్‌లను గెలిచి సెట్‌ను కైవసం చేసుకోవడానికి అల్కరాజ్ తీవ్రతను పెంచినప్పుడు 5-5తో సమంగా ఉన్నారు. డి మినౌర్ తన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడంతో అల్కరాజ్ 44 నిమిషాల్లో రెండవ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. అదే ఊపుతో మూడో సెట్‌లో అతను 20 నిమిషాల కంటే తక్కువ సమయంలోనే 3-0 ఆధిక్యాన్ని సాధించి, తన ఐదవ ఏస్‌తో ఆధిక్యాన్ని సాధించాడు. అంతకుముందు జర్మన్ మూడో సీడ్ జ్వెరెవ్ అమెరికాకు చెందిన లెర్నర్ టియెన్‌పై 6-3, 6-7 (5/7), 6-1, 7-6 (7/3) తేడాతో 24 ఏస్‌లు సంధించి తన చివరి నాలుగు స్థానాన్ని బుక్ చేసుకున్నాడు.



# వరల్డ్ టెన్నిస్ జూ. సింగిల్స్‌లో సృష్టికి టైటిల్

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్స్ టోర్నమెంట్‌లో కమాండింగ్, అద్భుతమైన ప్రదర్శనతో భారత్ టెన్నిస్ స్టార్ సృష్టి కిరణ్ వరుసగా నాలుగో ఐటిఎఫ్ జూనియర్ సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. మెక్సికోలో జరిగిన ఈ ఫైనల్స్‌లో సృష్టి కెనడాకు చెందిన నటాలీ సత్సలాష్విలిపై 6-4, 6-1 తేడాతో వరుస సెట్లలో గెలిచింది. అంతకు ముందు సెమీఫైనల్లో 21 సింగిల్స్ మ్యాచ్‌ల విజయాలు సాధించిన యుఎస్‌ఎకు చెందిన నటాలియా ఎలెనా మార్టినెజ్‌తో జరిగిన మ్యాచ్‌లో సృష్టి రెండవ సెట్‌ను కోల్పోయిన తర్వాత పుంజుకుని 7-5, 1-6, 7-5 తేడాతో విజయం సాధించింది. అలాగే డబుల్స్‌లో సృష్టి మెక్సికోకు చెందిన తమరా హెర్మన్‌తో కలిసి టాప్ సీడ్ జోడీగా నిలిచి రన్నరప్‌గా నిలిచింది. ఈ జంట అమెరికా జంట క్రిస్టినా లి-నటాలియా ఎలెనా మార్టినెజ్ చేతిలో 2-6, 6-4, 6-10 తేడాతో మ్యాచ్ టైబ్రేక్‌లో ఓడిపోయి ఆల్ రౌండ్ వారాన్ని ముగించింది.



# రంజీ ట్రోఫీ: ఛాంపియన్‌గా బీహార్

## 568 భారీ రన్స్ తేడాతో మణిపూర్

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ 2025-26 ఫైనల్లో బీహార్ జట్టు మణిపూర్‌ను 568 పరుగుల భారీ తేడాతో ఓడించి, టైటిల్‌ను గెలుచుకుని ఛాంపియన్‌గా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 522 పరుగుల భారీ స్కోరు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ బిపిన్ సౌరభ్ 143 పరుగులు సాధించగా, కెప్టెన్ సకిబుల్ గని 108 పరుగులు చేశాడు. సూరజ్ కశ్యప్ కూడా 83 పరుగులు చేసి బీహార్ భారీ స్కోరు సాధించడంలో సహాయపడ్డాడు. మణిపూర్ బౌలర్లలో రెక్స్ రాజ్ కుమార్ 4 వికెట్లతో రాణించగా, ఫిరోయిజామ్ జోతిన్, బిశ్వోర్జిత్ కొంథౌజామ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. తదుపరి 523 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మణిపూర్ తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగులకు ఆలౌట్ అయింది. రోనాల్డ్ లాంగ్‌జామ్ 79 పరుగులతో అత్యధిక స్కోరు సాధించాడు. కానీ మిగిలిన బ్యాటింగ్ లైనప్ నుండి అతనికి మద్దతు లభించలేదు. సూరజ్ కశ్యప్ 3/34తో ముగించగా, ప్రశాంత్ సింగ్ మరియు హిమాన్షు సింగ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగుల ఆధిక్యంతో, బీహార్ రెండో ఇన్నింగ్స్‌లో పోటీపై పట్టు బిగించింది. ఓపెనర్ పియూష్ సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు, 322 బంతుల్లో 216 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు, ఇన్నింగ్స్‌ను ఆకట్టుకున్నాడు. రఘువేంద్ర ప్రతాప్ సింగ్ 90 పరుగులు చేయగా, ఖలీద్ ఆలం 81 పరుగులు జోడించి అతనికి మంచి మద్దతు ఇచ్చాడు. బీహార్ తన రెండో ఇన్నింగ్స్‌ను ఆరు వికెట్లకు 505 పరుగుల వద్ద డిక్లేర్ చేయడంతో మణిపూర్‌కు 764 పరుగుల కష్టతరమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ స్కోరును ఛేదించే క్రమంలో మణిపూర్ రెండో ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌట్ అయింది. ఫిరోయిజామ్ జోతిన్ 74 పరుగులతో పోరాట పటిమను ప్రదర్శించగా, ఎల్. కిషన్ సింఘా 30 పరుగులు చేశాడు. అయితే, సూరజ్ కశ్యప్ 32 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టడంతో బీహార్ బౌలర్లు మరోసారి మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించారు. హిమాన్షు సింగ్ కూడా మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు, మణిపూర్ 57 ఓవర్లలోనే కుప్పకూలింది. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో బీహార్ మంచి ప్రదర్శన చేసింది, ప్లేట్ గ్రూప్ ఫైనల్‌లో మణిపూర్‌ను ఓడించి ఎలైట్ గ్రూప్‌కి పదోన్నతి పొందింది.




# పంజాబ్ విజయం

## ప్రో రెజ్లింగ్ లీగ్‌లో 5-4 తేడాతో మహారాష్ట్ర ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026లో మహారాష్ట్ర కేసరిపై పంజాబ్ రాయల్స్ కీలక విజయాన్ని నమోదు చేసింది. ప్రో రెజ్లింగ్ లీగ్ 2026 మ్యాచ్ 12లో పంజాబ్ రాయల్స్‌పై 4-5 తేడాతో మహారాష్ట్ర గెలుపొందింది. పంజాబ్ తొలి అర్ధభాగంలో ఆధిపత్యం చెలాయించడంతో 4-1 ఆధిక్యంలోకి వెళ్లిన తర్వాత మహారాష్ట్ర 6, 7 బౌట్స్‌లో బలమైన పోరాట పటిమను ప్రదర్శించి పోటీని సజీవంగా ఉంచింది. ఈ ఫలితంతో మహారాష్ట్ర 4 మ్యాచ్‌ల్లో 3 విజయాలతో, ఆరు పాయింట్లు, 23 బౌట్‌లతో ప్రచారాన్ని ముగించింది. పంజాబ్ 4 మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లు, 18 బౌట్‌ల విజయాలతో మూడవ స్థానానికి చేరుకుంది. పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత గుజ్మాన్ లోపెజ్ యుస్నీలిస్‌పై మీనాక్షి ద్వారా పంజాబ్ ప్రారంభ 53 కిలోల మహిళల పోటీలో 6-0 తేడాతో క్లీన్ విజయాన్ని అందించింది. 74 కిలోల పురుషుల పోటీలో ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్ చంద్రమోహన్ నిరంతర దాడులతో యష్‌ను ఓడించాడు. మొదటి, రెండు పీరియడ్‌లలో చంద్రమోహన్ పదే పదే టేక్‌డౌన్‌లు, టర్న్‌లతో విజృంభించి 18-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని నమోదు చేశాడు. 76 కిలోల మహిళల టైలో పంజాబ్‌కు చెందిన ప్రియా ప్రారంభంలోనే గోల్ చేసి పంజాబ్‌ను 3-1తో ఆధిక్యంలోకి నెట్టింది. 86 కిలోల పురుషుల బౌట్‌లో అమిత్, సందీప్ మాన్ ఉత్కంఠభరితమైన పోరాటం జరిగింది. సందీప్ టేక్‌డౌన్, పుష్‌అవుట్‌తో 8-7 తేడాతో స్వల్ప విజయాన్ని సాధించి పంజాబ్ ఆధిక్యాన్ని సంపాదించింది.

# నేడే నాలుగో టి20

## పరువు కోసం న్యూజిలాండ్ పట్టు.. ఇప్పటికే టీమిండియా సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను మరో 2 మ్యాచ్‌లు మిగిలి ఉండగానే కైవసం చేసుకున్న టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. మ్యాచ్ గెలిచి ఓటమితో పోయిన పరువును నిలబెట్టుకోవాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. ఈ నెల 28, బుధవారం విశాఖపట్నం వేదికగా జరగనున్న నాలుగో టీ20లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. ఇప్పటికే సిరీస్ దక్కించుకోవడంతో ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో బెంచ్ ఆటగాళ్లను పరీక్షించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే తుది జట్టులో ఎవరిపై వేటు పడుతుంది, ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో 3 వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన జస్‌ప్రీత్ బుమ్రాకు విశాఖ మ్యాచ్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. మెగా టోర్నీకి ముందు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాను ఈ మ్యాచ్ నుంచి పక్కనపెట్టనున్నారు. అతని స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ బరిలోకి దిగనున్నాడు. బుమ్రాను కొనసాగించాలనుకుంటే హర్షిత్ రాణాపై వేటు పడుతుంది. మూడో టీ20కి దూరంగా ఉంచిన వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగితే రవి బిష్ణోయ్ ఉద్వాసనకు గురవుతాడు. అయితే మూడో టీ20లో బిష్ణోయ్ 2 వికెట్లతో సత్తా చాటాడు. వాషింగ్టన్ సుందర్ గాయపడిన నేపథ్యంలో బిష్ణోయ్‌ను అతనికి బ్యాకప్‌గా సిద్ధం చేయాలనుకుంటుంది. ఈ క్రమంలోనే నాలుగో టీ20లోనూ అతన్ని కొనసాగించే అవకాశం ఉంది. అవసరమైతే వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్‌లో ఒకరికి విశ్రాంతి ఇచ్చి మరీ బిష్ణోయ్‌ను బరిలోకి దించవచ్చు. ఇక వరుసగా మూడు టీ20ల్లో విఫలమైన సంజూ శాంసన్‌ను ఆఖరి అవకాశంగా నాలుగో టీ20లో ఆడించవచ్చు. అదే జరిగితే శ్రేయస్ అయ్యర్‌కు మరోసారి నిరాశే ఎదురు కానుంది. చివరి రెండు టీ20 మ్యాచ్‌లకు తిలక్ వర్మ దూరమవ్వడంతో అయ్యర్‌ను జట్టులో కొనసాగించారు. తిలక్ వర్మకు బ్యాకప్‌గా అయ్యర్‌ను రెడీ చేయాలనుకుంటే నాలుగో టీ20లో అతను ఆడవచ్చు. అప్పుడు సంజూ శాంసన్ లేదా ఇషాన్ కిషన్‌లో ఒకర్ని తప్పించవచ్చు. అవసరమైతే అభిషేక్ శర్మకు రెస్ట్ ఇవ్వవచ్చు. సిరీస్ గెలిచిన నేపథ్యంలో చివరి రెండు మ్యాచ్‌లను పూర్తిగా ప్రయోగాలకు వాడుకునే ఛాన్స్ ఉంది. ఓపెనర్ అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. రింకూ సింగ్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యాకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసం ఆర్డర్‌లో మార్పులు చేయవచ్చు.





# రికవరీ అవుతున్న భారత్ రూపాయి




**ముంబయి,జనవరి 27:** ప్రపంచ కరెన్సీ మార్కెట్లలో తీవ్ర ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రధాన కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడుతుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌ఐఐ) పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చున్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ.90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపింది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది. గత 18 నెలలుగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థలు నికర అమ్మకందారులుగా ఉన్నాయి. దీంతో పలు రంగాల్లో షేర్ల విలువ ఆకర్షణీయంగా మారింది.

అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే, డాలర్‌పై రాబడి తగ్గి, భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. బలహీనపడిన డాలర్, వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడుల మళ్లింపు వంటివి అవకాశాలను, అదే సమయంలో నష్టభయాలను కూడా సృష్టిస్తున్నాయి. భారత్‌లో స్థిరమైన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు కొనసాగితే, ప్రపంచ ఒడిదొడుకులు ఉన్నప్పటికీ రూపాయి ప్రస్తుత స్థాయిలోనే కొనసాగవచ్చని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ సేల్స్ హెడ్ పరాగ్ మోరే వివరించారు. 2025 ప్రారంభం నుంచి డాలర్ ఇండెక్స్ దాదాపు 9 శాతం పడిపోయి 98.60 వద్ద ఉంది. సముద్ర రవాణా మార్గాలకు అంతరాయాలు లేదా ముడిచమురు సరఫరాలో సమస్యలు తలెత్తితే స్వల్పకాలంలో డాలర్‌కు మళ్లీ డిమాండ్ పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి హెడ్జింగ్ వ్యూహాలు పాటించడం మంచిదని నివేదిక సూచించింది.




# ఉద్యోగాల్లో భారీ కోతపెడుతున్న అమెజాన్

**వాషింగ్టన్,జనవరి 27:** అమెజాన్ మరోసారి ఉద్యోగాల్లో భారీ కోత పెడుతోంది. 30 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించే ప్లాన్‌లో భాగంగా, ఇప్పటికే మొదటి విడతలో సగం మందిని విధుల నుంచి తొలగించింది. మిగతా వారిని కూడా తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఇది అమెజాన్ చరిత్రలోనే అతిపెద్ద ఉద్యోగ తగ్గింపు ప్రక్రియ. 2025 అక్టోబర్‌లో మొదటి దశలో సుమారు 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా, రెండో దశలో కూడా అదే స్థాయిలో కోతలు ఉండే అవకాశం ఉంది.

ఈ కోతలు ప్రధానంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్), రిటైల్ విభాగం, ప్రైమ్ వీడియో, పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ (హెచ్‌ఆర్) విభాగాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. అమెజాన్ మొత్తం 15 లక్షల మంది ఉద్యోగుల్లో ఇది కేవలం 2 శాతం మాత్రమే అయినప్పటికీ, కార్పొరేట్ స్థాయిలో దాదాపు 10 శాతం ఉద్యోగాలు తగ్గుతాయి. గతంలో ఉద్యోగ కోతలకు లాభాలు తగ్గడం, ఖర్చులు పెరగడం, ఎఐవల్ల ఆటోమేషన్ వచ్చినట్లు కంపెనీలు చెప్పేవి. కానీ అమెజాన్ సిఇఒ ఆండీ జాస్సీ ఈసారి కొత్త కారణం చెప్పారు. కల్చర్ అంటే సంస్థలో ఏర్పడిన బ్యూరోక్రసీ, లేయర్లు పెరగడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరగడం. ఉద్యోగులు పెరిగేకొద్దీ టీమ్‌లు పెరిగాయి, మేనేజర్లు మరో మేనేజర్లను నియమించుకున్నారు. ఒక్క నిర్ణయానికి అనేక అనుమతులు, సమీక్షలు, చర్చలు అవసరమవుతున్నాయి. బాధ్యత ఎవరిది అనేది స్పష్టంగా లేకుండా పోయింది. దీంతో కంపెనీ నెమ్మదిగా ముందుకు సాగుతోందని జాస్సీ భావిస్తున్నారు. అందుకే ఈ తొలగింపులను ఆర్థిక సమస్యగా కాకుండా సంస్థ నిర్మాణాన్ని సరిచేసే చర్యగా చూపిస్తున్నారు. ఎఐ పాత్ర లేదని పూర్తిగా చెప్పలేం.

గతంలోనే జాస్సీ ఎఐ వల్ల భవిష్యత్తులో కార్పొరేట్ ఉద్యోగాలు తగ్గుతాయని చెప్పారు. ఈసారి ప్రత్యక్ష కారణం ఎఐ కాకపోయినా, అది అమెజాన్ సామర్థ్య వ్యూహంలో భాగమే అని నిపుణులు అంటున్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ కోతలు గోదాములు, డెలివరీ సిబ్బందిపై పడలేదు. కీలక సిబ్బంది, కార్పొరేట్ ఉద్యోగులపైనే పడుతోంది. అక్టోబర్‌లో తొలగించిన ఉద్యోగులకు 90 రోజుల జీతం సెవరెన్స్ ప్యాకేజీ ఇచ్చారు. ఆ సమయంలో కంపెనీలోనే మరో ఉద్యోగం చూసుకోవచ్చు లేదా బయట అవకాశాలు వెతుక్కోవచ్చని చెప్పారు.

# వాట్సాప్ ప్రైవసీపై అమెరికా కోర్టులో దావా



**శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 27:** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగించే మెసేజింగ్ యాప్ వాట్సాప్ ప్రైవసీపై ఫిర్యాదులు పెరిగిపోయాయి. తమ సంభాషణలు ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో అత్యంత సురక్షితమని భావిస్తున్న యూజర్లను కలవరపరిచేలా, వారి ప్రైవేట్ మెసేజ్‌లను మాతృ సంస్థ మెటా చదవగలదని ఆరోపిస్తూ అమెరికాలో ఒక దావా దాఖలైంది. ఈ పరిణామంతో ప్రముఖ మెసేజింగ్ యాప్‌ల భద్రతపై మరోసారి పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో కోర్టులో ఈ నెల 23న ఈ దావా దాఖలైంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, మెక్సికో దేశాలకు చెందిన కొందరు యూజర్లు ఈ పిటిషన్ వేశారు. వారి ఆరోపణల ప్రకారం వాట్సాప్ ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానం బూటకమని, మెటా ఉద్యోగులు అంతర్గత టూల్స్ ఉపయోగించి యూజర్ల చాట్స్‌ను యాక్సెస్ చేయగలరని వారు ఆరోపించారు. యూజర్ ఐడీ ఆధారంగా ఇంజినీర్ల అనుమతితో మెసేజ్‌లను దాదాపు రియల్ టైంలో చూడొచ్చని, చివరకు డిలీట్ చేసిన కంటెంట్‌ను కూడా వీక్షించగలరని ఆరోపణల్లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు మద్దతుగా పిటిషనర్లు ఎలాంటి సాంకేతిక ఆధారాలను కోర్టుకు సమర్పించలేదు. ఈ దావాను మెటా సంస్థ తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా తప్పుడు, అసంబద్ధమైన ఆరోపణలని కొట్టిపారేసింది. వాట్సాప్ ఎండ్‌టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ పకడ్బందీగా పనిచేస్తుందని, ఎన్‌క్రిప్షన్ కీలు కేవలం యూజర్ల డివైజ్‌లలోనే ఉంటాయని స్పష్టం చేసింది. అందువల్ల తాము గానీ, తమ ఉద్యోగులు గానీ మెసేజ్‌లను డీక్రిప్ట్ చేయడం లేదా చదవడం సాంకేతికంగా అసాధ్యమని మెటా పునరుద్ఘాటించింది. ఈ వివాదంలోకి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా ప్రవేశించారు. వాట్సాప్ సురక్షితం కాదు అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించిన ఆయన, ఇతర ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల విశ్వసనీయతను కూడా ప్రశ్నించారు. దీనికి బదులుగా తమ ఎక్స్ చాట్ ఫీచర్‌ను ప్రయత్నించాలని యూజర్లకు సూచించారు.

# సెన్సెక్స్, నిఫ్టీలకు ఇండో యూరప్ ట్రేడ్ డీల్ సపోర్ట్

## లాభాల్లో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు

**ముంబయి, జనవరి 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, భారత్‌యూరోపియన్ యూనియన్ కూటమి(ఈయూ) మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో సూచీలు సానుకూలంగా స్థిరపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175.40 వద్ద నిలిచింది. సెన్సెక్స్ కూడా 319.78 పాయింట్లు పెరిగి 81,857.48 వద్ద ముగిసింది. భారత్, ఈయూ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ డీల్ పరిధిలో 2032 నాటికి భారత్‌కు ఈయూ నుంచి వస్తువుల ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా. భారత్‌కు వచ్చే దాదాపు 96.6 శాతం యూరోపియన్ వస్తువులపై సుంకాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. అదే సమయంలో, భారత్ నుంచి దిగుమతి చేసుకునే 99.5 శాతం వస్తువులపై ఈయూ సుంకాలను తగ్గించనుంది. ఇది ఇరుపక్షాల మధ్య వాణిజ్య అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. మార్కెట్లలో ఇవాళ రోజంతా అస్థిరత కనిపించింది. మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటిసి, మారుతీ సుజుకీ వంటి హెవీవెయిట్ షేర్లు 4 శాతం వరకు నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎన్టీపిసి, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఎస్‌బీఐ వంటి షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ షేర్లు 5 శాతం వరకు లాభపడి సూచీలకు మద్దతుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతం దూసుకెళ్లింది. అయితే, నిఫ్టీ మీడియా 1.4 శాతం, నిఫ్టీ ఆటో 0.9 శాతం చొప్పున నష్టపోయాయి. మిడ్‌క్యాప్; స్మాల్‌క్యాప్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి.

# క్షీణించిన ఏసియన్ పెయింట్స్ నికరలాభం



**ముంబయి, జనవరి 27:** ఏసియన్ పెయింట్స్ మంగళవారం 4.6శాతం నికరలాభాలు క్షీణించింది. గత ఏడాది 1110.5 కోట్లు లాభం ఆర్జిస్తే ఈసారి 1059.9 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ లేబర్‌కోడ్స్ అమలు ద్వారా ఒక్కసారిగా 63.74 కోట్లు అదనపు భారం భరించింది. కంపెనీ అనుకోకుండా వచ్చిన ఆకస్మిక ఖర్చులు 157.61 కోట్లు ఉన్నట్లు తెలిపింది. అలాగే గ్రాట్యుటీ భారం కూడా 52.88 కోట్లుగా ఉంది. మరో 10.86 కోట్లు కూడా ఉద్యోగుల సంక్షేమంపైనే ఖర్చుచేసింది. వైట్‌టీక్ కొనుగోలుద్వారా మరో 93.87 కోట్లు అదనపు భారం వల్లనే నికరలాభాల్లో తగ్గినట్లు కంపెనీ చెపుతోంది. ముంబయి కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ రాబడుల ద్వారా రూ.8849.72 కోట్లు ఆర్జించింది. గత ఏడాదితోపోలిస్తే 3.85శాతంపెరిగింది. డెకొరేటివ్ వ్యాపారం 7.9శాతం వృద్ధి ఉన్నట్లు తెలిపింది. మొత్తంగా కోటింగ్ బిజినెస్ 4.4శాతంగా ఉంది. పన్నులు,వడ్డీ చెల్లింపులకు ముందు పిబిడిఐటి 8.8శాతం వృద్ధితో 1781 కోట్లు ఆర్జించినట్లు ప్రకటించింది. శ్రీలంక యుఎఇ, ఇథియోపియా బిజినెస్ 869.6 కోట్లుగా ఉంది. బాత్ ఫిట్టింగ్స్‌లో అమ్మకాలు 4.1శాతం క్షీణించింది. కిచెన్ వ్యాపారం 2.6శాతంగా ఉంది. వైట్‌టీక్ నికర అమ్మకాలు 12.4శాతం పెరిగి 29.2కోట్లు చేరింది. ఎపిపిజి నెట్ సేల్స్ 16.5శాతం పెరిగి రూ.334.7 కోట్లుగా ఉంది. పిపిజిఎపి నికర విక్రయాలు కూడా 16.9శాతం పెరిగి 713.3కోట్లుగా ఉన్నట్లు ప్రకటించింది. ఏసియన్‌పెయింట్స్ షేర్లు 2.6శాతం క్షీణించి 2630 చొప్పున బిఎస్‌ఇలో ట్రేడ్ అయ్యాయి.




# రూ.447 కోట్లు మారికో నికరలాభం!

**ముంబయి, జనవరి 27:** ఎఫ్‌ఎంసిజి మేజర్ కంపెనీ మారికో తన నికరలాభాల్లో 12.03 శాతం పెరిగినట్లు ప్రకటించింది. మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.447 కోట్లు ఆర్జించినట్లు మంగళవారం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.399 కోట్లు మాత్రమే సాధించిన లాభాలు ఈసారి పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ రాబడులు కూడా 26.6శాతంపెరిగాయి. రూ.3537 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో 2794 కోట్లు మాత్రమే ఆర్జించింది. రాబడులు కూడా రూ.3458 కోట్లనుంచి 1.58శాతం పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ప్రధాన కేటగిరీల్లో లాభదాయకత పెరిగింది. ఫుడ్ డిజిటల్‌ఫస్ట్ బిజినెస్ ధోరణుల్లో కొంతమేర మెరుగుపడ్డాయి.

అంతర్జాతీయ వాణిజ్యం కంపెనీకి గ్రోత్ ఇంజిన్‌గా మారినట్లు చెప్పింది మార్కెట్లలో ఈసారి మూడోత్రైమాసికంలో మంచి ఫలితాలు రాబట్టుకోగలిగామని ఎండి సిఇఒ సౌగత గుప్తా చెప్పారు. వార్షికవృద్ధి 11శాతంగా ఉన్నట్లు వెల్లడించింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 16.7శాతంగా ఉంది. అయితేకంపెనీపై లేబర్‌కోడ్‌ల అమలు ద్వారా ఆరుకోట్లు అదనపు భారం పడిందని వివరించింది. భారత్‌లో కంపెనీ రాబడులు రూ.2681 కోట్లుగా ఉన్నాయి. మంగళవారం మార్కెట్లలో మారికో షేర్లు రూ.747.20గా కొనసాగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.